www.jagritiweekly.com
సంపుటి : 76 సంచిక : 42 పుటలు : 52

# జాగృతి

కలి 5126-శ్రీ క్రోధి శ్రావణ బహుళ అష్టమి
26 ఆగస్ట్ - 01 సెప్టెంబర్ 2024
వెల : ₹20/-




# ప్రభుత్వ హత్య!

మైనారిటీల బుజ్జగింపునకే అంకితమైన పార్టీగా అంతా భావిస్తున్న తృణమూల్ కాంగ్రెస్, తాను మత్తుమందుల మాఫియా ప్రతినిధినని కూడా నిరూపించుకుంది

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

76 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# న్యూయార్క్‌లో విహరించిన అయోధ్య రాముడు



అన్ని ఆటంకాలనూ అధిగమించి ఆగస్ట్ 18న న్యూయార్క్ నగరంలో ఆరంభమైన 42వ ఇండియా దే ఊరేగింపులో అయోధ్య రామ మందిరం నమూనా పాల్గొన్నది. భారతీయులు జాతీయ పతాకాలతో, దేశభక్తి నినాదాలు చేస్తూ ఉత్సాహంగా రథం వెంట నడిచారు. రామాలయం నమూనా పూర్తిగా చెక్కతో తయారు చేసింది. హిందూ భక్తిగీతాలు, భజనల మధ్య తీవీగా న్యూయార్క్ నగర వీధులను మందిర నమూనా పావనం చేయడం విశేషం.

వివరాలు 11వ పేజీలో..





## భారతీయ సాహితీ ద్రష్ట
## భండారు సదాశివరావు స్మారక

# కథల పోటీ

జాగృతి వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచిక కోసం
ప్రఖ్యాత సాహితీవేత్త భండారు సదాశివరావు స్మారక
'కథల పోటీ - 2024' నిర్వహిస్తున్నాం. రచయితలకు ఆహ్వానం..



**ప్రథమ బహుమతి : రూ. 12000/-**
**ద్వితీయ బహుమతి : రూ. 7000/-**
**తృతీయ బహుమతి : రూ. 5000/-**

### నిబంధనలు :



1. సమకాలీనం, చారిత్రకం, సైన్స్ ఫిక్షన్ ఇతివృత్తంతో కూడిన కథలను పంపవచ్చు. భారతీయ సామాజిక జీవనమే నేపథ్యంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఆంగ్ల పదాలను పరిహరించండి.
2. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఎనిమిది కథలకు రూ.1,000 చొప్పన ప్రోత్సాహక బహుమతి, సాధారణ ప్రచురణకు స్వీకరించిన ప్రతి కథకు జాగృతి పారితోషికం ఉంటాయి.
3. కథ నిడివి 1500 పదాలకు మించరాదు. ఒక రచయిత 2 కథలకు మించి పంపరాదు.
4. కథ స్వంతమేనని, అనువాదం, అనుసరణ కాదని, బ్లాగుల్లోనూ, వెబ్ పత్రికల్లోనూ మరెక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని; పరిశీలనలో లేదని విడిగా హామీపత్రం జతచేయాలి. హామీపత్రంలో రచయిత పేరు, చిరునామా, ఇ-మెయిల్ ఐడి, ఫోన్ నంబర్ తప్పక రాయండి. కథ రాసిన పుటలలో ఎక్కడా రచయిత పేరు గానీ, ఇతర వివరాలేవి ఉండరాదు.
5. కథలను తెలుగులో అను లేదా యూనికోడ్ ఫాంట్‌లో డిటిపి చేసి jagriticompetition@gmail.com కు మెయిల్ చేయాలి.
6. పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపాలనుకుంటే 'కథల పోటీ' జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్-500027 కు పంపొచ్చు. జాగృతికి కథల్ని చేర్చే బాధ్యత రచయితలదే.
7. కథల ఎంపికలో ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావులేదు. సంపాదకునిదే అంతిమ నిర్ణయం.
8. దీపావళి సంచిక నుంచి ఆరంభించి, వరుసగా ఈ కథలను ప్రచురిస్తాం.

**కథలు జాగృతికి చేరడానికి చివరి తేది : 31 ఆగస్ట్, 2024**

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
040-27561453 / 9959997013

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

కె. దుర్గారెడ్డి : అసోసియేట్ ఎడిటర్ -
సబ్ ఎడిటర్ : - 9959991304

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అంకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 సంవత్సర చందా రూ.850

**బ్యాంకు ఖాతా వివరాలు**

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

స్వాతంత్ర్యోద్యమం తుదిదశలో జరిగిన 'కలకత్తా హత్యలు' చరిత్రను గగుర్పాటుకు గురి చేస్తాయి. అలాంటి గగుర్పాటుతోనే పశ్చిమ బెంగాల్ ఘనతను నిలబెట్టాలని నలభయ్ ఏళ్లుగా అక్కడి పాలకులు అనుకుంటున్న సంగతి వర్తమాన భారతం గమనించవలసిన విషయం. నిన్న సీపీఎం, ఇప్పుడు టీఎంసీ సాగిస్తున్న హత్యలు నాటి కలకత్తా హత్యల సంప్రదాయానికి కొనసాగింపే. పైగా ప్రభుత్వాలు బాధితుల వైపు ఉండకుండా, నేరంలోని తీవ్రతను, రాక్షసత్వాన్ని గమనించకుండా కరుడగట్టిన నేరగాళ్లను వెనుకేసుకువచ్చే తెంపరితనం కూడా ఆ రాష్ట్ర పాలకులలో ఇబ్బడిముబ్బడిగా కనిపిస్తూనే ఉంది.

ఆమె బెంగాల్ ముఖ్యమంత్రి. పేరు మమతా బెనర్జీ. మానవత్వంతో వ్యవహరించడం నేతలకు అవమానమన్న తీరుతో చరిత్రకెక్కిన ఇడీ అమీన్, పోల్‌పాట్ వంటి వ్యక్తుల కోవలోనిదామె. ప్రజాస్వామిక రాజకీయాలకు కళంకం. సగం మంత్రిత్వ శాఖలు ఆమె చేతులలోనే బందీలుగా ఉన్నాయి. అందులో హోంశాఖ ఒకటి. అయినా ప్రఖ్యాత కోల్‌కతా నగరంలో ఆర్‌జీ కార్ ప్రభుత్వ ఆసుపత్రిలో పీజీ డాక్టర్‌ను పరమ ఘోరంగా హత్య చేస్తే, ఆ వైద్యురాలికి న్యాయం జరగాలంటూ ముఖ్యమంత్రే నిరసన ప్రదర్శనకు దిగడం ఏమిటి? ఇంతకు మించిన దుండగీడుతనం ఉందా? ఆ అమానుషత్వం పట్ల ఇంతకు మించిన వెటకార ధోరణి ఉందా? ఒక రాజకీయ నేత నైతిక పతనానికీ, సిగ్గుమాలిన తనానికీ ఇది పరాకాష్ట కాదా? ఆ వైద్యురాలి హత్యకు సంబంధించి ఆది నుంచి అన్నీ అబద్ధాలే. ప్రతి అడుగులోను బాధ్యతా రాహిత్యమే. ప్రభుత్వ ప్రతి చర్య ప్రజాద్రోహంతో కూడినదే. మొదట తల్లిదండ్రులకు ఆత్మహత్య అని చెప్పారు. తాను అధిపతిగా ఉన్న వ్యవస్థ ప్రాంగణంలోనే హత్య జరిగితే మొద్దు నిద్ర పోయిన ప్రిన్సిపాల్‌ను మెడపట్టి గెంటకుండా క్షణాలలో పదోన్నతి కల్పించారు. మొన్న ఫిబ్రవరిలో సందేశ్‌ఖాలి దురంతంలో షేక్ షాజహాన్‌ను ఏ విధంగా రక్షించే ప్రయత్నం జరిగిందో, అదే తీరులో ఈ హంతక ప్రిన్సిపాల్‌ను రక్షించే యత్నం సిగ్గూ లజ్జా లేని రీతిలో ఆ ప్రభుత్వమే చేసింది. అంటే, ముఖ్యమంత్రి మమత. తరువాత, సమయమే లేదన్నట్టు దుర్ఘటన జరిగిన స్థలంలో ఆగమేఘాల

**శాలివాహన 1946 శ్రీ క్రోధి శ్రావణ బహుళ అష్టమి**

## లోపలి పేజీలలో...




6లో
ముఖపత్ర కథనం
ప్రభుత్వ హత్య!

కథ
సీనియర్ సిటిజన్
– జి.యస్.కె. సాయిబాబా
20లో

ప్రత్యేక వ్యాసం
ధర్మరక్షకుడు దామోదరుడు
26లో





# జాగృతి

## సంపాదకీయం

మీద కూల్చివేతలు చేపట్టారు. జరిగిన దారుణానికి నిరసనగా ధర్నాలు చేపట్టిన విద్యార్థుల మీద అధికార గూండాలు ఆసుపత్రి ప్రాంగణంలోనే దాడులకు తెగబడ్డారు. దీనికి పరాకాష్ట–దోషులను పట్టుకుని కఠినంగా శిక్షించాలంటూ, కేసును త్వరగా తేల్చాలంటూ, బాధితురాలి ఆత్మకు శాంతి చేకూరే విధంగా న్యాయం జరగాలని సాక్షాత్తు ముఖ్యమంత్రి, తన తైనాతీ మహిళా కార్యకర్తలను వెంటేసుకుని నిస్సిగ్గుగా కోల్‌కతా వీధులలో ఊరేగడం. ఈ దారుణాలతో సమానమైనది– వైద్య సేవలు నిలిపివేయడం వల్ల ప్రజాగ్రహం పెల్లుబికితే డాక్టర్‌లని మేం మాత్రం రక్షించం అంటూ టీఎంసీ ఎంపీలు బెదిరించడం.

## కలకత్తా హత్యలు

మమత రాజీనామా చేయాలంటూ లేచే వేళ్లని విరిచేస్తామన్న హెచ్చరిక ఇంకొకటి.

ఎన్నికలు జరిగితే హింస. హిందువుల పండుగలు వస్తే రక్తపాతం. సొంత పార్టీ నేతల చేతులలో లైంగిక అత్యాచారాలకు గురైన సొంత పార్టీ మహిళలు గొంతెత్తితే పోలీసు అరాచకం. వైద్య కళాశాలలు అధికార పార్టీకి ఏటీఎంలుగా మారాయన్న విమర్శ. అవి ఆసుపత్రులో, మానవ అవయవాలు సరఫరా చేసే దుకాణాలో అర్థం కాని పరిస్థితి అన్న ఆరోపణ. పోలీసు వ్యవస్థ అంటే అధికార పార్టీకి అధికారిక గూండా వ్యవస్థ. ఇదీ పశ్చిమ బెంగాల్ వాస్తవరూపం. అయినా ఈ పార్టీ ఎంపీలు పార్లమెంట్‌లో రాజ్యాంగ రక్షణ పేరుతో చేసే విన్యాసాలకు లోటు లేదు. వారి వికారాలకు అదుపు లేదు. సర్కస్‌లో బఫూన్‌లా, తోలుబొమ్మలాటలో గంధోళీగాడూ కూడా సిగ్గుపడే రీతిలో జుగుప్సాకర చేష్టలకు ఒడిగడుతున్నారు. ఒక సభ్యుడైతే అధ్యక్షస్థానం మీద పిచ్చికుక్కలా రెచ్చిపోవడం నిత్యకృత్యం. కానీ సొంత రాష్ట్రంలో ఏం జరుగుతోంది? అది మాత్రం అడగవద్దు. ఆ ఘోష వారికి వినపడదు. ఆ కన్నీళ్లు వీళ్లకి కనపడవు. దేశమంతా స్పందించినా, వైద్యసేవలు నిలిచిపోయినా టీఎంసీ నేతలకు మాత్రం బుద్ధి రావడం లేదు.

జరిగిన ఘోరాన్ని బట్టి కాదు సానుభూతి. కనిపిస్తున్న అమానవీయతను బట్టి కాదు కన్నీళ్లు. రాష్ట్రాన్ని బట్టి సానుభూతి. రాజకీయాలను బట్టి కన్నీళ్లు. ఇదీ ఇవాళ దేశంలోని విపక్ష నేతలు, ఉదారవాదులు, స్త్రీవాదులు, చాలామంది పత్రికా రచయితల, మేధావుల నీచత్వపు స్థాయి. పొరపాటున రాహుల్ గాంధీ ఈ దారుణం మీద నోరెత్తాడు. దీనికి మమత ప్రతిస్పందన–మీ సిద్ధరామయ్యను రాజీనామా చేయమని ఆదేశిస్తారా? అనే. మమతా బెనర్జీని బలమైన భాగస్వామిగా భావించే రాహుల్ గాంధీకి సిద్ధరామయ్యను రాజీనామా చేయమనే దమ్ము ఎలా వస్తుంది? మమత, రాహుల్, కేసీఆర్, హేమంత్ సోరెన్, ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్, పినరయ్ విజయన్, ఎంకే స్టాలిన్– అందరిదీ ఒకటే దబాయింపు. ఎన్ని అకృత్యాలయినా చేయవచ్చు. ఎంత హిందూ వ్యతిరేకతనైనా ప్రదర్శించవచ్చు. రాజ్యాంగాన్ని, పార్లమెంటును ఎంతైనా కించపరచవచ్చు. ఎంత అవినీతిలో అయినా కూరుకుపోవచ్చు. తప్పుకానేకాదు. ఎందుకంటే బీజేపీ 'విభజన, మత రాజకీయాలని' నిరోధించే పురోగాములట.

మమతా బెనర్జీ, అంతకు ముందు ఉద్ధరించిన జ్యోతిబసు, భట్టాచార్య 1946 హత్యల కారకుడు సుహ్రావర్దికి వారసులు. వీళ్లంతా హత్యలతో బెంగాల్ కీర్తిప్రతిష్ఠలను సర్వనాశనం చేసిన ఘనులు. గడచిన నలభయ్ ఏళ్లుగా పాలన పేరుతో అక్కడ సాగుతున్న హత్యాకాండ స్వతంత్ర భారతదేశ చరిత్రకే మాయనిమచ్చ. ఇంతకాలం అలాంటి ఏలికలకు అధికారం అప్పగించినందుకు బెంగాలీలు తలొంచుకోక తప్పదు. తమది వివేకానందుడు, అరవిందుడు, సీఆర్ దాస్, బంకించంద్రుడు, రవీంద్రుడు వంటి నేతలు పుట్టిన గడ్డ అన్న సంగతి బెంగాలీలకు గుర్తుంటే తలవంచుకోవడానికి సిగ్గు పడక్కరలేదు. ★

26 ఆగస్ట్ 2024, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



40లో

కథ

**ఆటస్థలం**

– సి. కుమార యశస్వి





| | | |
|---|---|---|
| అగ్రశక్తులకు క్రీడా మైదానంగా మారిన.. (అంతర్జాతీయం) | – | 12 |
| రుణమాఫీపై మాటల మంటలు (తెలంగాణ) | – | 14 |
| దస్త్రాల దహనంతో కలకలం (ఆంధ్రప్రదేశ్) | – | 16 |
| బ్రిటన్ అల్లర్లు.. అసలు నిజాలు (అంతర్జాతీయం–1) | – | 23 |
| పదకవితారాధక శోభ (మహిళ) | – | 28 |
| అసత్యాల సాలెగూడు 'హిండెన్‌బర్గ్' (జాతీయం) | – | 30 |
| వక్ఫ్ బోర్డు ఒంటెత్తు పోకడలకు అడ్డుకట్ట (చర్చ) | – | 32 |
| 2024 యువ భారత్.. 2047 వికసిత భారత్ (బడ్జెట్) | – | 35 |
| క్రీడలంటే ఆటలే కాదోయ్!..కోట్లు, కీర్తిప్రతిష్టలు! (క్రీడ) | – | 43 |
| జాతీయ సినిమా అవార్డులు మనకెందుకు రాలేదు!? (సినిమా) | – | 50 |

అరాచకం నుంచి ఆటవిక పాలనలోకి ప్రయాణించింది పశ్చిమ బెంగాల్. ఈ సంవత్సరం ఆరు మాసాలలోనే దేశం విస్తుపోయే రెండు దారుణ సంఘటనలు అక్కడ జరిగాయి. ఫిబ్రవరిలో సందేశ్‌కాలి దురంతం. ఆగస్ట్‌లో కోల్‌కతా రాజాగోవింద్ కర్ వైద్య కళాశాల దురాగతం. రెండూ స్త్రీల మీద అత్యాచారాలే. పాలిస్తున్నది ఒక స్త్రీ. ఆ వైద్య కళాశాలలో పీజీ డాక్టర్‌ను అతి దారుణంగా హత్య చేసిన ఘటన ఇప్పుడు దేశాన్ని కదిపింది. దేశంలోని ప్రతి ఆసుపత్రి నిరసన వ్యక్తం చేస్తున్నది. అయినా అక్కడ మమతా బెనర్జీ నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంలో కదలిక లేదు. ఆ పార్టీలో చలనం లేదు. దేశం మొత్తం చీదరించుకుంటున్నది. కోర్టులు మండి పడుతున్నాయి. నిన్నటిదాకా మైనారిటీల బుజ్జగింపునకే అంకితమైన పార్టీగా అంతా భావిస్తున్న తృణమూల్ కాంగ్రెస్, తాను మత్తుమందుల మాఫియా ప్రతినిధినని కూడా నిరూపించుకుందని ఇప్పుడు సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 31 ఏళ్ల పీజీ డాక్టర్‌పై లైంగిక అత్యాచారం, ఆ పై హత్య జరిగినా దోషులను రక్షించడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నమే జుగుప్స కలిగిస్తున్నది. దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ కేసును సుమోటోగా స్వీకరించడంతో కొత్త మలుపు తిరిగింది.



# ప్రభు

కోల్‌కతాలోని ఆర్‌జి కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో ఒక మహిళా ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం జరిగిన సంఘటన దేశాన్ని కుదిపేసింది. నేరగాళ్లను కఠినంగా శిక్షించాలని, ఆసుపత్రుల్లో తమకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ డాక్టర్లు దేశవ్యాప్తంగా ఆందోళనకు దిగారు. అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయి. తమ భద్రతకు సంబంధించి కఠిన చట్టాలు అమల్లోకి తేవాలన్న వారి డిమాండ్ సహేతుకం!




పశ్చిమబెంగాల్ ప్రతిపక్షాలు బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం విడివిడిగా ర్యాలీలు నిర్వహించి నేరగాళ్లను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేయడం ఒక ఎత్తు. సాక్షాత్తు ముఖ్యమంత్రి నేతృత్వంలో తృణమూల్ కాంగ్రెస్ తరపున ఆగస్ట్ 17వ తేదీన కోల్‌కతాలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించడం ద్వారా దిగజారుడు రాజకీయానికి సరికొత్త భాష్యం చెప్పడం మరో ఎత్తు!

హత్యకు గురైన పీజీ డాక్టర్ కంట్లో నుంచి రక్తం వచ్చిందని పోస్ట్‌మార్టం నివేదిక చెప్పింది. ఇప్పుడు ముఖ్యమంత్రి మమత ర్యాలీ దేశ ప్రజలకే రక్తకన్నీరు తెచ్చింది. ఆ డాక్టర్ మృతదేహం అర్ధనగ్నంగా అదే ఆసుపత్రి ప్రాంగణంలో లభించిన కొన్ని గంటలలోనే దాదాపు నలభయ్ మంది లోపలికి ప్రవేశించి విధ్వంసం సృష్టించారు. నిజానికి కొన్ని ఆధారాలు నాశనం చేశారు. ఆ విధ్వంసం వెనుక బీజేపీ, సీపీఎంల హస్తమున్నదంటూ ఎదురుదాడికి దిగిన ఆమె ఎవరికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించినట్టు? విపక్షాలకా? లేక తన ప్రభుత్వానికా? ఇది ఆమెకే తెలియాలి. సాక్ష్యాధారాలను మాయం చేయడానికే విపక్షాలు ఆసుపత్రిలో విధ్వంసాన్ని సృష్టించాయని చెప్పడం రాజకీయ తెంపరితనం తప్ప మరోటికాదు! హత్యాచారానికి గురైన కుటుంబానికి న్యాయం చేయాలనేది ఆమె డిమాండు! అసలు న్యాయం చేయాల్సింది ఎవరు? తన ప్రభుత్వమే కదా! అదీకాకుండా వైద్య, ఆరోగ్యశాఖ తన అధీనంలోనే ఉంది!! శాంతిభద్రతలకు పూచీపడే హోంశాఖ కూడా ఆమె చేతిలోనే ఉంది. మరి చిల్లర రాజకీయాలు చేస్తున్నదెవరు? తృణమూల్ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎన్నడూ లేని రీతిలో దిగజారి పోయాయని, కేవలం ఒక్క మహిళా డాక్టర్ మాత్రమే కాదు, పశ్చిమ బెంగాల్ సంస్కృతి, విద్య, నాగరికత మొత్తం అత్యాచారానికి గురయ్యాయంటూ కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి చేసిన ఆరోపణలు అక్షరసత్యం! దేశంలో ఏ రాష్ట్రంలో లేని అరాచక పాలన కొనసాగుతుంది పశ్చిమ బెంగాల్‌లోనే! పీజీ డాక్టర్ తాజా హత్యోదంతం, ఆపై ప్రభుత్వం, పోలీసులు, ఆసుపత్రి యాజమాన్యం వ్యవహరించిన తీరు ఇందుకు ప్రబల నిదర్శనం.

### ఆత్మహత్య అంటూ ఫోన్‌కాల్

'మీ కుమార్తె ఆత్మహత్య చేసుకున్నదంటూ' ఆసుపత్రి అసిస్టెంట్ సూపరింటెండెంట్ నుంచి మొట్టమొదట తమకు కాల్ వచ్చిందని హతురాలి తండ్రి తెలిపినట్లు అమృత్‌బజార్ పత్రిక పేర్కొంది. ఫోన్ చేసిన అధికారి తన పేరు వెల్లడించలేదని ఆయన్ను ఉటంకిస్తూ ఎన్‌డీటీవీ పేర్కొంది. విచిత్రమేమంటే, ట్రైనీ డాక్టర్ మృతదేహం లభించిన ప్రదేశానికి అత్యంత సమీపంలో మరమ్మతుల పేరిట గోడలు పగలగొట్టడం కూడా వివాదాన్ని సృష్టించింది. కేవలం సాక్ష్యాధారాలను లేకుండా చేయడానికి తప్ప, విచారణ పూర్తికాకుండానే మరమ్మతులకు తొందరేమొచ్చిందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇదే అంశాన్ని కలకత్తా హైకోర్టు, సుప్రీంకోర్టు కూడా ప్రశ్నించాయి. నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ కూడా




# త్వ హత్యా!

ఈ సంఘటనను సుమోటోగా స్వీకరించి జరిపిన విచారణలో కూడా ఇదే అంశాన్ని ఎత్తి చూపింది. కళాశాల మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ విచారణ అసంపూర్తిగా ఉన్నదని కూడా తన ప్రాథమిక నివేదికలో పేర్కొంది. పశ్చిమ బెంగాల్ డాక్టర్ల సంఘం సీబీఐకి రాసిన ఒక లేఖలో ఇదే అంశాన్ని స్పష్టంగా పేర్కొంది. ఆసుపత్రిలో ట్రైనీడాక్టర్ శవం లభ్యమైన ప్రదేశానికి సమీపంలో మరమ్మతు పనులు చేపట్టడం సాక్ష్యాలను ధ్వంసం చేయడానికి తప్ప, సంఘటన ప్రదేశంలో అప్పటికప్పుడు సివిల్ పనులు చేపట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని వారు ప్రశ్నించారు.

## పోస్ట్‌మార్టం నివేదిక

ప్రధాన నిందితుడు పోలీసుల వలంటీర్ సంజయ్ రాయ్‌తో పాటు మరికొందరి ప్రమేయం ఉన్నదన్న అనుమానాలను పోస్ట్‌మార్టం నివేదిక బలపరుస్తోంది. మృతురాలి జననాంగంలో 151 మిల్లీగ్రాముల వీర్యం ఉన్నట్లు జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. మీడియాలో వచ్చిన వార్తల ప్రకారం, "సామూహిక అత్యాచారం తర్వాత గొంతు నులిమి చంపేశారు. పెనుగులాట సందర్భంగా తలను గోడకు బలంగా నొక్కి పట్టడంతో వెనుకవైపు పెద్ద గాయమైంది. ముఖమంతా గీరుకుపోయింది. కేకలు వేయకుండా నోరు మూసేశారు. గొంతుపై బలంగా నొక్కడంతో థైరాయిడ్ కార్టిలేజ్ చితికిపోయింది. జననాంగాల వద్ద లోతైన గాయమైంది. లైంగిక దాడే అందుకు కారణం. నడుము, పెదాలు, చేతివేళ్లు, ఎడమకాలిపై గాయాలున్నాయి. రెండు కళ్లనుంచి, నోటినుంచి రక్తస్రావమైంది. ముక్కు, నోరు గట్టిగా అదిమినట్టు చర్మం కమిలింది". కాళ్లను పక్కకు విరిచేశారని బంధువు ఒకావిడ విలపిస్తూ చెప్పారు. కళ్లద్దాలముక్కలు కంట్లో ఉన్నాయి. ఊపిరాడకుండా చేసి చంపేశారని ఆమె విలపిస్తూ చెప్పారు. అయితే ట్రైనీ డాక్టర్‌ది ఆత్మహత్య అవకాశాలే అధికమని మృతురాలి కుటుంబ సభ్యులకు తెలిపామంటూ వచ్చిన వార్తలను పోలీసులు ఆగస్టు 14న ఖండించడమే కాదు మృతదేహాన్ని తాము సమాధి చేయలేదని, కుటుంబ సభ్యులే అంత్యక్రియలు నిర్వహించారని స్పష్టం చేశారు.

## నిందితుడి అరెస్ట్

పోలీసు వలంటీరుగా పనిచేస్తున్న సంజయ్ రాయ్ (31)ను ప్రధాన నిందితుడిగా గుర్తించి ఆగస్ట్ 10వ తేదీన పోలీసులు అరెస్ట్ చేశారు. ఆగస్ట్ 9వ తేదీ తెల్లవారు జామును 3 నుంచి 5గంటల లోపు ట్రైనీ డాక్టర్ పై ఆసుపత్రి మూడో అంతస్తులో ఛెస్ట్ డిపార్ట్‌మెంట్ సెమినార్ హాలులో అత్యాచారం, హత్య జరిగాయి. సరిగ్గా సంఘటన జరిగిన సమయంలో సంజయ్ రాయ్ ఆసుపత్రిలో సంచరించినట్టు సి.సి. ఫూటేజ్‌ల్లో నమోదు కావడం, నేరం జరిగిన ప్రదేశంలో రాయ్ బ్లూటూత్ హెడ్‌ఫోన్ లభించడం అతడి అరెస్ట్‌కు దారితీసింది. నేరం జరిగిన సమయానికి అతను సి.సి.ఫూటేజ్ ల్లో కనిపించడం, ఫోరెన్సిక్ నివేదికలో బాధితురాలి వేలిగోళ్లలో ఉన్న రక్తం మరకలు, నిందితుడి చర్మంతో సరిపోలడంకూడా ప్రధాన ఆధారాలుగా నిలిచాయి. సంజయ్‌రాయ్‌కి లై డిటెక్టర్ పరీక్ష జరపడానికి కలకత్తా హైకోర్టు అనుమతించడం పెద్ద సంచలనమే. ఎందుకంటే దేశ నేరచరిత్రలోనే ఇలాంటి పరీక్షకు అనుమతి ఇవ్వడం ఇది ఐదోసారి. కాబట్టి ఈ కేసు తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

## సీబీఐకి అప్పగింత

కేసును విచారిస్తున్న కోల్‌కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టి.ఎస్. శివజ్ఞానం నేతృత్వంలోని డివిజన్ బెంచ్ ఆగస్టు 13వ తేదీన ఈకేసును సీబీఐకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. జూనియర్ డాక్టర్లు తక్షణమే తమ ఆందోళన విరమించి విధుల్లో చేరాలని కోరింది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా జూనియర్ డాక్టర్లు విధుల్లో చేరాలని చేసిన విజ్ఞప్తిని జూనియర్ డాక్టర్లు తిరస్కరిస్తూ నిజమైన నేరగాళ్లను అరెస్ట్ చేసేవరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తమ కుమార్తెపై జరిగిన అత్యాచారం, హత్య సంఘటనలో అదే ఆసుపత్రిలో పనిచేస్తున్న కొందరు జూనియర్ వైద్యులు, ఇతర సీనియర్ వైద్యుల ప్రమేయం ఉన్నదని అనుమానిస్తున్నట్టు తల్లిదండ్రులు చెప్పారని సీబీఐ అధికార్లు వెల్లడించారు. కొన్ని పేర్లను సైతం బయటపెట్టారని, 30 మందిని పిలిపించి విచారించాలని నిర్ణయించినట్టు వారు వివరించారు.

## ఆసుపత్రిపై అల్లరిమూకల దాడి

ఇలా ఉండగా ఆగస్టు 14 బుధవారం అర్థరాత్రి దాటిన తర్వాత 12.40 ప్రాంతంలో కొందరు అల్లరిమూకలు ఆర్.జి.కర్ మెడికల్ ఆసుపత్రిపై ఆకస్మికంగా దాడికి పాల్పడ్డారు. ఒకపక్క ఆగస్ట్ 9న జరిగిన హత్యాచార సంఘటనపై జూనియర్ డాక్టర్లు ఆందోళన కొనసాగిస్తుండగానే, ఈ మూకలు ఆసుపత్రి ఆస్తులను ధ్వంసంచేశారు. కేసును సీబీఐ విచారిస్తున్న తరుణంలో సాక్ష్యాధారాలను ధ్వంసం చేయడానికే ఒక పథకం ప్రకారం ఈ దాడులు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. అల్లరి మూకలు అత్యవసర విభాగాన్ని కూడా విడిచిపెట్టలేదు. అక్కడ మందులతో సహా పూర్తి విధ్వంసానికి పాల్పడ్డారు. అడ్డొచ్చిన నర్సులను నెట్టేసి, కర్రలు, ఇటుకలు, ఇనుపరాడ్లతో విధ్వంసం సృష్టించి,



జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

ఎమర్జెన్సీ, ఔట్‌పేషెంట్ వార్డులు, నర్సింగ్ స్టేషన్, మెడికల్ స్టోర్‌లో పరికరాలు, ఔషధాలను చిందర వందర చేయడం, సీసీటీవీ కెమోరాలను పగుల గొట్టడం, ఇటుకరాళ్లతో దాడి చేయడం దేనికి సంకేతం? అక్కడే వున్న పోలీసు వాహనాలను పూర్తిగా ధ్వంసం చేశారు. అదనపు బలగాలు వచ్చి లాఠీచార్జ్, బాష్పవాయు ప్రయోగం చేపట్టడంతో పారిపోయారు. రోగులు హాహాకారాలు చేశారు. చికిత్స పొందకుండానే కొందరు తమ ఊళ్లకు వెళ్లిపోయారు. విపక్షాలు నిర్వహించిన ర్యాలీకి ప్రతిగా తమ పార్టీ తనపున ఆగస్ట్ 17న కోల్‌కతాలోని మౌలాలి నుంచి ధర్మంతల వరకు ర్యాలీ చేపడతామని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించిన కొద్ది గంటల వ్యవధిలోనే ఈ దాడులు జరగడం గమనార్హం.

“దాడికి ముందే అల్లరి మూకలు గుమికూడ టాన్ని గమనించి, పోలీసులకు తెలిపినా వారు పట్టించుకోలేదు. తీరా దాడులు ప్రారంభమయ్యాక పోలీసులంతా ఆసుప్రతిలోకి పారిపోయి వచ్చారు” అని అంకిత్ మైతీ అనే జూనియర్ డాక్టర్ మీడియాకు వెల్లడించారు. కాగా పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్ మాత్రం “సోషల్ మీడియా, ఆన్‌లైన్ న్యూస్‌ల్లో 31ఏళ్ల మహిళా ట్రైనీ డాక్టర్ హత్యపై రెచ్చగొట్టే రీతిలో ప్రచారం చేయడమే ఈ దాడులకు కారణం’ అని ఆరోపించారు. ‘మేం ఇప్పటికే ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేశాం. ఈ సంఘటనలో ఇంకా కొంతమంది ప్రమేయం వుండే అవకాశం ఉంది. కేసు విచారిస్తున్నాం. కానీ పోలీసులపైనే వ్యతిరేక ప్రచారం జరుగుతోంది’ అన్నారు. ఒకవేళ సాక్ష్యాధారాలను పోలీసులు ధ్వంసం చేశారని సీబీఐ నిరూపిస్తే, చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. అదేరోజు రాత్రి ఆసుపత్రికి పది కిలోమీటర్ల దూరంలో జాదవ్‌పూర్ యూనివర్సిటీ నుంచి పౌరులు రాత్రి నిర్వహించ తలపెట్టిన ఆందోళన కార్యక్రమంపై పడింది.


ప్రిన్సిపాల్ ఘోష్

## హైకోర్టు మొట్టికాయలు

ఆర్‌జీ కార్ ఆసుపత్రిలో దుండగులు సృష్టించిన మారణకాండపై కల్‌కత్తా హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం వల్లనే ఈ విధ్వంసం జరిగిందని పేర్కొంది. ఆసుపత్రి దాడిపై వేర్వేరుగా వివరణ ఇవ్వాలని, విడివిడిగా అఫిడవిట్లు దాఖలు చేయాలని, పోలీసు, ఆసుపత్రి వర్గాలను ఆదేశించింది. ఆర్‌జీ కార్ ఆసుపత్రిలో జరిగిన విధ్వంసాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ టి.ఎస్. శివజ్ఞానం నేతృత్వంలోని ధర్మాసనం 16వ తేదీన విచారణ చేపట్టింది. వైద్యురాలి మృతదేహం లభించిన గదిని శుభ్రం చేసి రంగులు వేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించింది. ఆసుపత్రిని మూసివేయాలని ఆదేశాలివ్వగలమని న్యాయ మూర్తులు హెచ్చరించారు. కేసుపై మధ్యంతర నివేదిక సమర్పించాలని కూడా సీబీఐని ఆదేశించింది.

## వరుస తప్పిదాలు

సంఘటన జరిగిన తర్వాత ఆర్జీ కర్ మెడికల్ ఆసుపత్రి ప్రిన్సిపాల్ డా॥ సందీప్‌ఘోష్ తన పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత నాలుగు గంటల్లోనే ఆయన్ను కలకత్తా నేషనల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రభుత్వం నియమించడంతో దుమారం రేగింది. దీనితో రాజీనామా చేశాడు. మమత ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి. హైకోర్టు కూడా ఆయన రాజీనామాను తప్పుపట్టి, దీర్ఘకాలిక సెలవులో వెళ్లాల్సిందిగా ఆదేశించాల్సివచ్చింది. మృతదేహం లభించిన సెమినార్ హాలు గోడలకు మరమ్మతులు చేపట్టడం, జూనియర్ డాక్టర్ హత్యాచారం సంఘటన తర్వాత దీదీ ప్రభుత్వం 42 మంది డాక్టర్లను బదిలీ చేయడంకూడా పలు విమర్శలకు దారితీసింది. దీనితో ఈ బదలీలు ముఖ్యమంత్రికి తెలియకుండా జరిగాయని అడ్డంగా బొంకింది మమత సర్కారు. మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని హైకోర్టు ప్రశ్నించింది.

ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో మత్తు మందుల మాఫీయా తీవ్రస్థాయిలో పని చేస్తున్నదని, దాని అనుపానులు హత్యకు గురైన పీజీ డాక్టర్‌కు తెలుసునని ఫలితమే ఈ హత్య అని ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు. ఇదే ఆసుపత్రి టీఎంసీ వర్గాలకు ఏటీఎంలా పనిచేస్తున్న సంగతిని కూడా చాలామంది ప్రస్తావించారు. ఇక్కడ నుంచి మనుషుల అవయవాలు సరఫరా అవుతాయన్న ఆరోపణ ఉంది. మాఫీయా గురించిన వాస్తవాలు అక్కడ చదువుతున్న వారికి ఎంతో కొంత తెలిసి ఉంటాయి కాబట్టి, అవి బయటపెట్టే ప్రయత్నం చేస్తే ఫలితం ఇలాగే ఉంటుందని హెచ్చరించడమే ఈ హత్య, ఘాతుకం వెనుక ఉద్దేశమై ఉండవచ్చునన్న అభిప్రాయం కూడా ఉన్నది. కేసును సీబీఐలో ఎంతో ఖ్యాతి ఉన్న సీమా పహూజాకు అప్పగించడంతో చాలాపేర్లు బయటకు వస్తాయన్న అనుమానాలు ఉన్నాయి. సూమోటోగా తీసుకున్న సుప్రీంకోర్టు ఆగస్ట్ 20న ముగ్గురు సభ్యుల ధర్మాసనంతో విచారణ మొదలుపెట్టింది. పశ్చిమ బెంగాల్ తరపున ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ హాజరయ్యారు.

## నోరు మెదపరేమి?

మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనపై కాంగ్రెస్, టీఎంసీ, ఇంకా ఇతర పార్టీలు ఆనాడు రోజుల తరబడి గోల చేశాయి. వీళ్ల అడుగులకు మడుగులు వత్తే మీడియా ఆ చెత్తంతా దేశం మీద చల్లింది. కానీ సందేశ్‌కాలీ మహిళల మీద అత్యాచారం జరిగినప్పుడు నోరు మెదపనట్టే ఇప్పుడు కూడా ఆ పార్టీలు ఏవీ సరైన రీతిలో స్పందించలేదు. దీదీ నోటికి భయపడి కావచ్చు. లేదా విపక్షంలో పెద్ద నోరున్న దీదీని ఇలా బలహీనపరిస్తే, అది మోదీకి లాభిస్తుందన్న పిచ్చి ఊహ కావచ్చు. సాగరికా ఘోష్ అనే రాజ్యసభ ఎంపీ, టీఎంసీ సభ్యురాలు సీబీఐని లక్ష్యంగా చేసుకుని విమర్శలు ప్రారంభించింది. ఇదొక తుంటరితనం. కేసును సాధ్యమైనంత తొందరగా తేల్చి సత్వర న్యాయం చేయాలని ఆమె ఘోషించింది. ఆధారాలను బయటపెట్టాలని కోరుతోంది. ఎక్కడి నుంచి వస్తాయి ఆధారాలు? రాష్ట్ర ప్రభుత్వమే, అధికారిక గూండాలే అన్నీ నాశనం చేశారు. సమస్య ఇంత దూరం



వచ్చింది కాబట్టి కొంతమంది లాంఛనంగా ఖండిస్తున్నారు. అయినా కొందరు ఇప్పటికీ నోరెత్తడం లేదు. సోనియా గాంధీ, ప్రియాంక వాద్రా, శివసేన నాయకులు, ఎన్‌సీపీ నాయకులు, సమాజ్‌వాదీ నాయకులు ఎవరూ నోరెత్తడం లేదు. ఒకప్పుడు కలకత్తా నేషనల్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నానా రగడా సృష్టించినందుకు ఆర్‌జీ కర్ కళాశాలకు ఘోష్‌ను బదలీ చేశారు. ఇక్కడి నిర్వాకం తరువాత పదోన్నతితో మళ్లీ పాత కాలేజీకి బదలీ చేయడం అంటే, అతడికీ తృణమూల్ అధినేత్రికి ఉన్న అవినాభావ సంబంధాలు కూడా బయటపడడం అవసరం. మత్తు మందులు రాజ్యమేలుతున్న ఈ కాలేజీ వ్యవహారం కూడా బయటకి తేవాలి.





**తృణమూల్‌లో లుకలుకలు**

దేశం మొత్తం అత్యాచారం గురించి అగ్గి మీద గుగ్గిలమవుతుంటే, న్యాయం చేయాలని కోరుతూ ఉంటే, తృణమూల్ తైనాతీ గణం మాత్రం తమ నాయకురాలిని అడ్డగోలుగా కాపాడే ప్రయత్నంలో మునిగి తేలుతోంది. విధులు బహిష్కరించిన డాక్టర్ల మీద జనం ఆగ్రహం ప్రదర్శిస్తే తామే అడ్డుపడేది లేదని ఆ పార్టీ కార్యకర్తలు పరోక్షంగా బెదిరించారు. మమత రాజీనామాను కోరుతూ లేస్తున్న ప్రతి తర్జనని విరిచేస్తామని ఇంకొందరు నాయకులు ప్రకటించారు. కానీ కొందరిలో మాత్రం ఈ వ్యవహారంలో సరిగా వ్యవహరించాలన్న సూచన కనిపిస్తున్నది. తాజాగా ఆ పార్టీ నేత సుఖేందు శేఖర్‌రాయ్ సీబీఐ నిక్కచ్చిగా ఉండాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేయడం తృణమూల్ కాంగ్రెస్‌లోనే నెలకొన్న వ్యతిరేకతను తెలియజేస్తోంది. మాజీ ప్రిన్సిపాల్, పోలీసు కమిషనర్‌ను కస్టోడియల్ ఇంటరాగేషన్ చేయడం వల్ల ఆత్మహత్య కథనం ఎందుకు బయటకు తీసుకు వచ్చిందీ తెలుసుకోవడానికి చాలా అవసరమని పేర్కొనడం ఇక్కడ గుర్తించాల్సిన ముఖ్యమైన అంశం. సెమినార్ గోడను కూల్చాల్సిన అవసరం ఎందు కొచ్చిందని ఆయన ప్రశ్నించడమే కాదు, నిందితుడు అంత శక్తిమంతమయ్యేందుకు కారకులెవరని ప్రశ్నించడం మమతా బెనర్జీని ఇబ్బందుల్లోకి నెట్టే అంశమే. పోలీసు జాగిలాలను రప్పించడానికి మూడు రోజుల సమయం ఎందుకు పట్టిందని ఆయన ప్రశ్నించడం కూడా సహేతుకమే. మరో నేత కునాల్ ఘోష్ కూడా తాను ఈ కేసులో న్యాయం జరగాలని డిమాండ్ చేయడం గమనార్హం. జాతీయ మహిళా కమిషన్ మాజీ అధ్యక్షురాలు రేఖాశర్మ, ఈ ఘటనలో పరిణామాలు, ఈ పని ఏ ఒక్కరో చేసింది కాదని స్పష్టమవుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసులో ప్రమేయం ఉన్నవారిని ఎందుకు రక్షించాలని యత్నిస్తోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని వర్గాలు ఇక్కడ ప్రభుత్వ నిర్వాకంపై వేలెత్తి చూపుతుంటే రాష్ట్ర పోలీసులు మాత్రం, హత్యాచార సంఘటనపై తప్పుడు సమాచారం ప్రచారం చేస్తున్నారంటూ ఇద్దరు ప్రముఖ వైద్యులు డాక్టర్ కునాల్ సర్కార్, డాక్టర్ సుబర్ణ గోస్వామి మరో సీనియర్ బీజేపీ నాయకురాలు లాకెట్ చటర్జీలను లాల్‌బజార్‌లోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు విచారణకు హాజరు కావాలంటూ నోటీసులు జారీచేయడం విచిత్రం. ఇది కచ్చితంగా సామూహిక హత్యాచారమే నని అఖిల భారత ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుబర్ణ గోస్వామి చెప్పారు.

"మృతురాలి శరీరంలో తీవ్రమైన గాయా లున్నాయి. కేవలం ఒక్కడు మాత్రమే ఇన్ని గాయాలు చేయలేడు! ఎక్కువమంది దాడిచేసినట్లు అనిపిస్తోంది" అని అనుమానం వ్యక్తం చేశారు. ఆయనేం మామూలు రాజకీయవేత్త కాదు కదా, ఆరోపణలు చేయడానికి! ఒక డాక్టర్! పోలీసులు ఈవిధంగా నోటీసులు జారీచేయడం ఇప్పటికీ మారని ప్రభుత్వ వైఖరికి నిదర్శనం. నిందితులను కాపాడటానికి ప్రభుత్వం తాపత్రయ పడుతున్నదని ఏ సాధారణ వ్యక్తికైనా ఇట్టే అర్థమవుతుంది.

**లక్ష్యం నెరవేరకుండానే...**

తాను చేస్తున్న ఎం.డి.కోర్సులో గోల్డ్ మెడల్ సంపాదించాలన్నది ఆమె కోర్కె. తన మరణానికి ఒకరోజు ముందు డైరీలో తన లక్ష్యాన్ని పేర్కొన్నదని, హతురాలి తండ్రి చెప్పారు. "రోజుకు 10 నుంచి 12 గంటలు ఆమె చదువులోనే నిమగ్నమై వుండేది. ఆమెను డాక్టర్ చదివించడానికి తామెన్నో త్యాగాలు చేశామని, ఆమె కూడా తన లక్ష్యసాధనలో ఎంతో కష్టపడి చది వింధని ఆయన వివరించారు. అటువంటి తన కుమార్తె మరణం తనను కోలుకోలేని స్థాయిలో కృంగదీసినా, దేశవ్యాప్తంగా ఈ ఘాతుకానికి వ్యతిరేకంగా వస్తున్న మద్దతు న్యాయం లభించేవరకు పోరాడాలన్న పట్టుదలను పెంచు తోందని" ఆయన పేర్కొన్నారు. ★





# సవాళ్లనే సవాలు చేస్తాం!

## దేశమంటే 240 మంది లోక్‌సభ ఎంపీలు కారు, 140 కోట్ల మంది భారతీయులు

**మొన్నటి లోక్‌సభ ఎన్నికలలో ఎన్‌డీఏకి కొద్ది సీట్లు తగ్గాయి. బీజేపీ సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కొద్దిదూరంలో ఉండిపోయింది. ఇదే అదనుగా విపక్షాలు కొత్త సవాళ్లు విసరడానికి సిద్ధమవుతున్నాయి. చిత్రంగా వాటి విషపుటాలోచనలు బీజేపీనీ, మోదీనీ గద్దె దించడానికేనని వారు చెబుతున్నారు. కానీ ఆ కుట్రలు భారత సార్వభౌమాధికారాన్ని సవాలు చేసే విధంగా మలుపు తీసుకుంటున్నాయి. డీప్‌స్టేట్ కుళ్లు కుతంత్రాలు, రాజకీయాలు సుస్పష్టమైపోయి, పొరుగున ఉన్న బాంగ్లాదేశ్ అల్లకల్లోలమైంది. అలాంటి పరిస్థితులు భారత్‌లోను దూసుకు వచ్చేస్తున్నాయంటూ, మోదీ రాజీనామా లేఖను సిద్ధం చేసుకోవడమే తరువాయి అంటూ విపక్ష శిబిరంలో ప్రముఖులు చంకలు గుద్దేసుకున్నారు కూడా. ఈ నేపథ్యంలోనే 78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోట మీద నుంచి జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఇది ఆయన 11వ ప్రసంగం.**

పదేళ్ల బీజేపీ ఏలుబడిలో సాధించిన విజయాలను నరేంద్ర మోదీ ఎర్రకోట నుంచి జాతికి గుర్తు చేశారు. తన ప్రభుత్వం చేపట్టబోయే పథకాల గురించి వివరించారు. ఇందులో చాలా అంశాలు బడ్జెట్‌లో ప్రతిపాదించారు కూడా.

1995 నాటి ప్రమాదకర వక్ఫ్ చట్టానికి సవరణలు సూచిస్తూ బీజేపీ/ఎన్‌డీఏ తెచ్చిన బిల్లు పార్లమెంట్ సంయుక్త సంఘం పరిశీలనకు వెళ్లింది. దీనికి కాంగ్రెస్, దాని తైనాతీలు ఎలాగూ మోకాలడ్డుతాయి. అదే జరిగింది. బాంగ్లాదేశ్‌లో అల్లర్లు, అవి భారతదేశంలోనూ పునరావృతమవుతాయని విపక్షాలు దింపుడుకళ్లం ఆశలతో చూస్తున్న సమయంలో ఆగస్ట్ 8న ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. నిజానికి ఇదొక లోతైన సంకేతం.

పార్లమెంట్‌లో మెజారిటీ తగ్గినంత మాత్రాన బీజేపీ తన మౌలిక విధానాల నుంచి, నినాదాల నుంచి వెనక్కి తగ్గడం లేదన్నదే ఆ సంకేతం. దీనికి కొనసాగింపుగానే ఎర్రకోట నుంచి ప్రధాని లౌకిక పౌరస్మృతి అవసరం గురించి పిలుపునిచ్చారు. ఈ పిలుపు ఉమ్మడి పౌరస్మృతి గురించేనని వేరే చెప్పక్కరలేదు. యథాప్రకారం ఉమ్మడి పౌరస్మృతిని ముస్లిం సమాజం అంగీకరించబోదని అఖిల భారత షరియా బోర్డు వెంటనే ప్రకటన కూడా ఇచ్చేసింది. అయితే ఇప్పటివరకు ఉన్న పౌరస్మృతి, స్వాతంత్య్రం సిద్ధించి లేదా రాజ్యాంగం అమలులోకి వచ్చిన ఏడు దశాబ్దాల తరువాత కూడా ఈ దేశంలో ఉన్నది వివక్షాపూరితం, స్వతంత్ర భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలను నిపుణులు, బాధ్యత కలిగిన పౌరులు అంతా అంగీకరిస్తారు. అది రాజ్యాంగం నిర్దేశించిన అంశమే. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు ఈ విషయాన్ని సుస్పష్టంగానే చెబుతున్నాయి. ఒకే దేశం ఒకే ఎన్నిక విధానానికి కూడా తాము కట్టుబడే ఉన్నామని కూడా ప్రధాని చెప్పారు.

ఉమ్మడి పౌరస్మృతి అంశాన్ని మోదీ సరైన సమయంలో మళ్లీ గుర్తు చేశారనే అనాలి. ఈ అంశం మీద విపక్షాలన్నీ దొంగ నిద్ర నటిస్తున్నాయి. బుజ్జగింపు రాజకీయాల కోసం ఉమ్మడి పౌరస్మృతిని అవి వ్యతిరేకిస్తున్నాయి. భారత స్వాతంత్య్రోద్యమంలో జరిగిన, కాంగ్రెస్ ప్రభుత్వాలు కొనసాగించిన చారిత్రక తప్పిదాలను సవరించే పనిని బీజేపీ ప్రభుత్వం స్వీకరించింది. నాడు అఖిల భారతీయ జనసంఘ్ చేసినట్టే, నేడు బీజేపీ కొన్ని జాతీయ ప్రాధాన్యం కలిగిన అంశాలపై సుదీర్ఘ పోరాటాన్నే చేస్తున్నది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే 370 అధికరణం రద్దు అందులో ఒకటి. అది చేసి చూపించింది బీజేపీ. అలాగే ఉమ్మడి పౌరస్మృతి, ఒకే ఎన్నిక, ఒకే దేశం కూడా బీజేపీ నినాదాలే. ఇవి ఒకరోజులోనో, ఒక ఎన్నికల హామీతోనో నెరవేర్చగలమని బీజేపీ కూడా భావించడం లేదు. ఇందులో అన్ని అంశాలకీ ఎన్‌డీఏ భాగస్వాముల మధ్య కూడా ఏకాభిప్రాయం లేదు. బీజేపీకి ఉన్న జాతీయ దృక్పథం, వాటి దృక్పథం ఎప్పటికీ ఒకటి కాలేవు. హిందుత్వం, జాతీయత, దేశరక్షణ, సంస్కృతి వంటి విషయంలో బీజేపీవి స్థిరమైన అభిప్రాయాలు. వాటి నుంచి బీజేపీ తగ్గలేదు. కానీ బీజేపీయేతర పక్షాలే వాస్తవికతను తెలుసుకున్నాయి. 1990 నాటి బీజేపీ ఒక అంటరాని పార్టీ. కానీ 1996 నాటికి ఆ దురభిప్రాయాన్ని బీజేపీ రూపుమాపగలిగింది. తనవైన విధానాలను ప్రజలలోకి తీసుకువెళ్లి వారి మనసులను గెలుచు కున్నది. ఇప్పుడైన అదే ఉద్దేశంతో తన విధానాలను అమలులోకి తీసుకు రావాలని బీజేపీ భావిస్తున్నట్టు కనిపిస్తుంది.

డీప్‌స్టేట్ రాజకీయాలు వీరవిహారం చేస్తున్నాయి. చట్టబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చడం, కీలుబొమ్మలను ప్రతిష్ఠించడం ఇప్పుడు కొత్త పరిణామం. దీనిని ప్రతిఘటించగలిగేది ప్రజాభిప్రాయమే. 40 కోట్ల మంది భారతీయులు ఒక మహా వలస శక్తిని కూలదోశాయని మోదీ గుర్తు చేయడం

వెనుక పెద్ద అర్థమే ఉంది. డీప్‌స్టేట్ రాజకీయం వ్యూహం కూడా నాటి వలసదేశాలలో జరిగినట్టే కిరాయి మూకలను ఉపయోగించుకుని సుస్థిరతను, జాతీయ భావాలను, పురోగతిని అడ్డుకోవడమే. నాడు బ్రిటిష్ వలస పాలన చేసింది కూడా అదే. కానీ ఈరోజు 140 కోట్ల మంది భారతీయులు ఉన్నారు అని ప్రధాని గుర్తు చేయడం ఇందుకే. 140 కోట్ల మంది కలసి నడిస్తే ఎలాంటి సవాలునయినా, శక్తిని అయినా ప్రతిఘటించగలమని, వికసిత భారత్ దిశగా ప్రయాణించగలమని ఆయన పెద్ద హెచ్చరికే చేశారు. సవాలుకే సవాలు విసరడం భారతీయుల సహజ లక్షణమని ఆయన నినదించారు. మోదీ చెప్పినట్టు భారత్ అంటే 240 లోక్‌సభ (బీజేపీ బలం) స్థానాలు కాదని, 140 కోట్ల మంది భారతీయులని చెప్పి ఆయన విధ్వంసక శక్తుల చెంప చెళ్లుమనిపించారు. దేశాన్ని యథాతథ స్థితి నుంచి తప్పించి సంస్కరణల పథంలో నడపాలంటే జనబలం అవసరమని ఆయన అన్నారు. సంకీర్ణంలో బలం తగ్గితే దుష్పరిణామాలు తప్పవని కూడా ఆయన హెచ్చరించడం గమనార్హం. మైనారిటీ ప్రజల కోసం మెజారిటీ ప్రజల పురోగతిని, పురోగమన దృష్టిని అడ్డుకునే బుద్ధి ఎప్పటికీ ప్రశ్నార్థకమే.

కోల్‌కత్తాలో జరిగిన పీజీ డాక్టర్ హత్యను ఖండించడంలోనే విపక్షాల బలహీనత అర్థమవుతుంది. ఫైజాబాద్ ఎంపీ (సమాజ్‌వాదీ పార్టీ) సన్నిహితుడు అయోధ్యలో మైనర్ బాలిక మీద అత్యాచారానికి పాల్పడినా విపక్షాలు ఖండించవు. మోదీని గుడ్డిగా వ్యతిరేకించే ఏ రాజకీయ పార్టీని అయినా మీడియా సమర్థిస్తున్నది. అందులో భాగంగానే పీజీ డాక్టర్ హత్య వివాదానికి ఇవ్వవలసినంత ప్రాధాన్యం ఇవ్వడం లేదు. మమత రాజీనామా చేయాలని ఎవరూ గట్టిగా కోరడం లేదు. దోషులను కఠినంగా శిక్షించాలని ఒక మాట అని రాహుల్ గాంధీ ముఖం చాటేశాడు. ఇలాంటి దుండగాలను, నీచ రాజకీయాలను ఖండించడం అంటే, విపక్ష కూటమిని బలహీనం చేయడమేనని, మోదీకి బలం తేవడమేనని విపక్షాలు భావిస్తున్నాయి. నిజానికి అది డీప్‌స్టేట్‌కు మరింత చోటు కల్పించడమే. దీనినే మోదీ గొప్పగా చెప్పారనిపిస్తుంది. కోల్‌కతా అమానుషం గురించి మోదీ ప్రస్తావించక తప్పని పరిస్థితి. నిజంగానే బీజేపీ సాధించిన, సాధిస్తున్న విజయాలను విపక్షాలు జీర్ణం చేసుకోలేకపోతున్నాయి. ఆ క్రమంలో ఎంత అవినీతిని అయినా, ఎంతటి అమానుషాలనైనా సమర్థించే దుశ్చర్యకు పాల్పడుతున్నాయి. అవినీతిని ప్రచారం చేసుకోవడం కూడా ఘనకార్యంగా భావించే స్థితికి విపక్షాలు వచ్చాయని మోదీ సరైన వ్యాఖ్యానమే చేశారు.

బాంగ్లాదేశ్ పరిస్థితిని ఆగస్ట్ 15న ఎర్రకోట మీద ప్రస్తావించడం అవసరమే. అక్కడి హిందువుల రక్షణ బాధ్యత తాము పట్టించుకున్న సంగతిని ఆయన ప్రకటించారు. బాంగ్లాదేశ్ ఆవిర్భావానికి ప్రధాన కారకుడు షేక్ ముజిబూర్ రెహమాన్‌ను ఆగస్ట్ 15,1975న భారత్ స్వాతంత్ర్య దిన వేడుకలలో ఉండగానే దుండగులు దారుణంగా చంపారు. అప్పటికి దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించి సరిగ్గా నెలా 20 రోజులైంది. అప్పటి రాజకీయ నేపథ్యంలో ముజీబ్ హత్యతో ఇందిరాగాంధీ కలవర పడ్డారన్న వార్తలు కూడా నాడు వెలువడినాయి. ఇవాళ బాంగ్లాదేశ్ పరిస్థితి, అక్కడి హిందువుల పరిస్థితి దారుణం. వారి భద్రత గురించి మోదీ సరైన సమయంలోనే హెచ్చరించారు. దీనితో తాత్కాలిక ప్రభుత్వ అధ్యక్షుడు మహమ్మద్ యూనస్ మైనారిటీల రక్షణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బీజేపీ/మోదీ నాయకత్వంలోని ప్రభుత్వాలు పాలించిన ఈ పదేళ్లు విపక్షాల నుంచి, అంతర్జాతీయంగా భారత్ వ్యతిరేక శక్తులు, అరాచకశక్తుల నుంచి సవాలు లేని రోజు లేదంటే అతిశయోక్తి కాదు. కాబట్టి ఈ ఏడాది సవాళ్లు ప్రత్యేకమైనవి కాకున్నా, అంతర్జాతీయ పరిస్థితులు, డీప్‌స్టేట్ భారత్ వంటి పురోగామి దేశానికి ప్రత్యేకించి సమస్యలు సృష్టిస్తున్నాయి. క్రైస్తవం, ఇస్లాం శక్తుల నుంచి, ఉదారవాద శక్తుల నుంచి ఎదురవుతున్న సవాళ్లను తక్కువగా చూడలేం. 98 నిమిషాల మోదీ ఎర్రకోట ఉపన్యాసంలో ప్రతి నిమిషం దీనినే ప్రతిధ్వనించింది. ★

# రాముడిని ఆపలేరు సుమా!

అయోధ్య హిందూత్వానికీ, ప్రధానంగా హిందువుల ఆరాధ్యదైవం శ్రీరాముడు అంటే కొన్ని దేశాలలో కొన్ని సంస్థలకు ఎందుకు అంత ద్వేషమో అర్థం కాదు. ఆగస్ట్ 18న న్యూయార్క్ నగరంలో ఆరంభమైన 42వ ఇండియా డే ఊరేగింపు మరొకసారి ఈ ద్వేషానికి వేదికగా మారింది. అయోధ్య రామమందిరం కోసం బాలరాముని విగ్రహాన్ని చెక్కిన అరుణ్ యోగిరాజ్‌కు అమెరికా వీసా నిరాకరించడం వెనుక రహస్యంగా ఈ విధంగా బయటపడింది. మొత్తానికి ఎన్ని కుట్రలు, విద్వేషం చిమ్మే ప్రకటనలు చేసినా ఇండియా డే ప్రదర్శనలో అయోధ్య రామమందిరం నమూనా పాల్గొన్నది. భారతీయులు జాతీయ పతాకాలతో, దేశభక్తి నినాదాలు చేస్తూ ఉత్సాహంగా రథం వెంట నడిచారు. అలాగే హిందూ భక్తిగీతాలు, భజనలు కూడా పాడారు. ఇక్కడ ప్రదర్శించిన రామాలయం నమూనా పూర్తిగా చెక్కతో తయారు చేశారు. మంచి పుష్పాలంకరణ చేశారు. ఇందులో మొత్తం 40 ఫ్లోట్స్ పాల్గొన్నాయి. 50 సంఘాలు, 30 వాద్య మేళాల వారు పాల్గొన్నారు.



న్యూయార్క్ నగరంలో 38వ స్ట్రీట్ డౌన్ టు ఈస్ట్ 23 స్ట్రీట్‌లో జరిగింది. ఇది భారత్‌కు వెలుపల జరిగే అతి పెద్ద భారతీయ ప్రదర్శనగా ప్రఖ్యాతి ఉంది. తెలుతున్నట్టు ఉండే అయోధ్య రామమందిరం నమూనాను ఇందులో ప్రదర్శించడానికి కొందరు అంగీకరించలేదు. వారంతా ముస్లిం సంఘాల సభ్యులు, క్రైస్తవ సంఘాల వారే. ఇలాంటి నిర్మాణానికి ఈ ప్రదర్శనలో చోటు కల్పించడం అంటే అసహనాన్ని, విభజనను, ఇస్లాం పట్ల వ్యతిరేకతను పెంచడమేనని ఒక వివాదం లేవదీశారు. ఇండియన్ అమెరికన్ ముస్లిం కౌన్సిల్, బ్లాక్ లైవ్స్ మ్యాటర్, కౌన్సిల్ ఆన్ అమెరికన్ ఇస్లామిక్ రిలేషన్స్, సిఖ్ అసెంబ్లీ ఆఫ్ అమెరికా, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అమెరికన్ క్రిస్టియన్స్, ఇంకా ఇతర సంస్థలు ఈ మేరకు అమెరికా గృహ మంత్రిత్వ శాఖకు, అటార్నీ జనరల్‌కు లేఖలు రాశాయి. రామమందిర నమూనాను ఈ ప్రదర్శనలోకి తేవడంలో ఇండియన్ కాన్సులేట్ ప్రమేయం ఉందని కూడా ఈ సంస్థలు ఆరోపించాయి. ఇది వియన్నా సదస్సు తీర్మానంలోని 41వ ఆర్టికల్‌కు వ్యతిరేకమని కూడా అవి చెబుతున్నాయి. ఈ నమూనా ఆలయం కచ్చితంగా ద్వేషాన్ని ప్రేరేపిస్తుందని కూడా అవి ఆరోపించాయి. ఇందులో విదేశీ ఏజెంట్ల క్రమబద్ధీకరణ చట్టం ఉల్లంఘన కూడా ఉన్నది కాబట్టి, ఫెడరేషన్ ఇండియన్ అసోసియేషన్, అమెరికా విశ్వహిందూ పరిషత్‌ల మీద దర్యాప్తు జరగాలని కూడా ఆ సంస్థలు కోరాయి. అసలు అమెరికాలో జరిగే ఇండియా డే సందర్భంగా ఇలాంటి ఒక నమూనాను పంపించి భారత ప్రభుత్వమే తమ దేశంలో విద్వేషాలను ప్రేరేపిస్తున్నదని ఆ సంస్థలు ఆరోపించాయి. ఈ విధంగా భారత్-అమెరికా దౌత్య సంబంధాలలో పాటించవలసిన మర్యాదలను ధిక్కరించినట్టు కూడా చెప్పాలని ఆ సంస్థలు భాష్యం చెప్పాయి. ఈ వ్యవహారంలో న్యూయార్క్ నగరంలోని ఇండియన్ కాన్సులేట్ కార్యాలయం పాత్ర మీద దర్యాప్తు జరగాలని ఆ సంస్థలు అమెరికా న్యాయశాఖకు, న్యూయార్క్ రాష్ట్ర అటార్నీజనరల్‌కు , ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు కూడా లేఖలు రాశాయి. అయోధ్య రామమందిరం నమూనా మీద ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది హిందువుల మనోభావాలను అవమానపరచడమేనని ఇండియా డే ప్రదర్శన నిర్వాహకులు ప్రకటించారు. ★

# అగ్రశక్తులకు క్రీడా మైదా

బాంగ్లాదేశ్ ఇవాళ పలు బలమైన శక్తుల క్రీడారంగంగా మారింది. అటు అమెరికా, ఇటు చైనా తమవైన విభిన్న అజెండాలతో స్వప్రయోజనాల కోసం వ్యూహాలు పన్నుతుండగా, మతోన్మాద ఇస్లామిక్ అతివాద శక్తులు, క్రైస్తవ మత ప్రచారకులు కలిసి బాంగ్లాదేశ్‌లో భారత్ తన కార్యకలాపాలు కొనసాగించకుండా కార్యక్షేత్రాన్ని కుదించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ విషయాన్ని గ్రహించిన భారత్, బాంగ్లాదేశ్‌కు విద్యుత్ అందిస్తున్న భారతీయ కంపెనీలను వారి సరఫరాను నిలిపివేయచ్చంటూ ఆదేశాలు జారీ చేసింది.



ఇప్పుడు రెండు అగ్రశక్తులు బాంగ్లాదేశ్‌ను చెరొకవైపు నుంచి తమవైపుకు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నాయి. దక్షిణ ఆసియాలో సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్న యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, ఆసియాలో తిరుగులేని ఆధిపత్యాన్ని కోరుకుంటున్న అధ్యక్షుడు జిన్‌పింగ్ నేతృత్వంలోని చైనీస్ కమ్యూనిస్టు పార్టీ– నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనస్ నాయకత్వంలోని బాంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని చీల్చివేసే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

జామాత్–ఇ–ఇస్లామీ, ఖలీదాజియా నాయకత్వంలోని బాంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ రెండూ కూడా అగ్రదేశాల ఈ ఆధిపత్య పోరులో ఇష్టపూర్వకంగానే వారి పరికరాలుగా మారి వ్యవహరించే అవకాశాలున్నాయి. ఈ క్రమంలో పాకిస్తాన్ ఒక చిన్న బానిసదేశ స్థితికి దిగజారు తుందన్న వాస్తవం వారికి బాధ కలిగించినా, ఆ విషయం బహిరంగ సత్యమే.

ఈ పరిస్థితుల్లో పేరు చెప్తేనే ప్రపంచమంతా వణికిపోయే ముస్లిం బ్రదర్‌హుడ్, తన ఇస్లామిస్టు–జిహాదీ అజెండాతో భారతదేశపు తూర్పు సరిహద్దులలో సమీకరణాలను మరింత సంక్లిష్టం చేసే అవకాశాన్ని తోసిపుచ్చలేం. అంతర్జాతీయ జిహాదీ ముస్లిం నాయకత్వం కీలుబొమ్మలుగా, ప్రైవేటు సైన్యంగా 'రజాకార్లు' పనికి వస్తారు. ఇప్పటికే పౌర నిఘాను మతోన్మాద సైన్యమైన ఈ రజాకార్లు చేపట్టినట్టు వార్తలు వినవస్తున్నాయి.

కొద్దికాలం కింద షేక్ హసీనా ప్రభుత్వం పడిపోయి, ఆమె సురక్షితంగా బయటపడేందుకు ఒప్పందం చేసుకొని, అవామీ లీగ్‌ను క్షాళన జరిగి, సైన్యం అధికారాలు హస్తగతం చేసుకున్న తర్వాత భారత్ కార్యకలాపాలు అక్కడ తగ్గిపోయాయి. నోబెల్ గ్రహీత యూనస్, ఒక డజనుమంది సలహాదారుల నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, బాధ్యతలు స్వీకరించినప్పటికీ, సైన్యమే నిర్ణయాలు తీసుకుంటున్న క్రమంలో క్షేత్రస్థాయిలో పరిస్థితులు



ఏమీ మారినట్టు కనిపించడం లేదు.

యూనస్‌ను కేవలం ముసుగుగా వాడుకుంటూ, కొత్తగా సైనిక నియంత్రణలోకి వెళ్లిన బాంగ్లాదేశ్‌తో క్రియాశీలక కార్యసంబంధాలను ఏర్పాటు చేసుకోవడానికి వెళ్లే ముందు ఆ దేశంలో అంతర్గతంగా ఉన్న అనేక పొరలను భారత్ అర్థం చేసుకోవలసి ఉంటుంది. ముఖ్యంగా అటు చైనా, ఇటు అమెరికా, మరోవైపు పాకిస్తాన్ డీప్ స్టేట్ తమ వాటా కోసం బేరసారాలు చేస్తున్న క్రమంలో ఈ అవగాహన భారత్‌కు అత్యంత ముఖ్యం.

తాత్కాలిక యూనస్ ప్రభుత్వాన్ని 'ప్రజాస్వామిక వైట్‌హౌజ్' వెంటనే గుర్తించడంతో, వారి పాలనకు చట్టబద్ధత లభించింది. యూనస్ నేతృత్వంలో ఢాకాతో కలిసి పని చేసేందుకు 'సిద్ధంగాఉన్నామని, ఎదురుచూస్తున్నా'మనే సందేశాన్ని తెలిపేందుకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధిని సిద్ధం చేశారు.

సెయింట్ మార్టిన్ ద్వీపాన్ని 'నారికేళ జింజీరా' (కొబ్బరికాయల ద్వీపం) లేదా 'దారుచీనీద్వీప్' (దాల్చినచెక్క ద్వీపం) అనేవారు. చిట్టగాంగ్ తీరం వెంట ఉన్న ఈ ద్వీపంపై యుఎస్ కళ్లు పడ్డాయి. అటు భారత్‌పైనా, దాని పొరుగుదేశం, విస్తరణవాది అయిన చైనాపై ఒక కన్నువేసి ఉంచి, పెత్తనం చేసేందుకు అక్కడ ఒక సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేయాలని అది ప్రయత్నిస్తోంది. వ్యూహాత్మక ప్రభావాల నేపథ్యంలో ఈ ప్రాంతంలో ప్రత్యక్షంగా యుఎస్ ఉనికిని భారత్ ప్రోత్సహించకపోవచ్చు లేదా ఆహ్వానించకపోవచ్చు. ఎందుకంటే, అదే జరిగితే, వాణిజ్యం, పెట్టుబడులు, సేవలపరంగా మొత్తం ఆగ్నేయ ఆసియా నుంచి భారత్ విడివడుతుంది.

చర్చి ప్రోత్సాహంతో 'కూకీలాండ్' అన్న పేరుతో కృత్రిమ, స్వయం ప్రతిపత్తి గల ప్రాంతాన్ని ఏర్పాటు చేసేందుకు 'ప్రాజెక్ట్ –కె' ముందుకు వస్తోంది. బాంగ్లాదేశ్, బర్మా, భారత్‌లోని మణిపూర్, మిజోరం లోని కొన్ని ప్రాంతాలను కలిపి ప్రత్యేక క్రైస్తవ రాష్ట్రం ఏర్పాటు చేయాలన్నది చర్చి కల్పన. ఈ క్రైస్తవ అజెండాకు అధ్యక్షుడు జో బైడెన్ లేదా అతడి తర్వాత వచ్చే అవకాశమున్న కమలా హారిస్ నేతృత్వంలోని వైట్‌హౌజ్ నుంచి పూర్తి మద్దతు అందే అవకాశ ముంది. ఒకవేళ డొనాల్డ్ ట్రంప్ నవంబర్ 2024 ఎన్నికలలో డెమొక్రాట్లను ఓడించినా, ఈ అజెండా కొనసాగే అవకాశం ఉంది.

బాంగ్లాదేశ్‌లో ఇప్పటి నుంచి ఎప్పుడు సార్వత్రిక ఎన్నికలు నిర్వహించినా, అవామీలీగ్ పూర్తిగా అధికారానికి దూరమైన నేపథ్యంలో, ఢాకాలో తనకు అనుకూలమైన, విధేయమైన ప్రభుత్వం రావాలని వాషింగ్టన్ ఆశిస్తుంది.

మరొకవైపు, భారతదేశపు 'చికెన్ నెక్' ప్రాంతానికి దగ్గరగా ఉండేందుకు బీజింగ్‌కు ఆస్కారమిచ్చే తీస్తా నదీ ప్రాజెక్టు, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం ప్రయత్నించి, చైనా చేజిక్కించుకుంటుంది. హసీనా ప్రభుత్వం పడిపోయే కొన్నివారాల ముందు, చైనా పర్యటనకు వెళ్లిన బాంగ్లాదేశ్ ప్రధానమంత్రి ఆ దేశ అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశమైన నేపథ్యంలో గ్రాంట్లే కాకుండా రెండు బిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన వడ్డీలేని, రాయితీలతో కూడిన వాణిజ్య రుణాలు ఇస్తామని ఆ దేశం హామీ ఇచ్చిందనే వార్తలు వచ్చాయి.

మనకు పైకి కనిపించినట్టుగా, ప్రత్యక్షంగా లేదా





# నంగా మారిన బాంగ్లాదేశ్

ఆసియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఎఐఐబి) ద్వారా లేదా ప్రత్యక్షంగాను మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడం అన్నది కేవలం పెట్టుబడుల ప్రోత్సాహానికే ఇది పరిమితం కాదు. బదులుగా, ఇది భారత్‌కు వ్యూహాత్మక సమస్యలు తలెత్తేలా చేసి, గడపలోకి వచ్చే అవకాశాన్ని చైనాకు కల్పిస్తుంది.

బాంగ్లాదేశ్ కథనానికి మూడవ కోణం, పాకిస్తాన్, ముస్లిం బ్రదర్‌హుడ్‌లో కొంత భాగం మద్దతుతో జమాత్–ఇ–ఇస్లామీ కల్లుతాగిన కోతుల్లా ప్రవర్తించడం. ఇది భారత్‌కు పెనుసవాళ్లను విసురుతుంది. బాంగ్లాదేశ్‌లో హిందువులను జమాత్ హననం చేస్తున్న విషయం విస్తృతంగా వార్తలలోకి ఎక్కింది. సిఐహెచ్ఎస్ ఈ తీవ్రమైన, ఘోరమైన నేరాలను అత్యంత నిశితంగా నమోదు చేసింది.

'ముస్లింల సమ్మేళనం'గా జమాత్ ప్రాచుర్యం పొందింది. 1975లో అతి పెద్ద ముస్లిం సంస్థగా ఏర్పాటైన జమాత్‌ను 2013లో బాంగ్లాదేశ్ సుప్రీం కోర్టు ప్రత్యక్ష రాజకీయాల నుంచి నిషేధించింది. మత స్వేచ్ఛ లేదా ఇతర విశ్వాసాలను అనుసరించేందుకు స్వతంత్రాన్ని జమాత్ సంస్థ వ్యతిరేకించడంతో దానిని రాజకీయాలలో పాల్గొనేందుకు అనర్హులుగా ప్రకటించింది.

అల్–బదర్, అల్–షామ్స్, స్వయం ప్రకటిత శాంతి కమిటీలు అన్నీ జిహాదిస్టు నెట్‌వర్క్ దాని పరిధిలో ఉంటాయి. ఇవన్నీ కూడా బాంగ్లాదేశ్‌లోని హిందూ, బౌద్ధ, క్రైస్తవ వ్యతిరేక సంస్థలు.

ఈ పరిణామాల క్రమంలో బాంగ్లాదేశ్ విషయంలో అత్యంత భిన్న అజెండాలు కలిగిన క్రైస్తవ మతప్రచారకులు, ఇస్లామిక్ శక్తులు ఒకరితో ఒకరు తలపడే అవకాశం ఉంది. యుఎస్ మద్దతుతో అతివాద క్రైస్తవ మతప్రచారకులు స్వయంప్రతిపత్తి గల క్రైస్తవ ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలన్న వ్యూహం బాంగ్లా దేశ్‌ను 'మతాధిపత్య,' 'ఇస్లామిస్టు' రాజ్యాంగా రూపొందించాలన్న జమాత్ భావనకు విరుద్ధంగా ఉంటుంది. క్రైస్తవ మతప్రచారకులు, ముస్లింల మధ్య సంఘర్షణ అన్నది చిలికి చిలికి గాలి వాన అవుతున్న వార్తలు ఐరోపా దేశాలలోని అనేక నగరాల నుంచి వస్తున్న విషయం తెలిసిందే.

సరళమైన, పురోగమనశీలమైన ప్రజాస్వామిక అజెండాను బాంగ్లాదేశ్‌లో అమలుచేయడానికి చైనా, యుఎస్‌లలోని విరుద్ధ భౌగోళిక–రాజకీయ శక్తులు, క్రైస్తవ మతప్రచారకులు, జమాత్ మతపరమైన తీవ్రవాదం అన్నవి అతి తక్కువ అవకాశాన్ని మిగిలిస్తాయి. హిందువుల, బాంగ్లాదేశ్‌లో నివసిస్తున్న భారతీయ మూలాలు కలిగిన ప్రజల ప్రయోజనాలే కాకుండా తన భౌగోళిక–రాజకీయ, వ్యూహాత్మక ప్రయోజనాలను కాపాడుకునేందుకు భారత్ ఈ ఉత్తేజిత మిశ్రమంలో ఆచితూచి అడుగులు వేస్తూ ప్రయాణించాలి.

హిందువుల ప్రాణాలు, ఆస్తులు, వ్యాపారాలను, ముఖ్యంగా జిహాదిస్టులు లక్ష్యంగా చేసుకున్న మహిళలను పరిరక్షించేందుకు బాంగ్లాదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరిగ్గానే ఉద్ఘాటించారు.

తన వారిని బాంగ్లాదేశ్‌లో పరిరక్షించడమే కాకుండా హింసతో అట్టుడుకుతున్న దేశం నుంచి పారిపోయి ప్రవాహంలా వచ్చి పడిపోతున్న బాంగ్లాదేశీలను నిలువరించి, వ్యవహరించడం అన్నది భారతదేశానికి అతిపెద్ద ప్రాధాన్యత.

రెండవది, పాకిస్తాన్ వంటి కీలుబొమ్మలు సహా యుఎస్, చైనా –ఇద్దరికీ క్రీడారంగమైన ఈ బురద నీటిలో న్యూఢిల్లీ ఈదవలసి రావచ్చు.

మూడవది, అతివాద వామపక్ష తీవ్రవాదులు, మతతత్వ జిహాదిస్టుల నుంచి సైనిక వ్యవస్థ వరకూ రకరకాల శక్తులు తాండవం చేస్తున్న నేపథ్యంలో ఢాకాతో సమీకరణలను పునఃపరిశీలించడం లేదా సవరించడం అన్నది అతిపెద్ద సవాలుగా పరిణమించవచ్చు.

నాలుగవది, శాంతియుతమైన, నిశ్చలమైన, సుసంపన్నమైన దక్షిణ ఆసియా అన్న అజెండాను అనుసరించడం భారత్‌కు అంత తేలిక కాకపోవచ్చు.


ఐదవది, మాజీ ప్రధానమంత్రి, సీనియర్ అవామీ లీగ్ నాయకురాలు షేక్ హసీనాను ఢిల్లీలో రాష్ట్ర అతిథిగా గౌరవించడాన్ని కొనసాగించినంత కాలం బాంగ్లాదేశ్‌తో సంబంధాలను సజావుగా చేసుకోవడం కొంత సమస్యాత్మకం కావచ్చు.

ఆరవది, అన్ని శక్తులూ యథావిధిగా కొనసాగుతున్నప్పుడు భావసారూప్యత కలిగిన భాగస్వాములతో కలిసి ప్రజాస్వామ్యం కోసం ప్రయత్నించడం అత్యంత క్లిష్టమైన పని కావచ్చు.

ఏడవది, తమ దేశంలో అన్ని ఆశలనూ కోల్పోయి, మెరుగైన అవకాశాల కోసం భారత దేశంలోకి చొరబడాలనుకునే ప్రజలనేకమంది ఉన్న నేపథ్యంలో, సాపేక్షంగా ఉద్రిక్తతలు లేని బాంగ్లాదేశ్ సరిహద్దులను 365 రోజులూ, 24 గంటలూ కాపుకాయవలసిన అవసరం ఉంది.

ఎనిమిదవది, బాంగ్లాదేశ్‌లో రాజకీయ, సామాజిక కల్లోలం, ఆర్థిక పతనం కారణంగా తూర్పు రాష్ట్రాలలో తన జనాభాకు ముప్పు వచ్చే ఆస్కారాన్ని భారత్ నిశితంగా పరిగణించి, పరిశీలించవలసి ఉంటుంది.

బాంగ్లాదేశ్, భారత్‌ల మధ్య దీర్ఘకాలిక సంబంధాల కోసం నిష్పాక్షికమైన, ఉదారవాద, సహేతుకమైన వైఖరిని అవలంబించవలసి ఉంటుంది.




**కె.ఎ. బదరీనాథ్**

('సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ అండ్ హోలిస్టిక్ స్టడీస్' డైరెక్టర్ – చీఫ్ ఎగ్జిక్యూటివ్, న్యూఢిల్లీ)



# రుణమాఫీపై

**దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న తెలంగాణ రైతులకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పలుమార్లు ప్రస్తావించింది. చివరకు ఆగస్టు 15వ తేదీ నాటికి రుణమాఫీని మూడు విడతలుగా అమలు చేసింది. అయితే, ఇప్పుడు ఆ మాఫీ మంటలు రాష్ట్రంలో హీట్ పుట్టిస్తున్నాయి. రాజకీయ రగడకు కారణమవుతున్నాయి. మొత్తానికి తెలంగాణలో రైతుల రుణమాఫీ వ్యవహారం రోజురోజుకు రచ్చ రేపుతోంది. ఓవైపు రాజకీయ పార్టీల మధ్య రగడకు.. మరోవైపు రైతుల ఆందోళనలు, ఆవేదనకు రుణమాఫీ అనేది ప్రధానాంశంగా మారుతోంది. అధికార, ప్రతిపక్షాల మధ్య నిత్యం మాటల యుద్ధం జరుగుతోంది. బీజేపీకి చెందిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, తెలంగాణ బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు, ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులు రుణమాఫీ డొల్లతనాన్ని ఎత్తిచూపుతూ విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు.**

రాష్ట్రంలో గడపగడపకు వెళ్లి రుణమాఫీ బండారాన్ని బయటపెడతామని బీఆర్ఎస్ ప్రకటించింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలకు రుణమాఫీ బోగస్ అంటూ.. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖలు రాశారు. ఇక రుణమాఫీ కోసం ఏకంగా రైతుదీక్ష చేపట్టనున్నట్టు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రకటించారు. దీంతో, ఈ అంశం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది.

తమకు రుణమాఫీ కాలేదంటూ పెద్ద సంఖ్యలో రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు ఇప్పటికీ రుణమాఫీ కాని అర్హులందరికీ న్యాయం చేస్తామని, ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తామని ప్రభుత్వం తరపున వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. మొత్తంగా రుణమాఫీ వ్యవహారం మరిన్ని ప్రకంపనలు సృష్టించే పరిస్థితి కనిపిస్తోందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

ఎస్ఎల్‌బీసీ విడుదల చేసిన లెక్కల ప్రకారం.. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మార్చి 31వ తేదీ నాటికి రైతులకు ఇచ్చిన మొత్తం పంట రుణాలు 64,940 కోట్ల రూపాయలు. అందులో కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన 2023 డిసెంబర్ నాటికి ఇచ్చిన రుణాలు 49,500 కోట్ల రూపాయలు. మొదట్లో 2 లక్షల రూపాయల రుణమాఫీ కోసం 40 వేల కోట్ల రూపాయల వరకు అవసరమని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. ఆ తర్వాత రుణమాఫీ కోసం 31 వేల కోట్ల రూ.లు అవసరమవుతాయని కేబినెట్ సమావేశంలో తేల్చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి, సహ మంత్రులు స్వయంగా ప్రకటనలు చేశారు. కానీ, బడ్జెట్‌లో మాత్రం రుణమాఫీకి 26 వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారు. చివరికి మూడు విడతల్లో కలిపి రుణమాఫీకి విడుదలచేసింది 17వేల 933 కోట్ల రూపాయలు మాత్రమే. దీంతో లక్షలాది మంది రైతులకు రుణమాఫీ అందలేదన్న విమర్శలు గుప్పు మంటున్నాయి. గత ప్రభుత్వ హయాంలో లక్ష రూపాయల రుణ మాఫీ కోసం 36.68 లక్షల మంది రైతుల లెక్కతేలారు. కానీ, ప్రస్తుతం 2 లక్షల రూపాయల రుణ మాఫీ కేవలం 22.37 లక్షల మంది రైతులకే అందడం విస్మయం కలిగిస్తోంది. రైతుల సంఖ్య పెరగాల్సిందిపోయి తగ్గడంపై అన్నదాతల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఈ పరిణామాల నేపథ్యంలో తెలంగాణ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో రైతులు రోడ్డెక్కుతున్నారు. తమకు రుణమాఫీ జరగలేదంటూ ఆందోళనలు చేపడుతున్నారు. అగ్రికల్చర్ ఆఫీసుల చుట్టూ, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. చాలామంది పీఎం కిసాన్ నిబంధనలు, ఇతర షరతులు తమకు వర్తించకపోయినప్పటికీ ఇప్పుడు రుణమాఫీ జరగక పోవడానికి కారణాలేంటో అర్థం కావడం లేదని చాలామంది రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు. వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌కు భారీగా ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. ఈ నెల (ఆగస్టు) 18వ తేదీ వరకు లెక్కలు చూస్తేనే 58 వేల మందికిపైగా రైతుల నుంచి ఫిర్యాదులు అందాయని వ్యవసాయశాఖ ఉన్నతస్థాయి వర్గాలు చెప్పాయి. అన్ని జిల్లాల నుంచి ఫిర్యాదుల వివరాలను తెప్పించుకున్నామని.. వాటిని సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తామని ఉన్నతాధికారులు అంటున్నారు. ఇందుకు సంబంధించి హైదరాబాద్‌లోని వ్యవసాయ కమిషనరేట్‌లో ప్రత్యేకంగా ప్రక్రియ కొనసాగుతోందని కూడా చెబుతున్నారు. ఇప్పటి వరకు 58 వేల ఫిర్యాదులు అందాయని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నప్పటికీ.. ఫిర్యాదుల సంఖ్య లక్షల్లోనే ఉంటుందని రైతు సంఘాల నేతలు, నిపుణులు చెబుతున్నారు. లక్షలాది మంది రైతులు బ్యాంకుల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారని.. చాలా మంది లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వలేదని అంటున్నారు. చాలా మండలాల్లో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఏదో ఒకటి చెప్పి వెనక్కి పంపిస్తున్నారని.. లిఖితపూర్వక ఫిర్యాదులు తీసుకోవడానికి అంగీకరించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

అయితే, ప్రభుత్వ నిర్ణయాలు, రైతుల నుంచి వస్తున్న ఒత్తిడి మధ్య ఏం చేయాలో అర్థంకావడం లేదని వ్యవసాయ అధికారులు తల పట్టుకుంటున్నారు. లక్షలాది మంది రైతులకు రుణమాఫీ జరగక పోవటానికి కారణమేంటో, ఏ ప్రాతిపదికన అర్హులను నిర్ధారించారో, ఏ కొలమానాలతో అనర్హులను తేల్చారో అంతుపట్టడం లేదని అంటున్నారు. ఇప్పటికైతే రూ. 2 లక్షల రూపాయల వరకు అప్పు తీసుకున్న రైతులకే రుణమాఫీ వర్తింపజేశామని అంతకు మించి అప్పులు తీసుకున్న వాళ్లు అదనంగా ఉన్న సొమ్మును చెల్లించాకే మాఫీ అవుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉదాహరణకు ఒక రైతు బ్యాంకులో మూడు లక్షలరూపాయలు అప్పు తీసుకుంటే.. రైతు ముందుగానే బ్యాంకులో ఆ మూడు



# మాటల మంటలు


లక్షల్లో లక్ష రూపాయలు బ్యాంకు అకౌంట్‌లో జమ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాతే మిగతా 2 లక్షల రూపాయల మాఫీని ప్రభుత్వం వర్తింప జేస్తుందని అధికారులు చెబుతున్నారు. దీనిపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి నిబంధన పెట్టాల్సిన అవసరమేంటని నిలదీస్తున్నారు. ఆ అదనపు రుణం మొత్తాన్ని ఇప్పటికిప్పుడు చెల్లించ డానికి ప్రైవేటుగా అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం నేరుగా మాఫీ వర్తింపజేస్తే.. మిగతా డబ్బులను కొంతకాలం తర్వాత అయినా తీర్చుకునే వెసులుబాటు ఉంటుందని, ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయాలని రెండు లక్షలకు పైగా రుణాలు తీసుకున్న రైతులు కోరు తున్నారు. బ్యాంకులు ఇప్పటివరకు రుణమాఫీ జరిగిన రైతులకు.. వర్షాకాలం పంటల కోసం కొత్తగా అప్పులు ఇస్తున్నాయి. కానీ, రుణ మాఫీ జరగని రైతులకు మాత్రం కొత్తగా అప్పులు ఇవ్వడం లేదు. దీంతో కీలకమైన వ్యవసాయ సీజన్‌లో పంట రుణాలు దొరక్క ప్రైవేట్ అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అయితే, ఈ మొత్తం వ్యవహారంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు క్లారిటీ ఇస్తున్నారు. బ్యాంకుల నుంచి తమకు వివరాలు అందిన ప్రతి రైతుకు అర్హతను బట్టి రుణమాఫీ చేసే బాధ్యత తమదేనని తుమ్మల హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారికంగా ఓ ప్రకటన విడుదల చేశారు. 2 లక్షల రూపాయల వరకూ కుటుంబ నిర్ధారణ జరిగిన రైతులందరికీ మాఫీ చేశామని, కుటుంబ నిర్ధారణకాని వారికి ఆ ప్రక్రియ పూర్తిచేసి రుణమాఫీ సొమ్ము మొత్తం రైతుల అకౌంట్లలో జమ చేస్తామని మంత్రి తెలిపారు. 2లక్షల రూపాయలకు పైన అప్పు లున్న వారికి మాత్రం.. అదనంగా ఉన్న మొత్తాన్ని చెల్లించిన తర్వాత వారి అర్హతను బట్టి వారికి రుణమాఫీ చేస్తామన్నారు. బ్యాంకర్ల నుంచి డేటా తప్పుగా వచ్చిన రైతుల వివరాలను కూడా సేకరిస్తు న్నామని వివరించారు. రుణమాఫీ పొందిన రైతులకు తిరిగి కొత్త రుణాలు మంజూరు చేయా ల్సిందిగా బ్యాంకర్లను ఇప్పటికే కోరామని మంత్రి తుమ్మల వెల్లడించారు.

మరోవైపు.. రుణమాఫీకి అర్హత ఉండికూడా రుణమాఫీ కాని రైతుల విషయంలో తాము బాధ్యత తీసుకొని మాఫీ చేయిస్తామని వ్యవసాయ మంత్రి తుమ్మల చెబుతున్నారు. కానీ, తొలి విడత నుంచే ఎందరో రైతులు ఫిర్యాదు చేసినా మాఫీ చేయలేదని రైతు సంఘాల నేతలు గుర్తు చేస్తున్నారు. అధికారులు ఇంటింటికీ తిరిగి కుటుంబాలను తేల్చి, అర్హులను గుర్తించి రుణమాఫీ చేస్తామని అంటున్నారని.. అదంతా పూర్తి కావడానికి ఎన్నాళ్లు పడుతుందని ప్రశ్నిస్తున్నారు. లక్షల సంఖ్యలో ఉన్న బాధిత రైతుల ఇళ్లకు వెళ్లడం, వారి డేటాను చెక్ చేయడం, కచ్చి తత్వాన్ని నిర్దేశించుకోవడానికి ప్రాక్టికల్‌గా చూస్తే చాలా సమయం పడుతుందని అంటున్నారు. ఇప్ప టికే తమవద్ద పూర్తి సమాచారం ఉందని ప్రభుత్వం చెప్పిందని ఇంటింటికీ తిరిగి సర్వే చేయడం ఏమిటో అంతుబట్టట్లేదని అంటున్నారు. మాఫీ వ్యవహారాన్ని, విమర్శలను కొన్నాళ్లపాటు పక్కదారి పట్టించేందుకే ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోందని కూడా ఆరోపిస్తు న్నారు.

**– సుజాత గోపగోని**

**సీనియర్ జర్నలిస్ట్, 6302164068**



**రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల ఫైళ్లు రెండు నెలలుగా కాలిపోవడం కలకలం రేపుతోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి బయటపడకుండా ఉండేందుకు ఆయా శాఖల అధికారులే కీలక ఫైళ్లను ఉద్దేశపూర్వకంగా కాల్చి వేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. పోలవరం భూసేకరణ పరిహారానికి సంబంధించిన ఫైళ్లను ఆగస్టు 17న రాజమహేంద్రవరంలో తగులబెట్టారు. తిరుపతిలోని తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలనా భవనంలో ఇంజినీరింగ్ విభాగంలో కీలక ఫైళ్లు అగ్నిప్రమాదానికి గురయ్యాయి. జూలై 22న మదనపల్లి సబ్ కలెక్టర్ ఆఫీసులో రెవిన్యూ ఫైళ్లకే నిప్పుపెట్టారు. కరకట్టపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఫైళ్లను అదే నెల 3 రాత్రి కాల్చేశారు. కొన్ని చోట్ల ప్రమాదాలు.. మరికొన్ని చోట్ల ఉద్దేశపూర్వకంగా తీసుకెళ్లి నిప్పుపెట్టినట్లు కనిపిస్తోంది. ఫైళ్లను కాల్చేసినా ఏమీ కాదని ఓ భావన వారిలో పెరిగిపోవడం వల్లనే ఇలా విచ్చలవిడిగా కాల్చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. భారీగా అవినీతి జరిగిన వ్యవహారాల్లో బయటపడటం కన్నా ఫైళ్లు తగలబెట్టిన నేరం కింద నిందలు ఎదుర్కోవడం మంచిదని అవినీతి చేసినవారు భావిస్తున్నారు. ఎన్ని ఫైళ్ల ప్రమాదాలు జరిగినా.. ఎన్ని ఫైళ్లకు నిప్పు పెట్టినా ఎంత వారున్నా ఊరుకోబోమని భారీ స్టేట్‌మెంట్లు తప్ప చర్యలు లేకపోవడంతో బరి తెగిస్తున్నట్లు తెలుస్తోంది.**

# దస్త్రాల దహనంతో

గత ప్రభుత్వ హయాంలో అసైన్డ్, విలువైన భూములను కొందరు రాజకీయ నేతలకు అనుకూలంగా రికార్డులు మార్చారనే ఆరోపణలు ఒక్కొక్కటిగా బహిర్గతమవుతున్నాయి. రాజమహేంద్రవరంలో దహనమైన ఫైళ్లలో పోలవరం భూసేకరణ, పునరావాసం అంశాల్లో భారీ అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్న వాటికి సంబంధించినవి ఉన్నట్లు సమాచారం. ఇప్పటికీ తమకు పరిహారం అందలేదని కొందరు నిర్వాసితులు ఆ కార్యాలయానికి వస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భూ సేకరణ, పరిహారం చెల్లింపుల్లో జరిగిన అక్రమాలు బయటకు రాకుండా ఉండేందుకు ఫైల్స్ దహనంచేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలవరం ప్రధాన ఎడమ కాలువ పనుల కోసం చేపట్టిన భూసేకరణ చెల్లింపుల్లో భారీ అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. మొత్తం రూ. 19 కోట్లు దాకా మింగేశారని చెబుతున్నారు. ఇప్పుడు తగలబడింది సరిగ్గా ఆ ప్రధాన ఎడమ కాలువ భూసేకరణ కార్యాలయంలోని ఫైళ్లే! ఇంకా.. రైతులు, లబ్ధిదారుల ఆధార్ కార్డులు, కాకినాడ కలెక్టరేట్ నుంచి ఇక్కడకు వచ్చిన లెటర్లు, పోలవరం ఎడమ ప్రధాన కాలువకు సంబంధించిన అవార్డు పత్రాలు, ఫొటోలు కూడా దహనమైన వాటిలో ఉన్నాయి. సమాచారం తెలిసి విలేకరులు అక్కడకు వెళ్లగా, సగం కాలిన ఫైళ్లను, పత్రాలను అక్కడి అధికారులు లోపలకు తీసుకుని వెళ్లి దాచేశారు. దీంతో ఈ ఘటనపై మరిన్ని అనుమానాలు ముసురుకున్నాయి. ఫైళ్లను బయట పడేసినట్టు చెబుతున్న శ్రావణి అనే స్వీపరు..ఆకస్మికంగా విశాఖపట్నం వెళ్లారని చెప్పడం అనుమానాలకు తావిస్తోంది. విశాఖ జిల్లాలోని విశాఖ అర్బన్, రూరల్, భీమునిపట్నం మండలాల పరిధిలోని దసపల్లా, హయగ్రీవ, రామానాయుడు, శారదాపీఠం భూములతోపాటు ఎర్రమట్టి దిబ్బ ప్రాంతాలను రెవెన్యూశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పి సిసోడియా ఆగస్టు 16, 17 తేదీల్లో పరిశీలించారు. నిబంధనలు, ఉల్లంఘనలు జరిగినట్లు, కొందరు అనధికారికంగా ఒప్పందాలు చేసుకున్నట్లు ఆయన గుర్తించారు. అగ్రిగోల్డు భూముల కొనుగోలులో మాజీమంత్రి జోగిరమేష్ కుమారునితోపాటు ప్రభుత్వ సర్వేయరు అరెస్టుతో ఏ క్షణంలో ఎవరి అరెస్టు ఉంటుందోనని ఉద్యోగుల్లో గుబులు రేపుతోంది.



**తితిదే ఫైల్స్ దగ్ధం**

తిరుపతిలోని తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలన భవనం మొదటి అంతస్తులోని ఇంజనీరింగ్ విభాగంలో అగ్నిప్రమాదం(?).. దస్త్రాలు దగ్ధం చర్చనీయాంశంగా మారింది. ఈ అంతస్తు ఐదో నంబరు గదిలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ విభాగంలో నారాయణవనం, నాగలాపురంతోపాటు 13 ఆలయాల దస్త్రాలు ఉన్నాయి. ఆ రోజు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో డీఈఈ భాస్కర్ కార్యాలయ తలుపులను సిబ్బంది మూసేశారు. ఉద్యోగి నాగార్జున పక్క హాల్లో భోజనం చేస్తుండగా గది నుంచి పొగలు రావడంతో కంట్రోల్ రూంకు సమాచారం ఇచ్చారు. తితిదే అగ్నిమాపక, విజిలెన్స్, విద్యుత్ సిబ్బంది అక్కడికి చేరుకుని తలుపులు తీసి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే పలు దస్త్రాలు దగ్ధమయ్యాయి. అన్ని దస్త్రాలకు ఈ–ఫైలింగ్ ఉంటుందని అధికారులు చెబుతున్నా కొన్ని కీలక దస్త్రాలను అసలు ఈ–ఫైలింగ్ ద్వారా నడిపారా? నేరుగా ఆమోదముద్ర వేసి పనులు చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విజిలెన్స్ అధికారులు ఇంజినీరింగ్ విభాగం అధికారులకు నోటీసులిచ్చి వివరణ కోరారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో రహదారులు, ఇంజినీరింగ్ పనుల పేరుతో పెద్దఎత్తున నిధులు పక్కదారి పట్టించారనే ఆరోపణలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేయిస్తోంది. తగలబడిన కొన్ని దస్త్రాలను బస్తాల్లో వేసుకుని గుట్టుచప్పుడు కాకుండా తరలించారన్న ఆరోపణలు లేకపోలేదు. దీపం కిందపడి ఘటన జరిగినట్లు అధికారులు చెబుతుండగా అందులో వాస్తవమెంత.. కుట్ర కోణం ఉందా అనే విషయం విచారణలో తేలాల్సి ఉంది.

**సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైల్స్ దగ్ధం**

ఉమ్మడి చిత్తూరు జిల్లా మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో జూలై 22న అర్ధరాత్రి 11 గంటలకు రెవెన్యూకు సంబంధించిన కీలక ఫైళ్లు దగ్ధమైతే మరునాడు తెల్లవారుజాము వరకు సంబంధిత అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వక పోవడం,దగ్ధమైన ఫైళ్లన్నీ భూ సంబంధిత వివాదాలకు సంబంధించినవి కావడం గమనార్హం. వైసీపీ పాలనలో పెద్దిరెడ్డి కుటుంబం, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి,ఆయన అనుచరులు మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు నియోజక వర్గాల్లో వందల ఎకరాలు వివిధ రూపాల్లో ఆక్రమించినట్లు ఎప్పటినుంచో ఆరోపణలున్నాయి. పేదలు,

# కలకలం



రైతుల నుంచి అసైన్మెంట్ భూములను తక్కువ ధరకు కొనుగోలు చేయడం, తర్వాత కలెక్టర్ నుంచి ఎన్వోసీ పొందడం, తర్వాత ల్యాండ్ కన్వర్షన్ చేయడం షరా మామూ లైంది. వీఆర్వోల నుంచి తహసీల్దార్ వరకూ ఇందులో కీలకపాత్ర పోషించగా, సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవోలు తమ వంతు సహకారం అందించి ఈ వ్యవహారాన్ని పూర్తి చేశారంటున్నారు

ఈ నేపథ్యంలో, పేదల నుంచి దౌర్జన్యంగా ఆక్రమించిన భూమితో పాటు, కబ్జా చేసిన వేల ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూములను స్వాధీనం చేసుకుని పేదలకు తిరిగి ఇచ్చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఆ భూములకు సంబంధించిన కీలక ఫైళ్లను మాయంచేసే క్రమంలో దుండగులు ఫైళ్లకు నిప్పుపెట్టారని తెలుస్తోంది. దీనిపై టీడీపీ నేతలు, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, బీజేపీ, ఇతర ప్రజాసంఘాలు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగాయి. దీని వెనుక పెద్దిరెడ్డి కుటుంబం హస్తం ఉందని మండిపడ్డాయి. దీనిని తీవ్రంగా పరిగణించిన ముఖ్యమంత్రి విచారణకు ఆదేశించగా స్వయంగా డీజీపీ వెళ్లి పరిశీలించారు. తర్వాత విచారణ చేసిన "సిసోడియా, అగ్నిప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్" కారణం కానేకాదని ప్రభుత్వానికి నివేదించారు. ఈ సంఘటనకు కారకులుగా భావిస్తున్న మాజీ ఆర్డీవోలు మురళి, హరిప్రసాద్ తోపాటు సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్ నూ సస్పెండ్ చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**పర్యావరణ నియంత్రణ బోర్డు ఫైల్స్ దగ్ధం**

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి సమీర్‌శర్మ డ్రైవర్ బస్తాల కొద్దీ ఫైళ్లను కృష్ణా జిల్లా యనమలకుదురు –పెదపులిపాక గ్రామాల మధ్య కృష్ణా కరకట్టపై జూలై 3న రాత్రి తగలబెట్టిన విషయం తెలిసిందే. మంటలను ఆర్పి స్వాధీనం చేసుకున్న పత్రాలను స్థానికులు పోలీసులకు అప్పగించారు. వీటిపై వైసీపీ ప్రభుత్వంలో గనుల మంత్రిగా పనిచేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మ పేర్లు, ఫొటోలు ఉన్నాయట.

ఈ అంశంపైనా పోలీసులు విచారణ చేస్తున్నారు. కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డికి చెందిన రొయ్యల ఫ్యాక్టరీకి ఇచ్చిన అనుమతులు, ఆ కంపెనీ ద్వారా వెదజల్లుతున్న కాలుష్యంపై విచారణ చేయిస్తామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించిన కొద్ది గంటల వ్యవధిలోనే పీసీబీ కార్యాలయంలోని కీలక ఫైళ్లు దహనం చేసే ప్రయత్న జరగడంతో ఇందులో ఏదో మతలబు దాగి ఉందని అనుమానించి ఆ దిశగానూ పోలీసులు విచారణ చేస్తున్నట్టు సమాచారం.

**ఏపీఎస్‌బీసీఎల్ పత్రాలు చోరీ**


విజయవాడలో ఏపీఎస్‌బీసీఎల్ కార్యాలయం నుంచి.. జూన్ 6న కొన్ని కీలకపత్రాలతో ఏపీ39 ఎన్‌క్యూ 6666 నంబరు వాహనంలో సంస్థ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి తీసుకెళ్లినట్లు వచ్చిన ఫిర్యాదులు వచ్చాయి. రాష్ట్రంలో మద్యం పాలసీ అమలులో అధిక కమిషన్లు తీసుకోవడం ద్వారా నాసిరకం మద్యం సేకరించే కార్యక్రమంలో ఆయన ప్రధాన పాత్రగా ప్రతిపక్షాలు ఎప్పటి నుంచో ఆరోపణలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి అధికారంలోకి రాగానే ఆయన కీలక పత్రాలతో హైదరాబాదుకు ఉడాయించగా, సీఐడీ పోలీసులు ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించి వాటిని సేకరించి వాసుదేవ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.

**గ్రామసభల భయంతోనే**


సెప్టెంబరు మొదటి వారంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న రెవెన్యూ గ్రామ సభలు (మీ భూమి–మీ హక్కు) సందర్భంగా ఏ ఉద్యోగిపై ఎటువంటి ఫిర్యాదు అందుతుందోననే మండలస్థాయి, అంతకంటే దిగువ స్థాయి సిబ్బందిలో ఆందోళన స్పష్టంగా కనబడుతోంది. కూటమి ప్రతిరోజూ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు వచ్చే అర్జీల్లో సగానికి పైగా భూములకు సంబంధించినవి కావడంతో ఈ విషయంపై నిగ్గు తేల్చుతామని ప్రభుత్వం గట్టిగా చెబుతోంది. అసైన్డ్ భూమి కేటాయించి 20 సంవత్సరాలు దాటిన అసలైన లబ్ధిదారుడు పొజిషన్‌లో ఉంటే ఆయా భూములను నిషేధిత జాబితా నుంచి పెదఎత్తున తొలగించిన సంగతి తెలిసిందే. ఇందులో కొంతమేర 20 ఏళ్లు పూర్తికాని భూములను కూడా నేతలకు లబ్ధి చేకూర్చేందుకు నిబంధనలకు విరుద్ధంగా రికార్డుల్లో భూ యజమానుల పేర్లు సైతం మార్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో అసైన్డ్, ఇనామ్ భూముల విషయంలో అక్రమాలు పెద్ద ఎత్తున జరిగినట్లు ప్రభుత్వం గుర్తించింది. చాలాచోట్ల డి–పట్టాలను కూడా గిఫ్ట్‌గా ఇచ్చినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గత ఐదేళ్ల కాలంలో అసైన్డ్, 22(ఎ), ఇనామ్ భూములు 13.59 లక్షల ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించి ఆయా భూముల యజమానులకు భూ యాజమాన్య హక్కులను గత ప్రభుత్వం కల్పించింది.

రెవెన్యూ గ్రామ సభల వల్ల ఆయా గ్రామాల్లో పేద భూముల నేతలు, వారి అనుయాయులకు కట్టబెట్టిన విషయం వెలుగులోకి వస్తే క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించడం కష్టమవుతుందనే భావన ఒకవైపు, ప్రభుత్వ పరంగా కేసులు నమోదుతో పాటు సస్పెన్షన్లు తప్పవనే ఆందోళన ఉద్యోగుల్లో కనబడుతోంది. అందువల్లనే ఈ ఫైల్స్ కాల్చే సంఘటనలు జరుగుతున్నట్లు అనుమానించాల్సి వస్తోంది.



**తురగా నాగభూషణం,**
సీనియర్ జర్నలిస్ట్




37

# అజమహారాజు

**అ**జుడు, ఇందుమతీదేవికి సంప్రదాయాను సారం వివాహం జరిగింది. అజుడు భార్యా సమేతుడై స్వదేశమునకు వచ్చాడు. రఘువు రాజ్యభారం అజునిపై ఉంచి, ఇక్ష్వాకు వంశాచార ప్రకారం వాన ప్రస్థానానికి వెళ్లాడు. అజమహారాజు తీక్షణతో,, మృదుత్వం గాక మధ్యే మార్గంలో పరిపాలనము సాగించాడు. కొన్నాళ్లకు రఘువు మరణించడంతో అజమహారాజు దుఃఖితుడై విధి విహితంగా పితృ కార్యం నిర్వహించాడు.కొంతకాలం గడిచిన పిమ్మట వీరుడైన దశరథుని పొందాడు. ఏకపత్నీ వ్రతుడును, భార్య పట్ల విశేష అనురాగం గల అజమహారాజు ఇందుమతీ ద్వితీయుడై శచీదేవిని గూడిన ఇంద్రునిలా భాసిల్లుతున్నాడు. ఒకనాడు వారివురు ఉద్యాన వాటికలో ఉండగా, గోకర్ణ క్షేత్రంలోని గోకర్ణేశ్వరుని సేవించి ఆకాశ మార్గాన వస్తున్న నారదుని మహతిపై గల సుగంధ భరితమైన పుష్పమాలిక గాలికి ఎగిరి ఇందుమతి వక్షః స్థలముపై పడింది. ఆ మాలికను క్షణకాలము చూచి వివశయై రాహుగ్రస్త చంద్రుని చంద్రికలా ఇందుమతి కనులను మూసింది. దుఃఖాకులురగు పరిజనుల కరుణ స్వనముతో గూడిన ఆర్తరవముతో బాటు సరోవరంలోని హంసాదుల స్వనము అజునకు సానుభూతిని పలికినట్లుంది. అజమహారాజు మూర్ఛిల్లి, విసరుట మున్నగు శైత్యోప చారాలతో కొంతసేపటికి సేదదీరాడు. ఆయన లేచిన పిదప నాతడు వితంత్రీవీణను చక్కచేసే విధంగా ఇందుమతీదేవిని అధిక ప్రేమతో తన అంకమున జేర్చుకొన్నాడు. పతి అంకంపై ఉన్న ఆమె ఉషఃకాల కలుషితమై చంద్రరేఖలా కనిపించింది. అజ మహారాజు తన స్వాభావిక ధైర్య స్థైర్యాలను వీడి గద్గదకంఠంతో, బాష్పలోడనుడై... 'మిక్కిలి మృదువైన పుష్పము గూడ శరీరమును స్పృశించి ఆయువును హరించు సాధనమైనది గదా! వినాశ కాలమున మృదు వస్తువు గూడ ప్రాణాంతకమగును. హిమపాతమున విపత్తి బొందిన పద్మం ఇందులకు ప్రథమోదాహరణ. హృదయంపై పడిన మాత్రాన ఈ పుష్పమాలిక ఇందుమతీ జీవితాపహరణ కారణమైనది. నా హృదయమున జేరినా నా జీవితం హరించకున్నది. ఈశ్వరేచ్ఛ కారణంగా విషం అమృతముగాను, అమృతం విషంగా మారును గదా! అయ్యో! నా దురదృష్టం వలన మాలికా రూప మగు అశనిపాతము వృక్షంపై బడక, ఆ వృక్షాన్ని ఆ శ్రయించుకొన్న లతపైబడి దాని నాశన మొనర్చినది. ఇది అపూర్వం'అని విలపించాడు.

అజమహారాజు తన ప్రియపత్ని నుద్దేశించి ఇట్లు విలపించెను: "ఓ శుచిస్మితా! నీవు శఠురాలవు. కైతవ ప్రేయసివి. ఇది ధ్రువము. ఎందుకంటే... పరలోకమునకు నన్నామంత్రణము చేయకుండ, మరల తిరిగి రాకుండ వెడలి పోయావు. మూర్ఛలోనే నాహత జీవితం అంతం చెందక తిరిగి వచ్చిన దేమిటి? ఈ స్వయం కృతాపరాధమునకు నీ వియోగ వేదనానుభవమే నాకు శరణ్యం. మనసా! నేనేనాడును నీకు అప్రియం చేయలేదు. ఇంకను క్షితి శబ్దమునకు పతినన్న భావ నిబంధనతో, నీ చేత నిబంధింప బడడం నీ అందే ఉంది. పూలతో కూర్చిన నీ కుటి లాలకములు గాలికి కంపించుచు, నీవు జీవించే ఉన్నావన్న భ్రాంతి కలిగిస్తున్నాయి. చలి తాలకలతో నివృత్త సల్లాపియైన నీ మోము రాత్రివేళ అభ్యంతర షట్పద స్వన హీనమైప ముకుళిత పద్మం వలె ఖేదం కలిగిస్తోంది. రాత్రి మరలవచ్చునని, చంద్రుడును తిరిగి కలియవచ్చునని చక్రవాకం ప్రియావిరహముల నోర్చుకొనును. పునస్సయ మాగమ అవకాశ హీనుడైన నేను ఎందుకు దహింపకున్నాను? ఏనీ మృదు శరీరము నవపల్లవశయనమునందు చేరి పరితప్తమవుతుండగా,ఈ కోమలతనువు చితిని అధిరోహించడాన్ని ఎలా భరించగలను' అని భార్యను చూస్తూ విలపించాడు అజుడు.

**– 'రమ' జాగృతి 24.8.1962,సంచిక నుంచి**








# పాంచరాత్రాగమ ప్రవర్తకుడు మరీచి మహర్షి

**మ**రీచిమహర్షి బ్రహ్మమానస పుత్రుడు. నవ బ్రహ్మలలో ఒకరు. సనక స నందుల తర్వాత బ్రహ్మ సృష్టించిన పదిమంది మానస పుత్రులలో ఈయన ఒకరు. స్వయంభు మన్వంతరంలో సప్తరుషులలో ఒకరిగా ఆయన ప్రస్తావన ఉంది. కర్దమ ప్రజాపతి తొమ్మిది మంది పుత్రికలలో ఒకరైన కళను వివాహమాడిన మరీచికి కశ్యపుడు, పూర్ణిమ అనే కుమారుడు,కుమార్తె కలిగారు. ఈ కశ్యపుడే జీవజాతి పుట్టుకకు మూలకారకుడిగా చెబుతారు. మరో భార్య ఊర్ణకు ఆరుగురు పుత్రులు. బ్రహ్మ శాపం కారణంగా మొదట హిరణ్యకశిపునికి, ద్వాపర యుగంలో దేవకికి శ్రీకృష్ణుడికి ముందు జన్మించి, కంసుని చేతిలో హతులైన మొదటి ఆరుగురు ఆమె పుత్రులే.

నేటి రాజస్థాన్‌లో పుష్కర ప్రదేశంలో బ్రహ్మ దేవుడు ఒకసారి నిర్వహించిన యజ్ఞానికి మరీచి

# భీష్ముడు చేసింది స్వామి ద్రోహమా?

37




కురుక్షేత్రంలో ఇరుసేవలు మోహరించి యుద్ధానికి సిద్ధమయి నిల్చున్నప్పుడు పాండవ సైన్యం నుండి యుధిష్ఠిరుడు చేయదలుచుకొన్న పని? పాదచారియై తన సమీపానికి వస్తున్న ధర్మ నందనుణ్ణి భీష్మపితామహుడు ప్రేమ పూరిత నయనాలతో తిలకించాడు. ధర్మరాజు పితా మహుడి సమీపానికి వచ్చి ఆయనకు నమస్క రించి ఆశీస్సులను అభ్యర్థించాడు. అప్పుడు భీష్ముడు "ధర్మరాజా! నీవు వచ్చినందుకు సంతోషం. రాకుండా ఉన్నట్లయితే నేను ఆగ్రహించి ఉండేవాడిని. నీకు శుభం కలుగు తుంది. ధర్మం జయిస్తుంది. ఏదైనా వరం అడుగు. ఇస్తాను. ఒక్కటి తప్ప. నన్ను నీ పక్షాన చేరమని అడగవద్దు, ఎందుకంటే మనిషి అర్థానికి దాసుడు. నేను కౌరవుల అర్థానికి బద్ధునై ఉన్నవాణ్ణి. నేను నిజం చెపుతున్నాను" అని అన్నాడు. ధర్మరాజు ఏమంటాడు? ఆశీస్సులను పొంది తిరిగి వెళ్లాడు. తరువాత కథ ప్రారంభ మయింది. అయితే భీష్ముడు చెప్పినమాట ప్రకారం చేశాడా? తాను కౌరవుల సంపదకు బద్ధుడు కదా! వారి తరఫున మనస్ఫూర్తిగా యుద్ధం చేశాడా? యుద్ధం సాగుతుండగా క్లిష్ట మయిన సమయంలో అర్ధరాత్రివేళ తన గుడారం లోనికి వచ్చిన ధర్మజునికి తనను వధించే ఉపాయాన్ని చెప్పాడు. శిఖండి మాటను అడ్డం పెట్టి అస్త్ర సన్యాసంచేసి దుర్యోధనుణ్ణి నడి సముద్రంలో ముంచాడు. అటు తను చెప్పిన మాట నిలుపుకో లేదు. కౌరవులకు బద్ధుడై యుండలేదు. ఇటు సేనాధిపతిగా తన బాధ్యతను నిర్వహించనూ లేదు. మరి భీష్ముడు ఏమి చేసినట్లు? సర్వ ధర్మాలూ తెలిసినవాడని కదా కృష్ణుడు ధర్మజుణ్ణి అంపశయ్యపై నున్న భీష్ముడి దగ్గరకు పంపింది! ఇదేమి ధర్మజ్ఞత?

అంతేనా? నిండుసభలో ద్రౌపదిని దుర్యో ధనుడు అవమానించినపుడు దుశ్శాసనుడు వలువలూడ్చినప్పుడు భీష్ముడు మాటలు చెప్పేదేగాని క్రియంగా చేసింది ఏముంది? ద్యూత సమయంలో కూడా భీష్ముడు చేయవలసిన పని చేయలేదనే అనిపిస్తుంది. అలా పరిశీలించినపుడు భీష్ముడిలో రెండు లోపాలు ఉన్నట్లుగా మనకు తోస్తుంది. ఒక అధర్మయుతమైన వ్యక్తిగా ఆయన తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించలేదు. యుద్ధంలో ఒక సేనాధిపతి కూడా ఆయన తన కర్తవ్యాన్ని సరియైన రీతిలో నిర్వర్తించలేదు. అట్టి భీష్ముడు ధర్మపన్నాలు వల్లిస్తుంటే ద్రౌపది నవ్విదంటే ఆశ్చర్యం ఏముంది?

ఇలా భీష్ముణ్ణి విమర్శపరంపరలకు గురి చేయడం మన చూస్తుంటాం. కాని మనం ఒక విషయాన్ని గమనించాలి. ప్రపంచంలో ఒక్కొక్క వ్యక్తి జీవితంలో ఒక్కొక్క ప్రత్యేక పరిస్థితి ఏర్పడు తుంది. ఆ పరిస్థితినిబట్టి ఆ వ్యక్తి విలువను మనము సాధారణంగా లెక్కవేస్తుంటాము. కాని ఒక వ్యక్తికి ఏర్పడిన పరిస్థితులనుబట్టి వ్యక్తి మంచి చెడ్డలను నిర్ధారించటం సరియైన పద్ధతి కాదు. ఒకడు విలోమ పరిస్థితులలో చిక్కు కొన్నాడు కనుక అతనిలో ఏదో దౌర్బల్యం ఉందనో అనుగుణ ముందనో నిర్ధారించడం సబబు కాదు. అలాగే చేస్తే మనం చిక్కుల్లో పడి పోతాం. ఎందుకంటే శ్రీరామునికి కూడా విపత్కర పరిస్థితి ఏర్పడింది. ఆయన భార్యా సహృతుడు, రాజ్య బహిష్కృతుడు. కనుక ఆయన ఆదర్శం కాదు అనగలమా? పాండవులు అవమానాల పాలు అయినారు కనుక, భార్యను అవమానాలకు గురిచేశారు కనుక వాళ్లు ఆదర్శం కాదా? అదే విధంగా భీష్ముడు కౌరవ పక్షాన ఉండడం సంభ వించింది కనుక లేదా సేనాధిపతిగా వ్యవహ రించవలసిన రీతిలో వ్యవరించ వీలులేక పోయింది. కనుక ఆయన వ్యక్తిత్వానికి లోపం వస్తుందా?

ఒక వ్యక్తిని ఎట్టి పరిస్థితులు ఎదుర్కొన్నాయి అనేది ప్రశ్న కాదు. ఆ పరిస్థితులను అతను ఎలా ఎదుర్కొన్నాడు అనేది ప్రశ్న. ఆ పరిస్థితుల నడుమ మార్గాన్ని సుగమం చేసుకొంటూ ఎలా ముందుకు చొచ్చుకు పోగలి గాడు? ఎలై ధైర్యంతో నిబ్బరంతో, ధర్మ పథాన్ని విడువకుండా నిలబడగలిగాడు అనేది ప్రశ్న. ఈ దృష్టితో మనం భీష్ముణ్ణి గురించి ఆలోచించాలి.

**– వైశంపాయన, జాగృతి 23.10.1982**

---

మహర్షి పౌరోహిత్య వహించారు. ఆ సమయంలో పదివేల శ్లోకాలతో కూడిన బ్రహ్మ పురాణం వివరిం చాడు. శ్రీమన్నారాయణుడి గురించి అకుంఠిత దీక్షతో తపస్సుకు ఉపక్రమించిన ధ్రువుడికి మార్గదర్శనం చేశాడు. గృహస్థ ధర్మాలను నెరవేరుస్తూనే గొప్ప తపస్సంపన్నుడై ప్రజాపతులలో ఒకరుగా ఖ్యాతి గడించారు.

మరీచి భార్యలలో ధర్ముని కుమార్తె దేవవ్రత ఒకరు. భర్త సేవకు అంకితమై సేదదీరుతున్న భర్త కాళ్లు ఒత్తుతోంది.అదే సమయంలో బ్రహ్మ అక్కడికి రాగా, ఆయన అలసట తీర్చే క్రమంలో ఆయన పాదాలను ఒత్తసాగింది. మెళకువ వచ్చిన మరీచుడు, ఆ దృశ్యాన్ని చూసి, 'పరపురుషుడి కొలుస్తున్నావు కనుకశిలగా మారు'అని శపించాడు. తాను ఎలాంటి దోషానికి పాల్పడలేదంటూ, పంచాగ్నుల మధ్య కూర్చొని శ్రీ మహావిష్ణువు గురించి తపస్సు చేసి మెప్పించింది.కానీ, మరీచి మహాముని శాపం ఉపసంహ రింపలేనిదని, అయితే పవిత్రశిలగా పూజార్హత పొందుతావు'అని వరం ఇచ్చాడు. 'దేవశిల' అనే ఆ శిల నేటికి హిందువుల ఇళ్లలో, పూజా ప్రదేశాలల్లో పూజలు అందుకుంటోంది. దానిని లక్ష్మీ సమేత త్రిమూర్తి స్వరూపంగా భావించి అర్చిస్తారు.

ఆయన రాసిన మరీచిస్మృతిలో ఆహ్నిక, అశౌచ, శ్రౌద్ధ, ప్రాయశ్చిత్త విధులు అనేకం ఉన్నాయి. ఆయన ఎనమిది సంహితలు వెలువరిం చారు. జయ, ఆనంద తదితర సంహితలను అనంత సహింతగా పేర్కొన్నారు. పాంచరాత్రాగమ మార్గం లోని సూక్ష విషయాలు, గోపుర నిర్మాణం, పూజా విధులు, వైఖానస మహిమ, అర్చావతార విచారణ తదితర అంశాలు సంహితలలో వివరించారు.

**– రామచంద్ర రామానుజ**

---

## వివేకానంద సూక్తిశతి

**Accept the 'Benefical' and Discard the 'Pleasant'**



కష్టమైనగాని ఇష్టమ్ము జేసుకో
ఎపుడు మేలి పథమునెంచుకొనుము
ఇష్టమైనదారి కష్టమ్ముగొనితెచ్చు
వినుడి స్వామి సద్వివేక వాణి!!



బండిరాజుల శంకర్




బంగాళాఖాతంలో అల్పపీడనంవలన, రుతుపవనాలు త్వరగా ఆంధ్రాలో ప్రవేశించటం వల్ల నాలుగురోజులనుంచీ ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్నాయి. ట్రాఫిక్‌కి, ట్రాన్స్‌పోర్ట్‌కి, ప్రజలకి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఎక్కడి వ్యాపారాలక్కడే ఆగిపోయాయి. రోడ్లన్నీ జలమయమయి వాహనాలకి ఎనలేని యిబ్బంది. టీ.వీ. ప్రతి ఛానల్లో వర్షాభావంవల్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, హెచ్చరికలు వినిపిస్తున్నారు.

ఇవన్నీ మామూలే. దేనిదారిదానిదే, తమ ఇల్లు సకల సదుపాయాలతో నిర్మించుకున్నారు. ఈ తుఫాను ప్రభావంవల్ల తమకి ప్రమాదమేమీ లేదని, కాకపోతే 'కరెంటు ప్రభావంచూపుతుంది. తమకి ఇన్వర్టర్‌ఉంది. నో ప్రోబ్లమ్ అనుకుంది లక్ష్మి.'

టైము రాత్రి పదకొండయింది. తెల్లవారితే ఆదివారం అందరికీ సెలవుదినం. పిల్లలకి రెండు రోజులనుండి సెలవులిచ్చారు. వర్షంవల్ల ఇబ్బందులు పడకుండా, భర్త వ్యాపారం పనిపై క్యాంప్‌కెళ్లాడు. మరో రెండు రోజులగ్గాని రాడు. రేపు ఆలస్యంగా లేవొచ్చు అనుకుంటూ 'టి.వి. ఆఫ్ చేసి పిల్లల ప్రక్కన పడుకుంది లక్ష్మి. 'స్టోర్ రూంలో సన్నగా దగ్గు వినిపించింది. ఈ ముసలావిడ ఒకత్తె తన ప్రాణానికి, ఎవరికైనా అత్త, ఆడపడుచు పోరుంటుంది. తనకి మాత్రం ఈ బామ్మ పోరు. అతిగా వాగడం, అన్నింట్లో వేలు దూర్చడం ఈవిడకి అతి పెద్దరోగం. భర్తకు చెపితే.

లక్ష్మీ మనకి పెద్ద దిక్కేవరున్నారు. ఈవిడ తప్ప. ఈవిడే నా చిన్నతనం నుంచి నన్ను చేర దీసింది. అమ్మ దగ్గరకంటే ఈ బామ్మ వద్దే చేరిక. అమ్మకంటే ఆలనాపాలనా ఎక్కువగా చూసేది. బతిమాలి గోరుముద్దలు తినిపించేది. అమ్మకి దూరంగా ఉన్నాం. నన్నొదల లేక నాతో వచ్చింది. కన్నవారికంటే పెంచిన ప్రేమ గొప్పదంటారు. ఆవిడ్ని ఈ వయసులో వదల్లేను. ఏదోలా సర్దుకుపోదూ... అంటారు.

అద్దె ఇంట్లో నుంచి స్వంత ఇంట్లోకి మారారు. పాత వస్తువులు కొందరికిచ్చేశారు. రోలూ, రోకలీ వ్యానులో కెక్కించింది. మిక్సీగ్రేండర్ ఉన్నప్పటికీ నాతోపాటూ ఒక మూల పడి ఉంటాయి అంటూ వాటిని తెచ్చింది బామ్మ.

ఈ కొత్త ఇంట్లో ఓ మూల స్టోర్ రూం ఉంది. దానికి ఆనుకునేలా ఓ బాత్‌రూం ఉంది. ఆ గదిలో మంచం వేయించి , బామ్మాగదిలోకి రాకండి. మార్బుల్ స్టోన్స్. కాలు జారిందంటే ఈ

# సీనియర్ సిటిజన్

జి.యస్.కె.సాయిబాబా

వయసులో కష్టం. మీకు కావలసినవి నేను ఆ గదిలోకి పంపుతాను అంటూ శ్రేయస్సు కోరేదానిలా బామ్మని గదిలోకి రాకుండా చేసింది. లేకపోతే వాగే నోరు – తిరిగే కాలు ఊరికే ఉండ దంటారు. వచ్చే వారందరితో ఏదో వాగుతుంది. ముందరి కాళ్లకు బంధం వేసింది లక్ష్మి. బామ్మ మీద ఏదో మూల కోపం. ఎందుకో తెలీదు.

టైము పన్నెండయింది. కళ్లు మూతలు పడు తున్నాయి. నిద్రలోకి జారుకుంది లక్ష్మీ వాతావరణ చల్లదనానికి. రాత్రి మూడయింది. సడెన్‌గా మెలకువ వచ్చింది. గాలికి కిటికి రెక్కలు కొట్టు కుంటుంటే వాటిని బంధించింది. వర్షం బాగా పుంజుకుంది. గాలి హోరు వర్షం చప్పుడు వినిపి స్తుంది. గాలి తీవ్రత ఎక్కువవుతుంది. తమ యింటికి దూరదూరంగా ఇళ్లు ఏర్పడుతున్నాయి ఇప్పుడిప్పుడే. స్థలం చౌకగా వచ్చింది. బ్యాంకు లోనిచ్చిందని ఇల్లు నిర్మించుకున్నారు. ఎక్కడో పిడుగుపడింది. ఆ శబ్దానికి దివ్య లేచి 'అమ్మా' అని అరుస్తూ కళ్లు నులుముకుంటూ తన దగ్గరకి రాసాగింది. నిద్రమత్తులో నేలపై ఒలికిన నీరుపై కాలేసి జర్రున జారి పడింది. చేతికి గాజులు గుచ్చుకున్నాయి. రక్తం కారసాగింది. లక్ష్మి తుళ్లి పడింది. గభాలున లేచింది. కూతుర్ని దగ్గరకి తీసుకుని వంటింట్లోకి వెళ్లి టీ పొడి డబ్బా తెరచి యింత టీ పొడి తీసుకుని, అంతవరకూ పైట చెంగుతో రక్తాన్ని అద్ది పట్టుకున్న లక్ష్మి చెంగు తీసి ఆ టీ పొడి గాయంపై అద్దింది. ఈ లోపు హడా విడికి చిన్నమ్మాయి లత ఏడ్పు లంఘించుకుంది. సోఫాలో దివ్యని కూచోపెట్టి లతని దగ్గరకు తీసుకుని ఓదార్చసాగింది. కాస్సేపటికి పిల్లల్ని ఓదార్చి పాలు కలిపిచ్చింది. వంటింట్లోకి హడావిడిగా వెళ్తుండగా కాలు మడతపడింది. లేవలేకపోయింది. పాదం మెలికపడి బాగా నొప్పి చేసి వాచిపోయింది. లేవలేక నేలపై కూర్చుండిపోయింది.

ఉదయం ఏడయింది. హాల్లో ఒక తొడపై దివ్య, ఒళ్లో లత పడుకున్నారు. బయట వర్షం చాలా భీకరంగా ఉంది.

ఎప్పుడూ కనీవినీ ఎరుగని రీతిలో గాలి, వర్షం ప్రజలపై ప్రభావం చూపుతుంది. వాయు దేవుడికి పూనకం వచ్చిందా, వరుణ దేవునికి ఆగ్రహం కలిగిందా? అన్న రీతిలో గాలివాన తమ ప్రతాపం చూపుతున్నాయి. కాలి పాదం మెలి తిరిగి విపరీతంగా సలుపుతోంది లక్ష్మికి.

ప్రళయం సంభవిస్తుందా! వినాశనం కలుగు తుందా! ఏమిటీ ప్రకృతి విలయతాండవం విశాఖ పట్నానికే రావాలా? ఈ సిటీ ప్రజల జీవితం అతలాకు తలంగా మారుతుంది. పాలు సరిగ్గా రావు. కరెంటు తీసేస్తారు. పిల్లలకి స్కూలు సెలవు. భీకర ధ్వనులతో చెట్లు పెళపెళ విరిగి పడుతున్నాయి. తెగించి అవసరాలకి వీధిలోకి వెళ్లిన మనుషులు తిరిగి క్షేమంగా, ఇళ్లకు చేరుతారో లేదో అన్న భయం ఏర్పడుతుంది. రోడ్లపై గుంతలు. మోకాలి లోతు నీరు. భయంకర జీవితాలు ఈ సిటీ జీవితాలు, లోలోన బాధపడసాగింది లక్ష్మి.

లత డల్‌గా ఉంది. లేచిన దగ్గర్నుండి నీరసంగా కనిపిస్తోంది. దివ్య సరేసరి చేతి బాధతో, పెద్ద పిల్ల కాబట్టి ఓర్చుకుని నిద్ర పోకుండా సోఫాలో కూర్చుంది తెల్లవార్లూ.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది స్టోర్‌రూంలో ఉన్న బామ్మ. మెల్లిగా ఓర్చుకుంటూ, కాలి బాధ భరిస్తూ అక్కడికి చేరింది. ఆ గది చాలావేడిగా ఉంది. గాలి, చలి చొరబడకుండా ఇనప్పెట్టిలా ఉంది పకడ్బందీగా.

బామ్మా! లేచారా! ఒక్కసారిలారండి! లతకి జ్వరం తగిలింది. దివ్యకి చేతికి గాయం. నా కాలికి నొప్పి. ఇంట్లో మందులు లేవు. బయటకి వెళ్లే పరిస్థితి లేదు. నాకు అయోమయంగా ఉంది. దాదాపు ఏడ్పు స్వరంతో తన బాధ మొరపెట్టుకుంది లక్ష్మి దీనంగా.

గబ గబా వచ్చింది బామ్మ. ఆ వయసులో కూడా ఆమె చురుకుతనానికి ఆశ్చర్యమేసింది. అందుకే అంటారు పూర్వకాలం ఆహారం ఎంత పటిష్ఠంగా ఉంటుందో, మనుషులు కూడా అంతే. తొంభై సంవత్సరాలు, వందేళ్లు, ఏ జబ్బు జ్వరాలు లేకుండా సునాయాసంగా బతుకు తున్నారు. మరి నేటితరం సకల రోగాలతో ఏభైయ్యేళ్లకే ఫట్‌మంటున్నారు నిట్టూర్చింది.

లత నుదుటిపై చెయ్యి వేసి చూసింది. ఆఁ! జ్వరం బాగానే తగిలింది. దీనికి మందు మన వంటింట్లో ఉంది. నువ్వేం గాభరాపడకు. జ్వరం గిరం ఎగిరిపోతాయంటూ వంటింట్లోకి వెళ్లింది. కాస్త శొంఠి తీసుకొచ్చింది. బామ్మకి కరెంటు లేదన్న ధ్యాసే లేదు. గబగబా వచ్చి తన మంచం క్రింద ఉన్న చిన్న రోలూ రోకలీ బయటకు లాగింది. దానిలో శొంఠి కొమ్ములేసింది. నిమిషంలో పొడిచేసింది. దాన్ని నీళ్లలో కలిపింది. లత నుదుటికి పట్టువేసింది. కాస్సేపటికి బామ్మ ఒళ్లోకి చేరి హాయిగా పడుకుంది లత.

వాతావరణం శాంతించలేదు. నిమిషం ఓ యుగంలా గడుస్తోంది. భీకర శబ్దాలు. పిడుగులు పడుతున్న శబ్దాలు. ఆ శబ్దాలుకి 'అర్జునా, ఫల్గుణా, పార్థా అంటూ బామ్మ స్మరిస్తోంది పైకి. ఏమే తల్లీ ఏ కాలునొప్పి అంటూ మెంటో ప్లస్ తీసుకుని పాదానికి, జాయింటుకి రాసి నిమిరసాగింది. ఆ చేతిలో ఏ శక్తి ఉందో కాని కాస్త రిలీఫ్ కనిపించి ఆశ్చర్యపోయింది లక్ష్మి. పెద్ద శబ్దమయింది ఇంటి ముందు. కిటికీ తెరచి చూసింది లక్ష్మి. కరెంటు స్తంభం కూలిపోయింది. కరెంటు ఎప్పుడో కట్ అయింది. లక్ష్మి గుండె గుభేలుమంది. ఎప్పుడొస్తుందో ఏమిటో ఖర్మ! ఇప్పటి జీవితమంతా కరెంటుతోనే. ఇంట్లో వస్తువులు, వంటింట్లో గ్రైండర్, మిక్సీ, ఎలక్ట్రికల్ స్టౌ ఇలా ఎన్నో! ఎలారా భగవంతుడా! అనుకుంది గ్యాసు కూడా అయిపోయింది.

'లక్ష్మీ! నువ్వేం గాభరా పడకు. పిల్లల్ని దగ్గరుంచుకో! వంట పని,ఇంటి పని నేనున్నానుగా, చూస్తాను' అంటూ బామ్మ, మిక్కటిన్నులో పాలు కలిపింది. కిరసనాయిలు స్టౌ వెలిగించింది. పాలు వెచ్చచేసింది. డికాషన్ తయారుచేసి కాఫీ కలిపింది. తీసుకెళ్లి లక్ష్మికిచ్చింది. అప్పటికే మొహాలు కడుక్కున్న లక్ష్మి, దివ్య, లతలు బామ్మ కలిపిన కాఫీ, పాలు తాగారు. ప్రాణం లేచొచ్చింది. బామ్మని ప్రేమగా చూసారు. కళ్లల్లో అనురాగం మెరిసింది.

బామ్మ గబగబా కత్తిపీట దగ్గరకు వేసుకుని

ఒక గంట వర్షం ఆగింది. ఆ గంటలో జనం బయటకొచ్చి కావలసినవి, కొంచెం ఎక్కువే కొనుక్కున్నారు. కాలనీల్లో ఉన్న షాపు బలవంతాన తెరిపించి సరుకులు కొనుక్కున్నారు. అంతే మళ్లీ ఊపందుకుంది గాలివాన. ప్రళయం సంభవిస్తుందన్న చందాన తీవ్ర రూపం దాల్చింది. ఆ భీకర వర్షాగమనానికి ప్రతివారు భీతిల్లారు.



పచ్చిమిర్చి, ఉల్లిపాయలు చకచకా తరిగింది. కిరసనాయిలు స్టౌపైనే కరాచీ నూక ఉప్మా చేసింది. అరగంటలో వేడివేడి ఉప్మా ప్లేట్లలో తెచ్చి ముగ్గురికీ అందించింది. లక్ష్మి చేష్టలుడికి చూస్తుండి పోయింది. 'అమ్మా లక్ష్మి! నువ్వు టిఫిన్ చేసి స్నానం పూర్తిచేయి. వంటింట్లోకి రాకు. కాలునొప్పి ఎక్కువవుతుంది. వంట పని నేను చూస్తాను. అలా కూర్చో! ఏం భయపడకు నేను న్నానుగా!' అంటూ ధైర్యం చెప్పింది. వాతావరణం కాస్సేపు రిలీఫ్ ఇచ్చినట్లే ఇచ్చి మళ్లా భీకర రూపం దాల్చింది. గాలి దిశ మారింది. వడగళ్లు పడసాగాయి. ఇంటిపై ఎవరో రాళ్లు విసిరినట్లు మంచు గడ్డలు టప్, టప్ మంటూ చప్పుళ్లు. కిటికీ తలుపు తెరచి వీధివైపు చూసిన లక్ష్మీ అవాక్కయింది. మల్లెపూలు పరచినట్లు వీధంతా వడగళ్లు. పిల్లలు వర్షాన్ని లెక్క చెయ్యక వడగళ్లు చేతిలో తీసుకుని ఒకరిపై ఒకరు విసురుకుంటు న్నారు. ఒకరికి తగలగానే పగలబడి నవ్వులు. పిల్లలచేష్టలకి వారి పెద్దలు సంతోషించినా వర్షంలో తడిస్తే జలుబు, జ్వరాలు వస్తాయని గాలికి ఏదైనా ఎగిరి మీద పడతాయేమోనని ఇళ్లల్లోకి రమ్మని హెచ్చరిస్తున్నారు. పిల్లలు వాళ్లని లెక్క చెయ్యటం లేదు. పెద్దలు చూస్తుండిపోవటం తప్ప ఏం చెయ్యలేకపోతున్నారు.

తలుపులు మూసివేసింది లక్ష్మి. పిల్లలిద్దరూ అల్పాహారం సేవించారేమో హుషారొచ్చింది. పుస్తకాలు తెచ్చుకుని చదువుతూ, తెలియనివి ఒకర్నొకరు అడిగి తెలుసుకుంటున్నారు. లక్ష్మి లేచి మెల్లిగా బాత్‌రూంలోకి వెళ్లింది. అండాల్లో పట్టి ఉంచిన నీరు పనికి వచ్చింది. హాయిగా స్నానంచేసి బట్టలు మార్చుకుంది. టెన్షన్ తగ్గి హాయిగా ఉంది శరీరానికి, మనసుకి.

తల విప్పి జడ వేసుకుంది. మొహానికి పౌడరు అద్ది బొట్టు నుదుట గోపురం కుంకుమతో అద్దుకుని ఫ్రెష్‌గా తయారయింది. సోఫాలో కూర్చుని "స్వాతి" పత్రిక తిరగ వేయసాగింది.

మామ్మ ఫ్రిజ్ తెరచి చూసింది. అందులో కాయగూరలేమీ లేవు. ఈ వర్షానికి బయటి ఏమీ రావు. వెళ్లటానికి వీలు లేదు. అష్టదిగ్బంధంలా అయింది ప్రతివారి పరిస్థితి. 'కాలే కడుపుకి మండే బుగ్గని' సామెత ఉంది. అలాగ ప్రతి ఇంట్లో ఉన్నవాటితోనే భోజనం చేస్తున్నారు. సరుకులుంటే కాస్త కాస్త వండుకుని తింటున్నారు. కిర్సనాయిలు స్టౌలకి పని చెప్తున్నారు. ఎప్పటికి తగ్గేనో జనం ఎప్పుడు తమ నిత్య కృత్యాల్లో మునుగుతారో ప్రతివారి ముఖంలో దైన్యం గోచరిస్తుంది. ఏదో కోల్పోయినవారిలా ఉన్నారు. ఇంట్లోంచి ఎక్కడకీ కదలక కరెంటు లేదు. టీవీలు లేవు. ఇంట్లో కరెంటు సంబంధించినవి ఏవీ పని చేయటం లేదు. బాల్కానీలో, అరుగుల మీద కూర్చుందామంటే ఆగకుండా కురిసే వర్షం. 'త్రిశంకు స్వర్గం'లా ఉంది ప్రతి వారి పరిస్థితి.


పన్నెండయింది టైం. లక్ష్మి సోఫాలో కూర్చుని బామ్మనే చూస్తుంది. 'దోశెడు కంది పప్పు రెండు ఎండు మిరపకాయలు, నాలుగు వెల్లుల్లి రెబ్బరలు, జీలకర్రా తీసుకుంది. పెనంలో వేసి దొరగా వేయించింది. వాటికి కొంచెం చింతపండు, ఉప్పు కలిపి బండ పచ్చడి చేసింది. ఉల్లిపాయలు కోసి పులుసు చేసింది. వేడిగా అన్నం వార్చింది.

బామ్మగారి చురుకు,తెలివి, నేర్పరితనం అలా కళ్లప్పగించి చూడసాగింది లక్ష్మి. తనేం చెయ్యలేని పరిస్థితి, కదిలి చెయ్యి కల్పించుకోలేని పరిస్థితి.

వంట పూర్తి చేసి స్నానంచేసి దైవానికో నమస్కారం చేసుకుని బట్టలు మార్చుకుని వచ్చి, లక్ష్మికి, పిల్లలకి వడ్డించింది. సుష్టుగా తిన్నారు. బామ్మ చేతి వంట అమృతంలాగా ఉంది. బామ్మ ఆ సమయంలో దైవంలా కన్పించింది. మనస్సులోనే నమస్కరించుకుంది.

ఒక గంట వర్షం ఆగింది. ఆ గంటలో జనం బయటకొచ్చి కావలసినవి, కొంచెం ఎక్కువే కొనుక్కున్నారు. కాలనీల్లో ఉన్న షాపు బలవంతాన తెరిపించి సరుకులు కొనుక్కున్నారు. అంతే మళ్లీ ఊపందుకుంది గాలివాన. ప్రళయం సంభవిస్తుందన్న చందాన తీవ్ర రూపం దాల్చింది. ఆ భీకర వర్షాగమనానికి ప్రతివారు భీతిల్లారు.

మర్నాటికి తుఫాను వెలిసింది. లక్ష్మిలో అంతర్లీనంగా ఉన్న అహంకారం తుడిచి పెట్టుకుపోయింది. తుఫాను ప్రారంభమయిన అయిదో రోజు. ప్రజలు మెల్లగా కోలుకుంటు న్నారు. క్యాంపు నుంచి కృష్ణసాయి ఇంట్లోకి అడుగుపెడుతూనే అక్కడి మార్పు గమనించాడు. ఆశ్చర్యానికి లోనయ్యాడు బామ్మ హాల్లో సోఫాలో కూర్చొని దివ్యకి జడ వేస్తుంది. లక్ష్మి లతకి పాఠం చెప్తుంది. భర్తని చూడగానే లేచి ఆప్యాయంగా చేతిలో బ్యాగు అందుకుంది. కాఫీ తెచ్చి ఇచ్చి తుఫానువల్ల ఇబ్బందులు, ఇంట్లో విషయాలు, బామ్మ చాకచక్యం, పని నేర్పు పూసగుచ్చినట్లు చెప్పింది. బామ్మతో తల్లితో మాట్లాడినట్లు మాట్లాడుతూ సలహాలడిగి తీసుకుంటున్న భార్యని చూసి కళ్లు చెమర్చాయి. ఇంటి పెద్దలు, పాత సామాను వాటి విలువ గుర్తించింది భార్య. తనకి అంతకంటే కావల్సిందేముంది. పిల్లలకి ఫస్ట్ ఎయిడ్ చేయించాడు. తుఫానువల్ల తను మాత్రం లాభం పొందాడు. తుఫాన్‌కి మనసులోనే కృతజ్ఞతలు అర్పించాడు కృష్ణసాయి. ★



**ఒకప్పుడు రవి అస్తమించని సామ్రాజ్యం. గత శతాబ్దం వరకూ ప్రపంచ రాజకీయాల కేంద్రస్థానం. వలసపాలనలో దేశదేశాల నుంచి దోచి తెచ్చిన సంపదతో విలాసవంతంగా ఆవిర్భవించిన రాజ్యం. అది ఇంగ్లండ్. ఒకప్పుడు ప్రశాంతంగా ఉన్న ఇంగ్లండ్ ఇప్పుడు నిద్రలేని రాత్రులు గడుపుతున్న భయానక నేలగా మారిపోయింది. ఒకవైపు వలసవాదులపై పార్ రైటిస్టుల దాడులు.. మరోవైపు వలసవాదులకు మద్దతుగా జాతి వివక్ష వ్యతిరేక నిరసనకారుల ముసుగులోని లిబరల్, సెక్యులర్ ముఠాల ఆందోళనలు. వెరసి అగ్నిగుండంగా మారిపోయింది. పైకి ఒప్పుకోకపోయినా ఒక రకంగా ఇది అంతర్యుద్ధమే. ఇప్పుడు ప్రపంచమంతా వినిపిస్తున్న ప్రశ్న- బ్రిటన్‌లో ఏం జరుగుతోంది?**



# బ్రిటన్ అల్లర్లు.. అసలు నిజాలు



ప్రధాని, స్టార్మర్

గత నాలుగు వారాలుగా యునైటెడ్ కింగ్‌డమ్ అల్లర్లతో అట్టుడికిపోతోంది. లండన్ సహా అనేక నగరాల్లో విచ్చల విడిగా దాడులు, లూటీలు, దహనాలు జరిగిపోతున్నాయి. ఇది వలసదార్లు, వలస వ్యతిరేక వర్గాలకు మధ్య జరుగుతున్న పోరాటం. ఒకవైపు పార్ నేషనలిస్టులు, మరోవైపు సోకాల్డ్ జాతివివక్ష వ్యతిరేక నిరసనకారులు దాడులు చేసుకుంటున్నారు. దుకాణాలు, వాహనాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను దహనం చేస్తున్నారు. లివర్‌పూల్, మాంచెస్టర్, బ్రిస్టల్, హల్, స్టోక్ ఆన్ ట్రెంట్, బ్లాక్‌పూల్, లీడ్స్, బెల్‌ఫాస్ట్, నాటింగ్‌హామ్ తదితర నగరాలు ఉద్రిక్తంగా మారిపోయాయి. అందుకే ఇది అంతర్యుద్ధమని చెబుతున్నారు.

చౌకగా దొరికే శ్రామికశక్తి కోసం బ్రిటన్ వలసలను ప్రోత్సహించింది. వారే ఇప్పుడు అత్యధికులుగా మారే ప్రమాదం ఏర్పడింది. స్థానిక బ్రిటిషర్లు క్రమంగా అల్పసంఖ్యాకులుగా మారిపోతున్నారు. వలసవచ్చిన వారి కారణంగా మతోన్మాదం, జిహాదీ ఉగ్రవాదం పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ గొడవలతోనే బ్రిటన్ అట్టుడికిపోతోంది.

**వలసల వెనుక మరో కోణం**

200 ఏండ్లకు పైగా వలసవాద పాలన సాగించిన చరిత్ర బ్రిటన్‌ది. వీరి అరాచకాల గురించి కొత్తగా చెప్పాల్సిన పని లేదు. ఒకప్పుడు తమ ఏలుబడిలో ఉన్న దేశాల నుంచి బ్రిటన్‌కు వలస వచ్చేవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతూ వచ్చింది. యునైటెడ్ కింగ్‌డమ్‌కు వలసవస్తున్న వారిలో రకరకాల దృక్పథాలున్నవారు కనిపిస్తారు. మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో తమ కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలని భావించే మధ్యతరగతి వర్గాలు ఉంటాయి. ముఖ్యంగా భారత్ నుంచి వెళ్లేవారు ఇందుకు ఉదాహరణ. ఇలా వలసదార్ల సంతతి వారు విద్య, వ్యాపార రంగాల్లో ముందంజ సాధిస్తున్నారు. భారతీయ సంతతికి చెందిన రుషి సునాక్ మొన్నటివరకు బ్రిటన్ ప్రధాని పదవిని నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇదంతా నాణేనికి ఒకవైపు మాత్రమే.

పశ్చిమాసియాతో పాటు ఇస్లామిక్ దేశాల నుంచి బ్రిటన్‌కు వస్తున్నవారి ఆలోచనా విధానం వేరుగా ఉంది. వీరంతా డ్రైవర్లుగా, హోటళ్లు, పెట్రోల్ బంకులు, ఇళ్లలో పని చేసేవారు, చిన్న చిన్న వ్యాపారాలు చేసేవారే. ఇలాంటి వలసలతో అక్కడ ముస్లిం సమాజం బలంగా ఎదుగుతోంది. మసీదులు పెద్ద సంఖ్యలో ఏర్పడాయి. కొన్ని ప్రాంతాలకు వెళ్లితే ఇది క్రైస్తవ దేశమా లేక పాకిస్తాన్ లాంటి ముస్లిం దేశమా అని ఆశ్చర్యపోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. వీరంతా శాంతి సామరస్యాలతో అక్కడి సమాజంలో కలిసిపోతే ఎలాంటి సమస్య ఉండదు. బ్రిటన్ సమాజంలో నేరాలు పెరిగిపోవడానికి కారణం పలానావారు అని ఆరోపించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనికి తోడు అక్కడ ఇస్లామిక్ జీహాదీలు ఆందోళన కలిగిస్తున్నారు

క్రైస్తవాన్ని పాటించే బ్రిటిష్‌వారు ఒకప్పుడు హుందాగా జీవించేవారు. ఇప్పుడు తమ సొంత దేశంలోనే మైనారిటీలుగా మారిపోతున్నామని వారిలో ఆందోళన మొదలైంది. బ్రిటన్‌లోని సెక్యులర్, లిబరల్ మనస్తత్వం కలిగిన రాజకీయ నాయకులు తమ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఇదంతాచూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. బ్రిటన్‌కు వచ్చే శరణార్థులు, వలసదారుల పట్ల అక్కడి ప్రభుత్వం ఉదారంగా వ్యవహరిస్తున్నది. వారికి రాయితీలు ఉంటాయి. ఈ సౌకర్యాలు తమకు దక్కడం లేదని సాధారణ బ్రిటిష్ పౌరులు భావిస్తున్నారు. నిరుద్యోగ సమస్య అధికంగా ఉంది.



సౌత్‌పోర్టు దాడిలో మరణించిన ఎల్సీ డాట్ స్టాన్‌కోంబ్, ఎలైన్ డా లాస్వి అగ్యియర్, బెబే కింగ్

ఈ కారణంగానే వారు వలసదారులపై, ముఖ్యంగా ముస్లింలపై ద్వేషం పెంచుకుంటున్నారు. కానీ అక్కడి సోకాల్డ్ ఉదారవాదులు, లిబరల్లు ఈ భయాన్ని ఇస్లామిక్ ఫోబియా అంటూ కొట్టిపారేస్తున్నారు

**లండనిస్తాన్**

ఒకప్పుడు ప్రపంచాన్ని శాసించిన బ్రిటిష్‌వారి రాజధాని లండన్. భవిష్యత్తులో ఈ చారిత్రక నగరం తమదని వారు చెప్పుకోలేకపోవచ్చు. కారణం ఇక్కడ దెబ్బతిన్న జనాభా సమతౌల్యమే. వివిధ దేశాల నుంచి పథకం ప్రకారం వలస వచ్చిన వారు ఇప్పటికే లండన్ మీద ప్రాబల్యం సాధించారు. ప్రస్తుతం లండన్ నగరానికి మేయర్ సాదిక్ ఖాన్. పాకిస్తానీ మూలాలు ఉన్న సాదిక్ లేబర్ పార్టీ తరపున మూడుసార్లు మేయర్‌గా ఎన్నికయ్యారు. లండన్‌ను అనధికారికంగా 'లండనిస్తాన్' అంటారు. ఈ పదాన్ని ఇంగ్లీష్ పత్రికలే ప్రముఖంగా వాడటం గమనార్హం.

లండన్‌లో ఉగ్రవాద గ్రూపుల ప్రాబల్యం పెరిగిపోయింది. వాస్తవానికి ఈ పరిస్థితి అమెరికాపై 9/11 దాడులకు ముందే ఏర్పడింది. అబ్దుల్లా ముత్తలాబ్ అనే వ్యక్తి ఉగ్రవాద కార్యకలాపాలకు ఆజ్యం పోశాడు. ఇది అల్ ముహజిరౌన్ ఉగ్రవాద సంస్థ ఏర్పాటుకు దారి తీసింది. బ్రిటన్‌లో ఉగ్రవాద భయాందోళనలను మొట్ట మొదటిసారి 2010లో గుర్తించారు. పశ్చిమ దేశాల్లో ఉగ్రవాద విస్తరణకు లండన్ కేంద్రస్థానంగా మారింది. ఫ్రాన్స్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడే ఇస్లామిక్ తీవ్రవాదులు అరెస్టుల నుంచి తప్పించుకునేందుకు లండన్ పారిపోయి వచ్చేవారు. వారిని అరెస్టు చేసేందకు బ్రిటన్ అధికారులు సహకరించేవారు కాదు. దీంతో ఫ్రెంచ్ పోలీసులు బ్రిటన్‌ను 'లండనిస్తాన్' అని పిలవడం మొదలు పెట్టారు. బ్రిటిష్ జర్నలిస్ట్ మెలానీ ఫిలిప్స్ ఏకంగా 'లండనిస్తాన్: హౌ బ్రిటన్ ఈజ్ క్రియేటింగ్ టెర్రర్ స్టేట్ విథిన్' పేరుతో 2006లో పుస్తకం ప్రచురించాడు. ఇస్లామిక్ తీవ్రవాదం, ఉగ్రవాద చర్యలతో ముంచుకొస్తున్నముప్పును గుర్తించిన యున్కెటెడ్ కింగ్‌డమ్ క్రమంగా చర్యలకు ఉపక్రమించింది. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిపోయింది. ప్రస్తుతం లండన్‌లో ఇస్లామిక్ రాడికలైజేషన్ అంత తీవ్రంగా లేకున్నా ముప్పు మాత్రం తొలిగిపోలేదు.

**సమస్యగా మారిన వలసలు**

1980 నుంచి యూరప్ దేశాలు ముస్లిం వలస సమస్యను ఎదుర్కొంటున్నాయి. దీనికి తాజాగా పశ్చిమాసియా దేశాల్లో అంతర్యుద్ధం, అనిశ్చిత వాతావరణం తోడైంది. సిరియా, లిబియా, ఇరాన్, నైజీరియా, అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ తదితర దేశాల నుంచి పెద్ద సంఖ్యలో వలసదారులు యూరోప్‌లోకి చొరబడ్డారు. మధ్యధరా సముద్రం మీదుగా సాగే ఈ వలసలకు స్పెయిన్, ఇటలీ, గ్రీస్, మాల్టా ముఖద్వారాలు. యూరోప్ దేశాలు మొదట్లో వీరిని చౌకగా దొరికే శ్రామికులుగా గుర్తించి తమ దేశాల్లోకి అనుమతించాయి. భారత్ తరహాలోనే అక్కడి సెక్యులర్, లిబరల్ ప్రభుత్వాలు బుజ్జగింపు రాజకీయలతో వారికి అండగా నిలిచాయి. క్రమంగా ఈ వలసదారులు అక్కడి జాతీయ-అంతర్గత భద్రతకు, సామాజిక వ్యవస్థకు భంగకరంగా మారారు.



అక్సెల్ రుకడు బానా

వలసదారులు ఆయా దేశాల్లో హింసకు, లైంగిక అత్యాచారాలను దిగడం ద్వారా శాంతి భద్రతలకు సవాలుగా తయారయ్యారు. కొన్ని నగరాల్లో వీరి జనాభా తామరతంపరలా పెరిగి స్థానిక జనాభాను మించిపోయారు. మసీదుల సంఖ్య పెరిగి, బురఖాలు ధరించే స్త్రీలు, అకారణంగా గొడవలకు దిగే ఛాందసులు ఎక్కువయ్యారు. ముంచుకొస్తున్న ప్రమాదాన్ని గ్రహించిన ఆయా దేశాలు వలసల నిరోధానికి ఎన్ని చర్యలు తీసుకున్నా ఫలితం లేకుండా పోయింది. 1998 నాటి జనాభా ప్రకారం యూరోప్ దేశాల జనాభా 74.64 కోట్లకు చేరగా ఇందులో ముస్లింలు 25 కోట్ల వరకూ ఉంటారని అంచనా. తాజా లెక్కలు తీస్తే ఇంకా ఎక్కువే. ముస్లింలు ఆధిక్యతను పెంచుకోవడంతో పాటు తమ ఆచారాలను మిగతా సమాజాలపై బలవంతంగా రుద్దే ప్రయత్నాలు చేస్తున్నారు. హలాల్ పేరుతో ఆహారపు అలవాట్లను మార్చుస్తున్నారు. అంతర్జాతీయ విధానాల్లో అతి జోక్యం పెరిగిపోయింది. ఉదాహరణకు యూరోప్‌కు ఏ మాత్రం సంబంధం లేని పాలస్తీనా సమస్యను అడ్డుపెట్టుకొని ఆందోళనలకు దిగుతున్నారు. అక్కడి రాజకీయాలను కూడా శాసించే స్థాయికి ఎదిగారు. విభిన్న సంస్కృతుల సమ్మేళనానికి చోటిచ్చే ప్రజాస్వామ్యానికీ, ఇస్లాంకీ పొసగదని అనేక మంది యూరోపియన్లు ఇప్పుడు గట్టిగా భావిస్తున్నారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల నుంచి తమ దేశాలను, సంస్కృతిని కాపాడుకునే దిశగా ఫార్ రైట్, నేషనలిజం పేరుతో జాతీయవాద పార్టీలు ఆవిర్భవించాయి

**తాజా పరిణామాలు**

ఇటీవలే రుషి సునాక్ నాయత్వంలోని కన్సర్వేటివ్ పార్టీని ఓడించి లేబర్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రధానిగా వచ్చిన కీర్ స్టార్మర్‌పై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆయన వైఫల్యాన్ని ఈ అల్లర్లు ఎత్తి చూపుతున్నాయి. అల్లర్లను అదుపు చేయాల్సింది పోయి పార్ నేషనలిస్టులను నిందించడం అగ్నికి ఆజ్యం పోసినట్లుగా మారింది. ఈ అల్లర్లలో ఇప్పటి దాకా 130 మంది వరకూ గాయపడితే, వేయి మందికి పైగా అరెస్టయ్యారు.

**సౌత్‌పోర్ట్‌లో ఏం జరిగింది?**

బ్రిటన్ ఉత్తర ప్రాంతంలోని సముద్రతీర పట్టణం సౌత్‌పోర్ట్.. జూలై 29న అక్కడ జరిగిన కత్తిపోటు ఘటనలు, హత్యలు ఆందోళనకు గురిచేశాయి. అక్కడి టేలర్ స్విఫ్ట్ థీమ్డ్ డ్యాన్స్, యోగా పార్టీలో జరిగిన కత్తి దాడిలో చిన్నారులు బెబే కింగ్(6), ఎల్సీ డాట్ స్టాన్‌కోంబ్(7), ఎలైస్ డా సిల్వా అగ్యియర్(9) చనిపోయారు. ఈ వ్యవహారంలో నిందితుడు 17 ఏళ్ల యువకుడని గుర్తించారు. దాడి జరిగిన కొద్దిసేపటికే నిందితుడు 2023లో సముద్రమార్గం ద్వారా బ్రిటన్‌కు వచ్చిన శరణార్థి అని, అతనో

ముస్లిం అంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే అతను ముస్లిం కాదని వేల్స్‌లో రువాండా తల్లిదండ్రులకు జన్మించిన వ్యక్తి అని చెబుతున్నారు. సౌత్‌పోర్ట్ ఘటనలో ఒక్కసారిగా బ్రిటిష్ సమాజం భగ్గుమంది. మరుసటి జూలై 30వ తేదీన హత్యకు గురైన చిన్నారులకు సంతాప సూచికంగా నిర్వహించిన కార్యక్రమానికి వెయ్యి మందికిపైగా హాజరయ్యారు. వీరంతా ఒక్కసారిగా గొడవలకు దిగారు. అక్కడకు వచ్చిన వారు మసీదుపై దాడికి దిగారు. పోలీసులపై రాళ్లు, బాటిళ్లు, టపాసులు విసిరేశారు. పోలీస్ వ్యాన్‌కు నిప్పు పెట్టారు. ఈ పరిణామాల తర్వాత పోలీసులు నిందితున్ని సమీపంలోని ఓ గ్రామంలో అరెస్టు చేశారు. అతనికి తీవ్రవాదంతో ఎలాంటి సంబంధం లేదని ప్రకటించారు. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం నిందితుని పేరు అక్సెల్ రుకడు బానా. ఇతని మతం మీద సందేహాలు ఉన్నప్పటికీ స్థానికంగా అల్లరి మూకలతో తిరిగేవాడని చెబుతున్నారు. ఇతని స్నేహాల కారణంగా ముస్లిం అనే ప్రచారం జరిగి ఉండొచ్చు. వారి మతతత్వ ఉన్మాద ప్రభావం మాత్రం కచ్చితంగా అక్సెల్ రుకడు బానాపై ఉందంటున్నారు.

**వేగంగా వ్యాపించిన అల్లర్లు**

సౌత్‌పోర్ట్ అల్లర్లు క్రమంగా దేశమంతా వ్యాపించాయి. లండన్, హార్టిల్‌పూల్, మాంచెస్టర్‌లలో హింసాత్మక నిరసనలు చెలరేగి, వారం పాటు కొనసాగాయి. దక్షిణ తీరంలోని ప్లైమౌత్ నుంచి ఈశాన్య ప్రాంతంలోని సందర్‌ల్యాండ్ వరకు ఇంగ్లండ్ అంతటా అల్లర్లు చెలరేగాయి. ఉత్తర ఐర్లాండ్‌లోని బెల్ఫాస్ట్‌కు కూడా వ్యాపించాయి. ఆందోళనకారులు మసీదులపై, శరణార్థుల వసతిగృహాల మూకుమ్మడి దాడులు చేశారు. కార్లు, భవనాలతో పాటు లైబ్రరీకి నిప్పుపెట్టారు. దుకాణాల్లో చొరబడి దోపిడీలు చేశారు.

అల్లర్లకు సంబంధించి ఆగస్టు 6 నాటికి 400 మందికి పైగా అరెస్టు చేశారు. వారిలో 11 ఏళ్లలోపు పిల్లలు కూడా ఉన్నారు. వంద మందికిపైగా పోలీసులు గాయపరిచిన ఈ అల్లర్ల వెనుక ఎవరున్నారు అనే దిశగా దర్యాప్తు మొదలుపెట్టారు. ఈ హింసాత్మక ఘటనల్లో నిషేధంలో ఉన్న అతివాద గ్రూపు ఇంగ్లిష్ డిఫెన్స్ లీగ్ (ఈడీఎల్) మద్దతుదారులు పాల్గొన్నట్లు భావిస్తున్నామని పోలీసులు చెప్పారు. ఈడీఎల్ వ్యవస్థాపకుడు టామీ రాబిన్సన్ అలియాస్ స్టీఫెన్ యాక్స్‌లీ లెన్నాన్. సోషల్ మీడియాలో ఈయన పెట్టిన రెచ్చగొట్టే పోస్టుల ప్రభావం అంతా ఇంతా కాదంటున్నారు. అయితే అల్లర్లకు పాల్పడ్డవారిలో ఎక్కువ మంది సాధారణ బ్రిటన్ పౌరులే. కానీ బ్రిటన్‌కు వలస వచ్చినవారి కారణంగానే అశాంతి ఏర్పడిందని వీరంతా బలంగా



నమ్ముతున్నారు. బ్రిటన్ వ్యాప్తంగా అల్లర్లు తీవ్రం కావడంతో పోలీసులను పెద్ద సంఖ్యలో మొహరించారు. మసీదులకు ఎమర్జెన్సీ సెక్యూరిటీ కల్పించారు.

**జాతివివక్ష వ్యతిరేక నిరసనలు**

వారం రోజుల పాటు బ్రిటన్ వ్యాప్తంగా పార్ నేషనలిస్టు, రైట్‌వింగ్ అని ప్రచారం పొందిన నిరసనకారులు విధ్వంసం సృష్టించిన తర్వాత దీనికి వ్యతిరేకంగా మరోవైపు నుంచి ఆందోళనలు మొదలయ్యాయి. జాతి వివక్ష వ్యతిరేక నిరసనకారులుగా చెప్పే వామపక్ష, రాడికల్, లిబరల్ మూకలు లండన్, తదితర నగరాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. సౌత్‌పోర్ట్ ఘటనకు వ్యతిరిరేకంగా జరిగిన నిరసనలను తిప్పికొట్టేందుకు ఈ ప్రదర్శనలు జరిగాయి. నిరసనకారులు 'స్మాష్ ఫాసిజం అండ్ రేసిజం', 'స్టాప్ ది ఫార్ రైట్' అనే నినాదాలతో ప్లకార్డులను ప్రదర్శించారు. జాత్యహంకారం, ఇస్లామోఫోబియాలకు వ్యతిరేకంగా ఐకమత్యంగా నిలిచిన ప్రజలకు, లండన్‌వాసులకు రక్షణ కల్పించడంలో పగలు, రాత్రి శ్రమిస్తున్న పోలీసులకు ధన్యవాదాలు అని లండన్ మేయర్ సాదిక్ ఖాన్ ఎక్స్‌లో పోస్ట్‌చేశారు. ఈ సాదిక్ పాకిస్తాన్ మూలాలు ఉన్న వ్యక్తి.

**స్టార్మర్ ప్రభుత్వ వైఫల్యం**

అల్లర్ల వెనుక పార్ నేషనలిస్టులు, అతివాద దుండగులు ఉన్నారు అంటూ బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ వ్యాఖ్యానించారు. ఇలాంటి చర్యలకు పాల్పడినందుకు వారు చింతించాల్సి వస్తుందని హెచ్చరించారు. బ్రిటన్ జాతీయ అతివాదానికి మినహాయింపు కాదని తాజా అల్లర్లు రుజువు చేస్తున్నాయి. చివరిసారిగా 2011లో బ్రిటన్‌లో వలసవాద వ్యతిరేక అల్లర్లు పెద్దఎత్తున జరిగాయి. అప్పట్లో అవి లండన్ నగరానికే పరిమితమయ్యాయి. ఈసారి అన్ని పట్టణాలకూ వ్యాపించాయి. ఇటీవలే పగ్గాలు చేపట్టిన లేబర్ పార్టీ ప్రభుత్వానికి ప్రస్తుత అల్లర్లు అగ్నిపరీక్షగా మారాయి. యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ బయటకు వచ్చిన తర్వాత జరిగిన రాజకీయ, ఆర్థిక పరిణామాలు కన్సర్వేటివ్ పార్టీ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తికి దారి తీశాయి. ప్రధాని రుషి సునాక్ పరిస్థితులను అదుపు చేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఫలితంగా ఎన్నికల్లో కన్సర్వేటర్లు దారుణంగా ఓడిపోయారు. ప్రజలు లేబర్ పార్టీకి అధికారం అప్పజెప్పితే ఆరంభంలోనే చేతకానితనాన్ని బయట పెట్టుకున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

**సోషల్ మీడియా పాత్ర ఎంత?**

యూకేలో 'అంతర్యుద్ధం అనివార్యం'– ప్రముఖ వ్యాపారవేత్త, సోషల్ మీడియా 'ఎక్స్' యజమాని ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్య ఇది. సౌత్‌పోర్ట్‌లో చిన్నారులను హత్య చేసింది ముస్లిం శరణార్థి అంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడంతో మత కలహాలకు దారి తీసింది.

బ్రిటన్‌లో స్థానిక, స్థానికేతర వైషమ్యాలు ఏ స్థాయికి చేరాయో ఇది సూచిస్తున్నది. సోషల్ మీడియాను సంఘ విద్రోహశక్తులు ఎలా దుర్వినియోగం చేస్తాయో ఈ ఉదంతం కండ్లకు కట్టింది. బ్రిటన్‌లో సాంకేతిక శాఖ మంత్రి గూగుల్, ఎక్స్, టిక్‌టాక్, మెటా సంస్థల ప్రతినిధులతో సమావేశమై, అసత్య సమాచారం వ్యాపించకుండా ఆపడంలో ఆ సంస్థల బాధ్యతను మరోసారి నొక్కిచెప్పాల్సి వచ్చింది. తమ వాక్ స్వాతంత్ర్యం గురించి గర్వంగా చెప్పుకొనే బ్రిటన్ ఇప్పుడు సామాజిక మాధ్యమాలపై నియంత్రణలు విధించాలని ఆలోచిస్తోంది. అల్లర్ల నేపథ్యంలో అక్కడున్న భారతీయులను మన కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది.

**– క్రాంతి,** సీనియర్ జర్నలిస్ట్



# ధర్మరక్షకుడు దా

**శ్రీమహా విష్ణువు దశావతారాలలో రామకృష్ణులు పరిపూర్ణ అవతారాలని, మరీ ముఖ్యంగా కృష్ణావతారం సహజావతారమని పెద్దలు చెబుతారు. తామరాకుపై నీటిబిందువులా నిస్సంగత్యంగా సాగాలని నిరూపించిన కర్మయోగి శ్రీకృష్ణుడు. ధర్మరక్షణ కోసం రాగద్వేషాలకు అతీతంగా నిందలను కూడా నవ్వుతూ స్వీకరించిన స్థితప్రజ్ఞుడు. 'కృష్ణస్తు భగవాన్ స్వయమ్' అని మహర్షులు కీర్తించారు. 'భగవద్గీత' ఆయన ప్రసాదించిన అద్భుత గ్రంథ రాజం. అదే లేకపోయి ఉంటే ప్రపంచ వాఙ్మయం పరిపూర్ణమయ్యేది కాదని జ్ఞానులు, మేధావులు శ్లాఘించారు. 'భగవద్గీత'లోని ఒక్క శ్లోకాన్నయినా గురు ముఖతః అధ్యయనం చేసిన వారు ధన్యులవుతారని జగద్గురువు శంకర భగవత్పాదులు ఉద్బోధించారు. శ్రీకృష్ణుడు ఆరాధ్యులకు ఆనంద స్వరూపుడు. ఆపన్నులకు జగన్నాథుడు, నమ్మినవారికి కొంగుబంగారం, జ్ఞానులకు వేదవేద్యుడు. ఇష్టులకు జగన్నాటక సూత్రధారి, అనిష్టులకు కపట నాటక సూత్రధారి, పెద్దలు మెచ్చిన విధేయుడు, ఆదర్శ శిష్యుడు. అమాయక తల్లికి అల్లరి తనయుడు. అమిత స్నేహశీలి. చక్రం పడితే కోపధారి. నెగ్గాలన్న పట్టుతో పాటు తగ్గాలన్న విడుపు కలవాడు. ఇలా... ఆయన గుణగుణాలను వేనోళ్ల కొనియాడతారు. లేదంటే వ్యంగ్యోక్తులతో అనుచిత విమర్శలు చేస్తారు. కానీ ఆయన జీవితపథంలోని మర్మాలను గ్రహించి ఆచరించే ప్రయత్నం చేయరు. శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకొని ఆ కోణంలోనిదే ఈ వ్యాసం**

ఆధ్యాత్మికతతో పాటు లౌకిక అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం కృష్ణావతారం ప్రత్యేకత. మానవాళి నడత, నడక, మనుగడను ఆచరణ పూర్వకంగా వివరించాడు. రాజనీతిజ్ఞతను ప్రదర్శించాడు. హరివంశ, భాగవత విష్ణు పురాణాలలో శ్రీకృష్ణ చరితం విపులంగా ఉంది. ఆయన నరుడిగా పుట్టి చరించిన నారాయణుడు. నరులలో ఉత్తముడు, పురుషోత్తముడు. జీవితంలోని వివిధ దశలలోని ఆయన చేష్టలు, చర్యలు, ధర్మరక్షణ యత్నాలు ఇలా... ఏ అంశాన్ని తీసుకున్నా అవి మానవాళికి దిశానిర్దేశం చేసేలానే ఉంటాయి.

***'కృష్ణ కృష్ణేతి కృష్ణేతి యో మాం స్మరతి నిత్యశః***
***జలం హిత్వా యథా పద్మం నరకాదుద్ధరామ్యహమ్'***

(నిత్యం కృష్ణ కృష్ణా! అని జపిస్తే నీటిలో ఉన్నా తడి, బురద అంటని పద్మంలా నరకలోక బాధలు లేకుండా పోతాయట)అని నారసింహ పురాణం పేర్కొంటోంది.

'చిన్ని' కృష్ణుడిగానే నాయకత్వ లక్షణాలు ప్రదర్శించాడు. నాయకుడు అంటే మార్గదర్శనం చేస్తూ, కడకంటూ పోరాడాలి తప్ప పలాయనం చిత్తగించకూడదని సూచించాడు. చేపట్టిన కార్యం ఎంత క్లిష్టమైనదైనా, అందులోని కష్టనిష్ఠురాలను మెలకువతో ఎదుర్కొంటూ మార్గాన్ని సుగమం చేసుకోగల ధీశాలి. చేపట్టిన పనిని తుదివరకు సాధించాలనే గట్టి తలంపు గల వీరవ్రతధారి. మార్గాన్ని కాక గమ్యాన్ని ప్రధానంగా తలచి, ఆ ప్రయత్నంలో ఎన్ని ఇక్కట్లు ఎదురైనా సహించి, ఎన్ని తంత్రాలనైనా ప్రయోగించి అంతిమ విజయమే జీవితోద్దేశ్యంగా కలిగిన ధ్యేయవాది. ఇలాంటి విజయంతో పాటు స్వధర్మ సంరక్షణ సంరక్షతత్పరత్వం ఆయన సొంతం.

'అధర్మం పెరిగి ధర్మం నశించినప్పుడు నన్ను నేనే సృష్టించుకుంటాను' అని భగవానుడు ప్రకటించాడు. అన్యాయాలను, అత్యాచారాలను ప్రతిఘటించి సమాజంలో శాంతిస్థాపన యత్నంలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నాడు. కంస శిశుపాలజరాసంధ తదితర రాజులు స్వైర విహారంతో పొరుగున ఉన్న చిన్నచిన్న రాజులు భీతిల్లుతున్న వేళ ఆయన జోక్యం అనివార్యమైంది. సమాజ నియమాలను మీరి ప్రవర్తించిన వారు జీవించే హక్కు కోల్పోతారని హెచ్చరించాడు. అలాంటి వారిని మాయోపాయంతో దండించినా పాపం లేదనే సిద్ధాంతాన్ని కలియుగంలో ప్రవేశించిన మానవాళికి ప్రసాదించాడు. ఆ స్ఫూర్తితో, పరపీడన పరాయణత్వాన్ని పరిహరించడంలో కృష్ణపథాన్ని అనుసరించి స్వరాజ్యస్థాపన చేయడంలో చంద్రగుప్త, విక్రమాదిత్య, శివాజీ,

శ్రీకృష్ణదేవరాయలు కృతకృత్యులయ్యారు.

శ్రీకృష్ణుడు ప్రకృతి ప్రియుడు. గోవులను కాశాడు. వనమాల, శిఖిపింఛ ధారణ ద్వారా గ్రామాలలో (స్థానికంగా)దొరికే వస్తువులనే ఉపయోగించాలనే సందేశాన్ని ఇచ్చాడు. స్వావలంబనం ముఖ్యమని చాటిచెప్పేలా వెదురుతో మురళి తయారు చేశాడు. ప్రస్తుత 'మేకిన్ ఇండియా' అనే నినాదానికి ఆ నడవడితోనే బీజం పడిందని పోల్చడంలో సంశయించనవసరం లేదేమో! సంపదలతో తులతూగే నందుడి ఇంట పెరిగిన ఆయనకు గోవుల కాపరిగా వెళ్లవలసిన అవసరం లేదు. చిన్నతనం నుంచి అహంభావాన్ని త్యజించి, గోకులంలో పెద్దలను మన్నిస్తూనే తనకంటే ఎంత చిన్నవారితోనైనా ప్రేమగా మెలిగేవాడు, ఆనందంతో మాట్లాడేవాడు. అసురప్రవృత్తిని రూపుమాపి ప్రేమభావన ఏర్పరిచాడు. అధికారకాంక్షకు అతీతుడు. ఎందరెందరో రాజులను అవలీలగా జయించినా తానెన్నడు ఏలిక కావాలని కోరుకోలేదు. అన్నచాటు తమ్మునిగానే ప్రవర్తిల్లాడు. మగధరాజు, మేనమామ కంస వధానంతరం రాజ్యాధిపత్యం స్వీకరించే అవకాశం వచ్చింది. మాతామహుడు ఉగ్రసేనుడు కూడా 'రాజ్యం వీరభోజ్యం అన్నట్లు కంసవధతో వీరధర్మంగా రాజ్యం నీకు సంక్రమించినట్లే. పైగా వయసుపైబడిన నేను రాజ్యభారం వహించలేను. కనుక నీవు సింహాసనాన్ని అధిష్టించు' అన్నప్పుడు, 'నహి రాజ్యేన మే కార్యం/ నాప్యహం నృప కాంక్షితః/ న చాపి రాజ్యలబ్ధేన / మయా కంసో నిపాతితః' (నాకు రాజ్యకాంక్ష ఎన్నడూ లేదు. కంసుడిని




చంపింది రాజ్య లోభంతో కాదు) అని కృష్ణుడు వినయంగా బదులిచ్చాడు. 'అహం స ఏవ గోమధ్యే/ గోపై స్పహ వనే తరః' (నేను గోవుల మధ్య అడవుల్లో తిరిగేందుకు పోతాను) అనీ విన్నవించాడు.

*'అనేన గోసత్యాగ్రహ యజ్ఞేన*
*కృష్ణగోపాల ప్రియతామ్ యిదం నమః'* (గోరక్షణ కోసం కొనసాగే సత్యాగ్రహంతో గోపాలుడు ప్రసన్నుడు అవుతాడు. ఆ యాగం శ్యామ సుందర గోపాలుడి కోసమే కానీ మీ,మాకోసం ఎన్నటికీ కాదు)

పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించాడు. సమస్యలను, సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవాలే తప్ప పలాయనం పరిష్కారం కాదని, ఆత్మవిశ్వాసంతో కడదాక పోరాడాలన్న స్ఫూర్తిని నింపాడు. శిశుప్రాయంలో పూతన జీవితాపహరణం నుంచి ఆయన మహానిర్యాణం వరకు సంఘటనలను పరిశీలిస్తే అనేక కోణాలు ఆవిష్కృతమవుతాయి. కష్టసుఖాలు, సుఖదుఃఖాలు, ఎగుడుదిగుళ్లు జీవితంలో భాగమంటూ, వాటిని ఎలా అధిగమించాలి? ఎలా ఆనందమయం చేసుకోవాలి? అనేవి చాటిచెప్పిన చైతన్యమూర్తి.

'అడుగడుగున గండాలెన్నో ఎదిరీది నిలిచాడు'. ప్రేమను పంచుతూనే ధర్మ సంస్థాపన చేశాడు. శత్రువులను నిష్కంటకం చేసేందుకు అవసరమైతే చతుర్విధ ఉపాయాలను పాటించాలన్నాడు. జరాసంధుడు, తన అల్లుడు కంసుడిని వధించిన కృష్ణుడిపై ప్రతీకారంతో మధురపై పదహారుసార్లు దండయాత్ర చేశాడు. ఆ సమయంలో తన సుఖం, పట్టుదల (వ్యక్తిగత స్వార్థం) కంటే ప్రజాహితం మిన్న అని భావించిన కృష్ణుడు వ్యూహం మార్చాడు. నెగ్గాలనే సంకల్పం ఉన్నా కాలం కలసి రానప్పుడు తగ్గడంలో చిన్నతనం లేదని, బుద్ధిబలంతో సమస్యను చక్కబెట్టవచ్చని నిరూపించాడు. తనపై ప్రత్యర్థుల వ్యక్తిగత కక్ష, ప్రజలకు శాపం కాకూడదనే భావనతో (నేటి కొందరు నాయకులు తెలుసుకోవలసిన సత్యం) జరాసంధుని దాడులకు విరామం ఇచ్చేలా సముద్రం మధ్యలో 12 యోజనాల పొడవు, వెడల్పు గల నగరాన్ని (ద్వారక) నిర్మించుకొని కథ నడిపాడు.

ఇంతటి సామాజిక స్పృహ, రాజకీయ చతురత కలిగిన ఆయన ఆధునికుల అనుచిత వ్యాఖ్యలు, విమర్శల నుంచి తప్పించుకోలేకపోతున్నాడు. 'భాగవతమందు శ్రీకృష్ణుడు వ్యభిచారిగా వర్ణింపబడియున్నాడు. దీనివలన శ్రీకృష్ణుని నిర్మల చరిత్రకొక కళంకము కలిగినది. దీని మూలముననే వ్యభిచారమునకు శ్రీకృష్ణుడొక సామెతగా లోకులచే వ్యవహరింపబడుచున్నాడు. శ్రీకృష్ణుడు నిందల బాలయినట్లు ఏ యితర మహాపురుషుడును గాలేదన వచ్చును. ఇట్లు నిందించినవారు వారి పరమభక్తులే. భక్తి కొలకై యా పరమపురుషునిచే చిన్నతనమున దొంగతనం చేయించినారు. వయసున వ్యభిచారము చేయించినారు. ఇట్లు వర్ణించుట చేత జనసామాన్యంలో శ్రీకృష్ణుని గౌరవము తగ్గుచు వచ్చెను' అని తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి తమ 'హిందువుల పండుగలు' గ్రంథంలో ఆవేదన వ్యక్తం చేశారు. కలిలో, అందునా ఆధునిక కాలంలో కారాగారానికి పర్యాయపదంగా మారిన 'శ్రీకృష్ణ జన్మస్థానం' అనడం కూడా ఆధ్యాత్మికవేత్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నేరస్థులను శిక్షించే చోటును అలా వ్యవహరిస్తుంటారు. కానీ ఆయన ఏ నేరమో చేసి కారాగారానికి వెళ్లలేదు. మేనమామ కంసుడు తనకు ప్రాణభయంతో సోదరి బావమరిది దేవకీ వసుదేవులను ఖైదు చేయడంతో అక్కడ జన్మించడం ఆయన నేరం కాదని, అది అవతార పరమార్థమని పెద్దలు చెబుతారు.

విదేశీయులు కృష్ణభక్తితో పరవశులు అవుతుండగా, స్వదేశీయులు కొందరు ఆయన పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. స్వామి వివేకానంద ఒకసారి అమెరికాలో కృష్ణలీలల్లోని ఆధ్యాత్మికతను వివరించిన తీరుకు ముచ్చటపడిన ఒక సంపన్నురాలు తన ఆస్తులను త్యజించి ఓ ద్వీపానికి తరలిపోయి ఏకాంతవాసంలో కృష్ణుడి ధ్యానంలో నిమగ్నమైంది. భారతదేశంలోని కొందరు అవగాహన శూన్యులు, 'పదహారు వేలమంది భార్యలను పోషించిన 'అపరనిజామ్' అని శ్రీకృష్ణుడిని వ్యాఖ్యానించారు. నరకుడు చెరలో వేసిన ఆ రాజకన్యల యుక్తయవస్సంతా అక్కడే గడిచిపోగా, తమను కన్నవారు కానీ, ఇతరులు కానీ ఆదరించరని మొరపెట్టుకోగా, వారికి తాను భర్తగా (భరించేవాడు... లేదా బాధ్యత వహించేవాడు) ఉండి సమాజంలో గౌరవ ప్రతిపత్తులు కల్పించాడు. దేశ విభజన తరువాత ఎందరో విగతభర్తృకలై అవమానాలు పొందడం, వారి పట్ల సమాజం వ్యవహరించిన తీరు ఆధునిక చరిత్ర పుటల్లో నిక్షిప్తమై ఉంది.

*'వస్తూని కోటి శస్సంతు పావనాని మహీతలే!*
*నతాని తత్తులాం యాంతి కృష్ణ నామాను కీర్తనే!!'*
(ధరాతలంపై గల పవిత్ర వస్తువులన్నింటినీ కలిపినా శ్రీకృష్ణనామ సంకీర్తనకు సాటిరావు) అని శ్రీకూర్మ పురాణం చెబుతోంది.

*'కృష్ణం కమలపత్రాక్షం పుణ్యశ్రవణ కీర్తనమ్*
*వాసుదేవం జగద్యోనిం నౌమి నారాయణమ్ హరిమ్'*



**డా।। ఆరవల్లి జగన్నాథస్వామి**
సీనియర్ జర్నలిస్ట్



వందమంది మాతృమూర్తులు. వారి నిరంతర సేవానిరతికి హృదయపూర్వక అభివందనం. ఏడు దశాబ్దాల ప్రాయం దాటినా నవయౌవన సాహితీ కళాస్ఫూర్తితో దీప్తిమంతులుగా వెలుగొందుతున్నవారూ ఎందరో ఉన్నారు. ఆ షష్టిపూర్తి మహిళామణులను భాగ్యనగరంలోని తెలుగు విశ్వవిద్యాలయం ఘనంగా సత్కరించడం మనందరికీ తెలుసు. ఆమె పేరు ఆర్. శోభాదేవి. ప్రఖ్యాత కళావేత్త రేవూరి అనంత పద్మనాభరావు అర్ధాంగి. ప్రత్యేకించి ఆధ్యాత్మిక తత్వశీలి.

పరమ ముగ్ధభావంలా, మధువసంత హాసంలా
శశిముఖ లావణ్యాంచిత శరద్గగన రాగిణిలా
స్వచ్ఛ జీవనాన్విత ప్రశస్త శైల వాహినీ వనిలా
నిత్యమూ సారస్వత సమర్చన సాగిస్తున్న ఆమె 'పదకవితా పితామహ అన్న మార్యుని జీవనం – సాహితీ ప్రస్థానం' పేరిట పుస్తకం రచించారు. ఆ గ్రంథాన్నే ప్రపంచ తెలుగు మహాసభల వేళ ఆవిష్కరించారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం, కృష్ణాజిల్లా సంఘంతోపాటు విజయవాడలోని కాకరపర్తి భావనారాయణ కళాశాల సంయుక్త ఆధ్వర్యాన మళ్లీ మహాసభలు ఏర్పాటవుతున్నాయి. వచ్చే డిసెంబరులో. ప్రపంచ తెలుగు మహాసభల (1975) స్వర్ణోత్సవ శుభ సందర్భం ఇది. అప్పటి, ఇప్పటి మహోత్సవాల నేపథ్యంలో...

# పదకవితారాధక

**సుధామధుర సుమసుగంధ**
**శాంతి వసుధ కరుణకిరణ**
**సుఫల శోభకు నమస్సుమాలందిస్తూ –**

అన్నమయ్య భక్తి సామ్రాజ్యం, సంకీర్తనా సౌరభం, సంభవామి యుగే యుగే... ఈ మూడు పరిశోధన కావ్యాల అక్షర అనుశీలనం ఇది.

తెలుగునాట నెల్లూరు ప్రాంతం కారేడులో పుట్టిన శోభాదేవి పాఠశాల, కళాశాల విద్యాభ్యాసం విజయవాడ, రాజమహేంద్రవరం నగరాలతోపాటు బిట్రగుంట, కావలి, నెల్లూరు ప్రాంతాల్లో కొన సాగింది. సాహిత్యంతోపాటే సంగీత అనురక్తికి మూలవేదిక తిరుపతి.

భక్తి కేంద్రం తిరుపతిలోని అన్నమాచార్య కళా క్షేత్రంలో సంకీర్తనలను అభ్యసించి నిపుణత సాధిం చారు. గ్రంథస్థం చేసిన ఆ రచనలు, విశ్లేషణ లన్నిం టినీ 'సౌరభం' శీర్షికన ప్రచురించింది తిరుమల – తిరుపతి దేవస్థానం. తొలి ముద్రణ జరిగి ఇప్పటికి పుష్కరం. ఇందులో అన్నమార్య పదసంపద నుంచి బ్రహోత్సవ వాహనాదుల విశదీకరణ వరకు ఎన్నెన్నో అంశాలున్నాయి. కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సౌజన్య ఫలితంగా తాను చేసిన పరిశోధనకు ఇది ప్రచురణ రూపమన్నారు 'నివేదన'లో. కృతజ్ఞతాంజలి సమర్పించారు.

అప్పట్లో తితిదే దృశ్య శ్రవణ ప్రాజెక్టు సహస్రాధిక కీర్తనలను ఆడియో సీడీలుగా తయారుచేయించింది. వాటినే పుస్తకరూపానికి తెచ్చింది దేవస్థానం. ఆ పాటలనే ప్రణాళికగా స్వీకరించిన రచయిత్రి, సంగీతవేత్త తన సృజననీ జోడించి పేరొందారు.

వాగ్గేయకార ప్రసిద్ధుడి రచనలు వేలల్లోనే. అన్నింటిలోనూ ఎంతెంతో వైవిధ్యం. తల్లిజోల, వైరాగ్యగీతికలు, సామాజిక కోణ ఆవిష్కరణలు, ఇంకా ఎన్నెన్నో. సంస్కృతాంధ్ర కీర్తనలు, ఊహా చిత్రణలు, సంగీత సాహితీ సమ ప్రాధాన్యతలు.

***అనిశము దలచరో అహోబలం***
***అనంత ఫలదం–అనడంలో నరసింహ కీర్తనం.***
***దేవదేవం భజే దివ్యప్రభావం***
***రావణాసురవైరి రఘుపుంగవం*** – అని పలకడంలో రామసంకీర్తనం. రామచంద్రుని సేవలో తరించిన హనుమంతుడే వేంకటేశ్వర సేవా అగ్ర గణ్యుడయ్యాడు. శరణు కపీశ్వర శరణం బనిలజ / సరవినెంచ నీసరి ఇకలేరే'– ఇందులో ఆంజనేయ శక్తి స్తుతి.

సువ్వి సువ్వి సువ్వాలమ్మా
నవ్వుచు దేవకినందుని గనియె – అన్నపుడు శ్రీకృష్ణ జనని విశేషం.

అటు తర్వాత దశావతార వర్ణనం.

డోలాయాంచల డోలాయం/ హరే డోలాయం (ఇందులో అవతార ప్రత్యేకతల విపులీకరణం)

ఓహో ఎంతటి వాడే వొద్దనున్నవాడే హరి

సాహసపు గుణముల చతురుడా ఇతడు (దీనిలో మూడుపదాలు–జలధి, ధరణి, కొండ స్మరణ లున్నాయి)

ఇటువంటి విశిష్టతలెన్నింటినో శోభాదేవి వ్యాసరచనలు వివరించాయి.

ఆరు చరణాల కీర్తన 'తందనాన ఆహి తంద నానా పురే / తందనాన భళా తందనానా (బ్రహ్మమే శాశ్వతమనడం).

జీవుని వేదనను వ్యక్తీకరించే కీర్తనం 'ఎన్నడు విజ్ఞానమిక నాకు / విన్నపమిదే శ్రీ వెంకటనాథా'

ఇన్నియు జదువనేల యింతా వెదుకనేల / కన్ను తెరచు టొకటి, కన్నుమూయ టొకటి (తత్వ విజ్ఞత)

**ఇతరములన్నియు నడుమంత్రములే**
**యెంచి చూచినను యింతానూ**

***హితవగు బంధుగు డీశ్వరుడొకడే***

***ఇతని మరువకుమీ జీవాత్మా!*** (పరమాత్ముడే ఆత్మబంధువు) అనడం. మిగిలినవన్నీ నడమంత్రాలని హెచ్చరించడం అన్నమాట).

అన్నమాచార్య హృదయాన్ని ఆవిష్కరించే....

1. శ్రీమన్నారాయణ నీ శ్రీపాదమే శరణు

2. వందే వాసుదవం శ్రీపతిం / బృందారకాధీశ వందిత పదాబ్జం (సంస్కృత పద సమన్విత వర్ణన)

3. గురువు ఎవరు? దైవసమం. ***'గతులన్ని ఖిలమైన కలియుగమందును / గతి యితడే చూపె ఘన గురు దైవము'***

ఇటువంటి మరెన్నింటినో తేటతెల్లం చేశారు శోభాదేవి.

ఆమె బ్రహోత్సవాల తరుణంలో బృంద సభ్యురాలిగా కోలాటాలు వేశారు. ఆస్థాన మండపంలో గీతాపారాయణం చేశారు.

తనది ఆధ్యాత్మిక విలసిత చిత్తవృత్తి. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశునికి పదకవితార్చన చేసిన అన్నమయ్యలోని ఆధ్యాత్మిక, సామాజిక భావజాలాన్ని విస్తృతీకరించారు తన కావ్యాల్లో.

ఐశ్వర్యం, వీరత్వం, యశస్సు

శ్రియం, జ్ఞానం, వైరాగ్యం (ఈ ఆరుగుణాల

# శోభ

సమన్వితుడే పరమాత్ముడు అని కథన రూపంగా వివరించారు.

'కలౌ వేంకట నాయకః' అనేది ఉపశీర్షిక అయితే, ఆమె రచించిన పుస్తక మూల శీర్షిక 'సంభవామి యుగే యుగే.'

అన్నమాచార్యుని కథా ప్రారంభాన్ని ఉదాహరిస్తూ–

'శ్రీ వైకుంఠ విరక్తాయ స్వామి పుష్కరిణీ తటే

రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్' అని విశదపరచారు.


'శుభలేఖ' అంటూ మరొక విశేషాంశాన్ని ఉటంకించారు శోభాదేవి తన పుస్తకంలో. ఆ వివరం ఇదీ:


'అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకులైన శ్రీనివాస ప్రభువులవారికి ఆకాశరాజు ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధి అగునట్లు దీవించి పంపు లేఖ.

వ్యాససుతుడు చెప్పగ

మా కుమార్తెయైన పద్మావతిని మీకు ఇచ్చి వివాహము చేయుటకు నిశ్చయించినాము. చిత్తగించవలెను.'

దీనికి ప్రత్యుత్తరం అందింది. అది శ్రీనివాసుడు




మొగలిరేకులపైన కొనగీట రాసింది.

***'మహారాజ రాజశ్రీ ఆకాశరాజుగారికి! శేషాద్రి నాథుడు అభివాదములు చేసి వ్రాయు విన్నపములు. ఉభయకుశలోపరి.***

***వైశాఖమాసమున శుక్ల దశమినాటి శుక్రవారంబు***

***శుభ ముహూర్తమునకు మా బంధుమిత్రులతో తరలివచ్చెదము.'***

అనంతరం మాంగల్యధారణ అయింది. పద్మావతీ శ్రీనివాసులు ఎంతో సందడీ సంరంభాల నడుమ తలంబ్రాలు పోసుకుంటున్న ఘట్టం. 'పిడికిట తలంబ్రాల పెండ్లి కూతురు' మనకు విదితమే. ఈ సన్నివేశమంతటినీ హృద్యంగా వివరించారమె.

ఆనాటి దృశ్యమంతటినీ అక్షరబద్ధం చేయగలిగిన కవయిత్రి. ఇలా తనదైన రీతిన రచనా వ్యాసంగం కొనసాగిస్తూ వచ్చిన, వస్తున్న శోభాదేవికి ఇదివరలోనే కేంద్ర ప్రభుత్వ సీనియర్ ఫెలోషిప్... సాంస్కృతిక శాఖ నుంచి లభించింది. అన్నమయ్య 600వ జయంతి మహోత్సవాల సందర్భంలో సప్తగిరి సంకీర్తనా గోష్ఠి ఏర్పాటైంది. అందులో తాను గాన సత్కారం పొందడం విశేషం.

తెలుగునాట ప్రత్యేక వేదికపైన అలనాడు తమిళనాడు గవర్నరు నుంచి సన్మానం అందుకున్నదీ మధుర జ్ఞాపకం. అలా ఉత్తమ రచయిత్రి పురస్కృతిని స్వీకరించారు శోభాదేవి.

అన్నమార్యుని గురించిన అనేకానేక రచనల పర్యవసానంగా ఆమెకు జాతీయ స్థాయిన గుర్తింపు. తులనాత్మక పరిశీలన చేసిన వైనాన్ని సంస్థలనేకం సభాముఖంగా ప్రశంసించాయి.


భర్త పద్మనాభరావు రచనల్లో చాలా మటుకు 'ఆయన చెప్తుంటే ఆమె రాసినవే.'

ఇప్పటికి దరిదాపు పాతికేళ్ల క్రితం ఆయన అనువాద రచనల్లో ఒకటి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకుంది. ముల్క్‌రాజ్ ఆనంద్ రచించిన 'మార్నింగ్ ఫేస్'కి ఆ అనువాదాన్ని భర్త చెప్తుండగా భార్య రాయడం ఎంతైనా విశేషాంశం!

మరొక ప్రత్యేకతనీ ఇక్కడ మనం ప్రస్తావించుకోవాలి. అమితాఘోష్ రాసిన 'షాడులైన్స్'ను పద్మనాభరావు అనువదించినపుడు... సరైన తెలుగుపదం స్ఫురించనపుడు, వెంటనే అందించిన ఘనతా శోభాదేవికే దక్కుతుంది. అదే పుస్తకానికి తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం ప్రకటించడం అసలైన మెరుపు!

***సహజ మధుర సౌమ్యామతీ!***
***సమరసత భావ జయగీతీ!***
***జగదద్భుత జీవయాత్ర***
***సాగింపగ రావమ్మా!***

'మా ఆనందమయ వైవాహిక జీవితంలో ఆమె ఒక వెలుగు దివ్వె. నాకు నిరంతర స్క్రైబ్' అంటారాయన. ఇంతకుమించిన ప్రశంస ఏ రచయిత్రికైనా ఇంకొకటి ఏముంటుంది?



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్



# అసత్యాల సాలెగూడు

భారతీయ సమాజాన్ని కులాల వారీగా విభజించి బలహీనం చేయాలన్న కుట్ర విఫలమై, తిరిగి నరేంద్ర మోదీ అధికారాన్ని చేపట్టిన తర్వాత, ఇక్కడి ప్రతిపక్ష నాయకులు విదేశీ దుష్టశక్తులతో కలసి భారత్‌ను ఆర్థికంగా కుదేలు చేయాలనే యత్నం మరొక్కసారి చేసినప్పుడు, వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారు. గత ఏడాది గౌతమ్ అదానీ లక్ష్యంగా హిండెన్‌బర్గ్ సంస్థ వారి వ్యాపారాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ నివేదికను విడుదల చేసి షేర్ మార్కెట్‌ను కుదేలు చేయడం గుర్తుండే ఉంటుంది. అప్పుడు, ఆ నివేదిక అదానీ సంస్థలకు, అందులో షేర్లు కొనుగోలు చేసిన సామాన్య ప్రజలనేకమందికి భారీ ఆర్థిక నష్టాన్ని కలిగించింది. ఈ క్రమంలో, అదే సాహసంతో మరొకసారి యత్నం చేసి హిండెన్‌బర్గ్ భారతీయుల చేతి వాటాన్ని రుచి చూసింది.

ఈసారి నేరుగా అదానీపై ఆరోపణలు, దాడి చేయకుండా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) చెయిర్ పర్సన్ మాధవీ బుచ్‌ను లక్ష్యంగా చేసుకొని బురదజల్లే ప్రయత్నం హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ చేసింది. గత ఏడాది భారతీయ స్టాక్ మార్కెట్లలో బీభత్సాన్ని సృష్టించిన ఈ సంస్థ, ఈసారి మార్కెట్ సమగ్రతను కాపాడేందుకు, క్రమబద్ధీకరించేందుకు నియమించిన సెబీ చెయిర్‌పర్సన్‌పై తన అస్త్రాలను సంధిస్తోంది. అమెరికాకు చెందిన ఈ షార్ట్ సెల్లర్ సంస్థ (ధరలు తగ్గుతాయన్నప్పుడు షేర్లు కొన్నింటిని అరువు తీసుకొని, అమ్మి, ధరలు తగ్గినప్పుడు తిరిగి కొనుగోలు చేసి, ధరలు కోలుకున్నాక వాటిని అమ్ముకొని లాభం పొందేందుకు వాటిని వాటి యజమానులకు తిరిగి ఇవ్వడం) విడుదల చేసిన నివేదిక అర్ధసత్యాలు, అనుచిత వ్యాఖ్యలతో నిండి ఉంది. వీటితోనే భారత్‌లో అత్యున్నత ఆర్థిక కాపలాదారు అయిన సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీసే యత్నం బొక్కాబోర్లా పడింది.

**వ్యూహాత్మకంగా దెబ్బతీసే కుయత్నం**

ఆగస్టు 10వ తేదీన హిండెన్‌బర్గ్ విస్ఫోటనాన్ని సృష్టించగలదనుకుని తన నివేదికను విడుదల చేసింది. ఇందులో గౌతమ్ అదానీ సోదరుడైన వినోద్ అదానీకి ముడిపడి ఉన్నట్టుగా ఆఫ్‌షోర్ నిధులతో సంబంధమున్నట్టు ఒక కల్పిత అవినీతిలో మాధవీ బుచ్‌ను ఇరికించే ప్రయత్నం చేసింది. మాధవీ, ఆమె భర్త ధవళ్ బుచ్‌కు ఆ అనుమానాస్పదమైన ఆఫ్‌షోర్ సంస్థల్లో వాటాలు ఉన్నట్టు హిండెన్‌బర్గ్ ఆరోపించింది. అయితే, నిజంగా సెబీ అధిపతి రాజీపడ్డారని సూచించేందుకు ఇది ఒక బలహీన ఆధారం మాత్రమే.

అదానీ కుటుంబానికి లంకె ఉన్నట్టుగా హిండెన్‌బర్గ్ చెబుతున్న 'గ్లోబల్ డైనమిక్ ఆపర్చునిటీస్ ఫండ్,' 'ఐపిఇ ప్లస్ ఫండ్'లలో బుచ్‌లకు పెట్టుబడులు ఉన్నాయనే అంశంపైనే నివేదిక సాక్ష్యాలు ఆధారపడి ఉన్నాయి. కాగా, 2018లో ధవల్ బుచ్ 900,000 డాలర్లను వెనక్కి తీసుకున్నారని నొక్కి చెప్పడం ద్వారా, ఆదానీ గ్రూప్‌ను క్రమబద్ధీకరించడంలో ఈ లావాదేవీలు మాధవీ బుచ్ సామర్థ్యాన్ని బలహీన పరుస్తాయనే ట్విస్టు ఇచ్చే ప్రయత్నం చేసింది. కానీ వాస్తవాలు మరొక రకంగా ఉన్నాయి.

హిండెన్‌బర్గ్ ఆరోపణలు అయితే చేసింది కానీ, తాను కాలక్రమాన్ని విస్మరిస్తున్నాననే విషయాన్ని గుర్తించలేదు. నిజానికి, సెబీలో బాధ్యతలు స్వీకరించకముందే, ఈ నిధులలో మాధవి జోక్యం ముగిసిపోయింది. ఇంకా చెప్పాలంటే, ఆదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ తొలిసారి దాడి చేయడానికి ఐదేళ్ల ముందే ఆమె భర్త ఆ నిధులను తిరిగి తీసుకున్నారు. పైగా, ఇది నష్టాన్ని కలిగించిన పెట్టుబడే తప్ప ఏదో ఒరిగి ఒళ్లోపడుతుందన్న వ్యామోహపడేది కాదు. కానీ, సత్యం కన్నా కథనం అల్లడం పట్లే హిండెన్‌బర్గ్ ఆసక్తి ప్రదర్శించినట్టు కనిపిస్తోంది.

**అసత్యాల మాయాజాలం**

ఆఫ్‌షోర్ నిధుల గురించిన నిరాధార వాదనలు చాలవనట్టుగా, క్లిష్టమైన ఆ వ్యవహారం లోతుల్లోకి వెళ్లి, మాధవీ బుచ్, వినోద్ అదానీ, ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్ అనిల్ అహూజాలు కుమ్మక్కయ్యారనే విస్తృతమైన కథనాన్ని అల్లింది. ఐపిఇ ప్లస్ ఫండ్‌ను నిర్వహించిన అహూజా, గతంలో ఎప్పుడో అదానీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా వ్యవహరించాడు కనుక ఏదో ఒక సంబంధం ఉండే ఉంటుందన్నదే అందుకు అది ఉపయోగించిన తర్కం.

కానీ, సత్యాన్ని కొద్దిగా తెలుసుకొనే ప్రయత్నం చేస్తే, అహూజా తన విశిష్టమైన కెరీర్‌లో లెక్కనేనన్ని ప్రతిష్ఠాత్మక కంపెనీల బోర్డులలో పదవులను నిర్వహించిన సంగతి తెలిసి ఉండేది. అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో స్వల్పంకాలం పాటు అతడు నిర్వహించిన పదవే, బుచ్‌లతో చట్టవిరుద్ధమైన సంబంధానికి రుజువని మనం నమ్మాలన్నది హిండెన్‌బర్గ్ అభిప్రాయం. కానీ, వాస్తవం అత్యంత సాధారణమైంది– అదానీ సామ్రాజ్యంతో ఎటువంటి ప్రత్యక్ష సంబంధాలూ లేకుండా, అహూజా నిర్వహించిన నిధికి బుచ్ కేవలం వినియోగదారుడు మాత్రమే.

**హిండెన్‌బర్గ్ దుస్సాహసం ఒక అజెండానా?**

తన వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నంలో భాగంగా నిరాధారమైన ఆరోపణలు చేసేందుకు హిండెన్‌బర్గ్ గడ్డిపోచలను పట్టుకు వేళ్లాడుతోందన్నది స్పష్టం. అది ఆశించిన స్థాయిలో అదానీ గ్రూప్‌పై చేసిన హైప్రొఫైల్ దాడి ఫలి తాలను ఇవ్వకపోవడంతో, తడబడుతున్న తన ఇతివృత్తాన్ని సజీవంగా నిలబెట్టేం దుకు ఈ షార్ట్ సెల్లర్ సంస్థ సెబీని లక్ష్యంగా చేసుకుంది. కానీ ఈసారి కూడా గౌరవప్రదమైన వారినే లక్ష్యంగా చేసుకున్నారు. వారి వాదనలు అత్యంత దుర్బలంగా ఉండడంతో, వారు ఊహించిన స్థాయిలో ప్రజల దృష్టిని ఆకర్షించలేక పోతున్నాయి.



# 'హిండెన్‌బర్గ్'

అంతేకాదు, సెబీలో తన పదవీకాలానికి ముందు బుచ్ తన పెట్టుబడులను వైవిధ్యపరచడాన్ని విమర్శించడం, ఆమె భారతీయ మ్యూచ్యువల్ ఫండ్స్‌కు కట్టుబడి ఉండటంలో విఫలం కావడాన్ని పట్టిచూపడమంటే, ఆమె విధి నిర్వహణలో తప్పిదం జరిగినట్టుగా సూచించే యత్నం. అంతేకాదు, ఆమె ఆఫ్‌షోర్ పెట్టుబడులన్నీ చట్టబద్ధమైనవేనని, ప్రస్తుతర ఆమె పోషిస్తున్న పాత్రకు ఎటువంటివి సంబంధం లేనివన్న వాస్తవాలు తెలిసి కూడా దుష్ప్రచారం చేసింది.

**తుస్సుమన్న నివేదిక**

తాను చేస్తున్న సత్యవిరుద్ధ వాదనలను సమర్థించుకోవడంలో విఫలమవుతూనే, సంచలనాత్మకంగా దూసుకురావడం, అనుమాన బీజాలు వేయడం ద్వారా తన నిజమైన రంగులను హిండెన్ బర్గ్ రీసెర్చ్ బయటపెట్టుకుంది. భారత ఆర్థిక రెగ్యులేటరీ వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పలచన చేసేందుకు చేసిన ఒక మొండి ప్రయత్నమే మాధవీ బుచ్‌పై దాడి. దుష్ప్రచారం చేయాలన్న హడావిడిలో, హిండెన్‌బర్గ్ అతి చేసింది. దాని వాదనలలోని లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

అంతా సర్దుకుంటున్న నేపథ్యంలో ఈ తాజా దాడి, ఎక్కడా కళంకం లేని చోట ఒకదానిని సృష్టించాలన్న తపనతో సరైన ఆలోచన లేకుండా, పేలవంగా అమలయిందన్నది సుస్పష్టం. మాధవీ బుచ్ నైతికతకు ఎటువంటి భంగం కలుగలేదు, 'నిజాయతీతో కూడిన నియంత్రణ' అన్న సెబీ నిబద్ధత స్థిరంగా నిలిచింది. ఇక్కడ అసలు కథ ప్రయోజనాల సంఘర్షణకు సంబంధించింది కాదు, ఇది ఒక షార్ట్ సెల్లర్ తను ఏదో ఒకరకంగా అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు సత్యంతో ఓడిపోయినావేగంగా ఎత్తులు వేస్తూ చేస్తున్న యత్నం. ఈ క్రమంలో సత్యంతో ఓడిపోయినా దానికి లెక్కలేదు.

**రాహుల్ గాంధీ ఆసక్తి**

హిండెన్‌బర్గ్ తన నివేదికను విడుదల చేయబోతోందన్న సంకేతాలు అందగానే పెట్టుబడిదారులను స్టాక్ మార్కెట్‌కు దూరంగా ఉండమంటూ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్వయంగా చెబుతున్న వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేశారు. చిత్రం ఏమిటంటే, గత ఐదు నెలల్లో రూ. 46.5 లక్షల లాభాలను ఆర్జించిన రాహుల్, ఇతరులు పెట్టుబడులు పెట్టకుండా నిలువరించాలనుకోవడం. కేవలం హిండెన్‌బర్గ్ నివేదిక ఆధారంగా భారతీయ ఆర్థిక మార్కెట్ల స్థిరత్వంపై సందేహాలు రేకెత్తించడమనేది విదేశీ సంస్థలకు లాభాలను చేకూర్చేందుకే అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవాన్ని తెలుసుకున్న ప్రజలు స్టాక్ మార్కెట్ పట్ల విశ్వాసాన్ని ప్రకటించి, గతంలోలా కుప్పకూలకుండా చూసి హిండెన్‌బర్గ్‌కు, రాహుల్‌కు ఏకకాలంలో బుద్ధి చెప్పారు.

మూడవసారి ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత భారతీయ స్టాక్ మార్కెట్లు గణనీయమైన వృద్ధిని చూపడమే కాక, సెన్సెక్స్, నిఫ్టీ వంటి ప్రామాణిక సూచీలు రికార్డులను బద్దలు చేస్తున్నాయి. ఇంత ఆరోగ్యకరమైన పనితీరును మార్కెట్లు ప్రదర్శిస్తున్నప్పటికీ, సెబీ చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలంటూ డిమాండ్ చేయడం ద్వారా రాహుల్ తన రంగు బయటపెట్టుకున్నారు. "భారతీయ స్టాక్ మార్కెట్లలో గణనీయమైన ముప్పు దాగి ఉందని, స్టాక్ మార్కెట్‌ను పాలించే వ్యవస్థలు రాజీపడడమే అందుకు కారణమనే విషయాన్ని బాధ్యత కలిగిన ప్రతిపక్ష నాయకుడిగా మీ ముందుకు తేవడం నా విధి" అంటూ రాహుల్ పేర్కొన్నాడు. కాగా, పెట్టుబడిదారులు ఈ మాటలను లెక్క చేయకపోవడంతో నివేదిక ప్రభావం మార్కెట్లపై కనిపించకపోగా అతడి ఉద్దేశాలు, మాటలపై అనుమానాలు తలెత్తాయి. తమ నాయకుడి మాటలకు మద్దతుగా కాంగ్రెస్ కూడా సెబీ అధిపతి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడమే కాక, సీబీఐ ప్రత్యేక దర్యాప్తు బృందానికి అదానీపై దర్యాప్తును బదిలీ చేయాలని డిమాండ్ చేసింది. కాగా, వీరంతా కూడా సెబీకి ఈ దర్యాప్తు చేసే సామర్థ్యం ఉంది కనుక సిట్ వంటివి నియమించాల్సిన అవసరం లేదని ఆరునెలల కిందట సుప్రీంకోర్టు తోసిపుచ్చిన విషయాన్ని మర్చిపోయినట్టుగా నటిస్తున్నారు.

**విరుచుకుపడ్డ బీజేపీ ఎంపీ సుధాన్షు త్రివేది**

రుజువు చేయలేని, నిరాధారమైన ఆరోపణలను హిండెన్‌బర్గ్ చేయడం, దానికి కాంగ్రెస్ వంద పాడడంపై బీజేపీ ఎంపీ సుధాన్షు త్రివేదీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'పై పోస్ట్ చేసిన ఒక వీడియోలో విరుచుకుపడ్డారు. భారతీయ ఆర్థిక వ్యవస్థను అస్థిరపరిచేందుకు కంకణం కట్టుకున్న విదేశీ సంస్థల అభిప్రాయాలతో కాంగ్రెస్ అభిప్రాయాలు సమలేఖనం కావడాన్ని ఆయన ప్రశ్నించారు. అటువంటి విదేశీ నివేదికల విడుదలకు సంబంధించి ఒక నిర్దిష్టమైన సరళి కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. అది బీబీసీ డాక్యుమెంటరీ అయినా, హిండెన్‌బర్గ్ నివేదిక అయినా... విదేశీ నివేదికలన్నీ కూడా పార్లమెంటు సెషన్ల సమయంలో ఎలా వచ్చాయో ఆయన సోదాహరణంగా పట్టి చూపారు.

అంతేకాదు, ప్రతిపక్షాల ప్రవర్తన వీటి గురించి వీరికి ముందస్తుగానే తెలుసేమోనన్న అనుమానాలు తలెత్తేలా ఉంటోందని త్రివేది అన్నారు. ఆర్థిక అస్థిరతను, అరాచకతను వ్యాప్తి చేసేందుకు కాంగ్రెస్, ప్రతిపక్షాలు ఎప్పుడూ ఎందుకు యత్నిస్తాయంటూ సందేహాలు వ్యక్తం చేశారు. అది ప్రభుత్వ కంపెనీ అయినా ప్రైవేటుది అయినా, ప్రజల్లో అయోమయాన్ని సృష్టించడమే వారు లక్ష్యంగా పెట్టుకుంటారని విమర్శించారు. గత ఏడాది ఎల్ఐసి, హెచ్ఎఎల్, ఎస్‌బిఐ అన్నీ నష్టాల్లో నడుస్తున్నాయని వారు ఆరోపించారని, కానీ ఈ ఏడాది ముందెన్నడూ లేని విధంగా ఎల్‌ఐసీ రూ.17 వేల కోట్ల లాభాలను నమోదు చేయగా, ఎస్‌బిఐ రూ. 21 కోట్లు, హెచ్ఎఎల్ కోట్లు లాభాలను ఆర్జించడంతో ఇప్పుడు సెబీనే లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. గత ముప్పై, నలభై ఏళ్లుగా కాంగ్రెస్ ఎప్పుడూ విదేశీ సంస్థలకు అండగా ఎందుకు నిలబడింది? యూనియన్ కార్బైడ్ వెనుక ఎందుకు నిలబడ్డది? అంటూ విరుచుకుపడ్డారు.

గత ఏడాది డిసెంబర్ మాసంలో షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ కార్పొరేట్ మోసం అంటూ గౌతమ్ అదానీపై చేసిన ఆరోపణలు హేతుబద్ధమైనవి కానివని, అనుచితమైనవని యుఎస్ ప్రభుత్వం స్వయంగా పేర్కొనడం గమనార్హం. దీనితో, అదానీ గ్రూపు కంపెనీల స్టాక్‌లు ఒక్కసారిగా బలపుంజుకున్న విషయం తెలిసిందే. ఈసారి పెట్టుబడిదారులు, ప్రజలు కూడా మూర్ఖుల్లా హిండెన్‌బర్గ్‌ను, ప్రతిపక్ష నాయకుడినీ నమ్మకుండా తమ బుర్రను మాత్రమే వాడడంతో, అటు ఆర్థిక వ్యవస్థలనే కాదు, తమను తాము కూడా కాపాడుకున్నారు. ఎవరు ఎన్ని చెప్పినా, ఏదో ఒక రూపంలో, మార్గంలో అదానీని దెబ్బకొట్టడమే హిండెన్‌బర్గ్‌తో పాటు ప్రతిపక్షాల లక్ష్యంలా కనిపిస్తోంది. కానీ ప్రజలు, పెట్టుబడిదారులూ దాని ఎత్తులు పారకుండా అడ్డుకుంటున్నారు.

– నీల

# వక్ఫ్ బోర్డు ఒంటెత్తు పోకడలకు అడ్డుకట్ట

"స్వభావ సిద్ధంగా భారతీయ సమాజం సెక్యులర్. కానీ, సెక్యులరిజం మాటున సనాతనధర్మం మతతత్వం గలదని ఆరోపిస్తూ, దానిని అనుసరించే వారిపట్ల శత్రుత్వభావం ఉన్నవారు ఎంత గొప్పవారైనా దేశద్రోహులే" అంటారు సీతారాం గోయెల్, 'సెక్యులరిజం, దాని భావ వక్రీకరణ' అన్న వ్యాసంలో. ఆయన చెప్పినట్టుగానే సనాతన ధర్మాన్ని దుమ్మెత్తిపోస్తూ, ఈ దేశంలో మైనార్టీలుగా చెప్పుకునేవారు రకరకాల రీతుల్లో చెలిరేగిపోతుంటారు. ఆ కోవలోకి వచ్చేదే ముస్లింలకు చెందిన 'వక్ఫ్' బోర్డు. దానిని అడ్డుపెట్టుకుని చేస్తున్న అరాచకాలకు కళ్లెం వేసేందుకు కేంద్రం ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న వక్ఫ్ సవరణ చట్టంలో ప్రతిపాదనలు ప్రభుత్వ వ్యతిరేకులందరి కోరికలనూ నెరవేరుస్తూ సెక్యులర్ భావనలను కలిగి ఉండటం విశేషం.




వక్ఫ్ ప్రస్తావన వారి పవిత్ర గ్రంథంలో లేదని ముస్లిం మతాన్ని అధ్యయనం చేసినవారు చెప్తున్నారు. ఈ భావనకు పునాది వారి ప్రవక్త మాటలు, చేతలను అభివర్ణించే పద్యాల అంతరార్థం మాత్రమేనని వారంటారు. ఏమైనప్పటికీ, గత పాలకులు తమ స్వార్థం కారణంగా ఆమోదించిన వక్ఫ్ బోర్డు బిల్లును అడ్డంపెట్టుకుని ఇస్లాం పుట్టక ముందు నుంచీ ఉన్న ప్రదేశాలను కూడా ఆక్రమించే యత్నం చేస్తున్న విషయం ఉత్తరాన ఉత్తరాఖండ్ నుంచి దక్షిణాన తమిళనాడు వరకూ మనం చూస్తున్నాం. ఈ క్రమంలోనే దాని అడ్డగోలు వ్యవహారాలకు, అత్యాచారాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్రం వక్ఫ్ సవరణ చట్టాన్ని రూపొందించింది.

వక్ఫ్ చట్టంలో ప్రతిపాదిత సవరణలు ఊహించినట్టుగానే విస్తృత చర్చలకు దారి తీశాయి. పార్లమెంటు, మీడియా, వీధులలో కూడా దీనిని వ్యతిరేకించేందుకు తమను తాము సెక్యులరిస్టులుగా పిలుచుకునేవారు సిద్ధమయ్యారు. జాతీయవాదులలో ఒక వర్గం పూర్తిగా ఈ చట్టాన్నే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ, అలా చేస్తే భారత్‌లో మంటలు చెలరేగడానికి వారికి ఆయుధమిచ్చినట్టవుతుంది. అందుకే బీజేపీ ప్రభుత్వం సవరణల బాట పట్టిందన్నది నిర్వివాదం. ఈ సవరణ చట్టం అమలు వక్ఫ్ బోర్డు నిర్వహణ, పాలన, ఆస్తుల పర్యవేక్షణలో అనూహ్యమైన మార్పులు తెస్తుంది. ముఖ్యంగా, పొరుగు దేశమైన బాంగ్లాదేశ్‌లో జరిగిన పరిణామాలతో వ్యతిరేక వర్గాలకు బలం చేకూరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలు ఓట్ల మీద ఆశతో అగ్నికి ఆజ్యం పోయకుండా ఉండేందుకే ప్రభుత్వం ఈ చట్టాన్ని జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపి వారి నోళ్లు ప్రస్తుతానికి మూయించింది. ఇంతకీ ఈ సవరణలు ఏమిటి? వాటి ప్రభావం భారత్‌పై ఎంత తీవ్రంగా ఉండనుందో పరిశీలిద్దాం.

**వక్ఫ్ చట్టం చారిత్రక పరిణామం**

భారత్‌లో బ్రిటిష్ ప్రభుత్వం ఉన్న సమయంలో రూపొందించిన వక్ఫ్ చట్టంలో స్వాతంత్ర్యానంతరం అనేక మార్పులు జరిగాయి. ఈ చట్టం ముస్లిం ఖాజాలు, ముల్లాలకు, వారిలో అగ్రవర్ణాలకు అసమానమైన అధికారాలను ఇస్తోంది. తర్వాత వచ్చిన సవరణలన్నీ కూడా నిత్యం ముస్లింల బుజ్జగింపు రాజకీయాలను కొనసాగించే గాంధీ కుటుంబం, కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా చేపట్టినవే. వీటిలో అత్యంత ముఖ్యమైనవి 1995, 2014 (2013లోనే రూపొందించిన ముసాయిదాతో)లో చేసిన ప్రధాన సవరణలు. ఇవి వక్ఫ్ బోర్డును భూకబ్జాలు చేసే తిమింగలంగా మార్చివేశాయి. తాము అధికారం నుంచి వైదొలిగే ముందు కాంగ్రెస్ పార్టీ 123 ఆస్తులను వక్ఫ్ బోర్డుకు అప్పగించిందనే ఆరోపణలు ఉన్నాయి.

- వక్ఫ్ ఆస్తుల నిర్వహణకు పునాదులు 1923లో బ్రిటిష్ ప్రభుత్వం ఆమోదించిన అసలు చట్టంలో ఉన్నాయి. 1923లో రూపొందించిన ముసాయిదాను 1925లో చట్టంగా మార్చారు.
- స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, 1954లో నాటి ప్రధానమంత్రి జవాహర్‌లాల్ నెహ్రూ వక్ఫ్ బోర్డుకు చట్టపరమైన హోదా ఇచ్చారు. నూతనంగా రూపొందించిన రాజ్యాంగంలోకి ఈ బ్రిటిష్ ప్రభుత్వ వ్యవస్థను జొప్పించారు.
- ఆ తర్వాత ప్రభుత్వాలు వివిధ కారణాలు సాకుగా చూపి 1963, 1964, 1984లో వక్ఫ్ చట్టానికి సవరణలు చేశాయి. అయితే, 1995, 2014లో కాంగ్రెస్ నేతృత్వంలో చేసిన సవరణలకన్నా అరాచకమైనవి మరేవి ఉండవు.

ప్రధానిగా పివి నరసింహారావు నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1995లో విస్తృతమైన, గణనీయమైన అంశాలను ఇందులో పొందుపరిచి, చట్టాన్ని తాజా పరిచింది. 1996లో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ తమ ప్రధాన, ప్రాథమిక ఓటు బ్యాంకును ఈ సవరణల ద్వారా బుజ్జగించే ప్యాకేజీని

రూపొందించింది.

తర్వాత, 1995వంటి సంక్షోభాన్నే 2014లో ఎదుర్కొన్న కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూపీఏ కూటమి, తన శత్రువుగా భావించే బీజేపీ నేతృత్వంలో అభేద్యమైన మోదీ గాలిని ఎదుర్కొనవలసి వచ్చింది. అప్పటికే అభాసుపాలైన, తీవ్రంగా అవినీతిమయమైన యూపీఏ ప్రభుత్వం 2013 డిసెంబర్‌లో వక్ఫ్ చట్టంలో దాదాపు భీకరమైన సవరణలను ప్రవేశ పెట్టింది. తమ విజయావకాశాల కోసం ఈ సవరణలు ఫిబ్రవరి 2014లో సరిగ్గా ఎన్నికల




ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చే ముందు చట్టంగా ఆమోదించింది. ఈ సవరణలు భారత్‌లో ఆస్తుల విషయంలో వక్ఫ్ సమాంతరంగా పాలన చేసేందుకు దారి తీశాయి.

**ప్రతిపాదిత సవరణ**

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న 2024 నాటి సవరణలు వక్ఫ్ వ్యవస్థకు గల ఈ గుత్తాధిపత్య దంతాలను పీకివేసేందుకు ప్రతిపాదనలు చేస్తున్నాయి. ఈ సవరణలు సెక్యులర్, ప్రగతిశీలమైనవే కాక ఇస్లామిక్ చట్టంలోని నిబంధనలకు లోబడే ఉన్నాయి. ఈ సవరణలకు వ్యతిరేకంగా వక్ఫ్‌బోర్డ్ వాదించే అవకాశాన్ని వీటి స్వభావం నిర్వీర్యం చేస్తుంది. కనుక, వీధులలో అల్లర్ల ద్వారా లేదా దుష్ప్రచారం ద్వారా మాత్రమే ఇండి కూటమి ఈ సవరణలను అడ్డుకోగలదు. ఎందుకంటే, తమ శాశ్వత ఓటు బ్యాంకును వారు బుజ్జగించకపోతే మొదటికే మోసం వచ్చే అవకాశాలున్నాయి.

**వక్ఫ్ చట్టంలో ప్రతిపాదించిన కీలక సవరణలు**

ఈ సవరణలలో ఒకటి వక్ఫ్‌బోర్డును వంశ పారంపర్య వక్ఫ్‌లుగా విభజించింది. ఇది 'ఉమ్మా' (ఈ భూమి అంతా అల్లాకు చెందిందే అన్న భావన) పేరు తో ఏర్పడ్డ సున్నీ సంఘటనను విచ్ఛిన్నం చేస్తుంది. దీనితో, వక్ఫ్ బోర్డు గతంలోలా అపరిమితంగా అధికారాలను అనుభవించలేదు. ఈ క్రమంలో వివిధ వక్ఫ్ బోర్డుల మధ్య అంతర్గత కుమ్ములాటలు జరిగే అవకాశాలున్నాయి. వైవిధ్యభరిత మైన ఇస్లామిక్ సంప్రదాయాలను గుర్తిస్తూ, వక్ఫ్‌ను 'ఆగాఖానీ వక్ఫ్, బోహ్రా వక్ఫ్' అన్న కొత్త పేర్లతో విభజించనున్నారు. విరాళంగా ఇచ్చిన ఆస్తికి సరైన ప్రమాణ పత్రాలు లేకుండా, ఏ ఆస్తినైనా వక్ఫ్ ఆస్తిగా ప్రకటించుకోవడానికి లేకుండా ఈ సవరణలు హామీ ఇస్తున్నాయి. నిర్దేశిత, పారదర్శక పద్ధతిలో ప్రకటన ద్వారా మాత్రమే వక్ఫ్‌కు ఇచ్చిన విరాళం వక్ఫ్ ఆస్తిగా మారుతుంది.

**ప్రాచీన ఖాజీ నియంత్రిత వక్ఫ్ ఆధునీకరణ**

మరొక కీలక సవరణ పర్యవేక్షణ, విచారణ అధికారాలను వక్ఫ్ సర్వేయర్ల నుంచి ప్రభుత్వ నియమిత కలెక్టర్లకు మారుస్తుంది. ఇది వక్ఫ్ చట్టం కింద దాఖలు చేసిన క్లెయిమ్‌లు, కౌంటర్ క్లెయిమ్‌లపై సర్వేల నిష్పాక్షికతను నిర్ధారిస్తుంది. వక్ఫ్ ముతావలీకి పరిమిత అధికారాలవల్ల, ఖాజీ ఆదేశాలపై ఆధారపడి ఉంటాడు. ఇప్పుడు, వక్ఫ్‌బోర్డు ప్రకటించే క్లెయిములను కలెక్టర్లు పర్యవేక్షించే అవకాశాన్ని ఈ నూతన సవరణ ఇస్తుంది.

అదనంగా, వక్ఫ్ బోర్డు తన డాటాబేస్‌ను వ్యవస్థీకరించుకొని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యవస్థల కింద గల పోర్టల్‌లో అవసరమైన వివరాలు పొందుపరచవలసి ఉంటుంది. తద్వారా వక్ఫ్‌బోర్డు డేటాకు కేంద్రీకృత డిజిటల్ వేదిక అందుబాటులో ఉండేలా నిర్ధారిస్తుంది. ఇది, పారదర్శకతను పెంచడమే కాదు, వక్ఫ్ నిర్వహణను ప్రస్తుత పాలనా పద్ధతులతో సమలేఖనం చేస్తుంది. తద్వారా, వక్ఫ్ ప్రత్యేకతను తగ్గించి అదే సమయంలో ఆధునీకరణకు హామీ ఇస్తుంది.

**వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్**

ప్రతిపాదిత సవరణలు వక్ఫ్ ఆస్తులను డిజిటల్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయడాన్ని తప్పనిసరి చేస్తాయి. ఈ నిబంధన ఏకపక్షంగా వక్ఫ్ భూములపై హక్కులను ప్రకటించకుండా అడ్డుకుంటుంది.

ముఖ్యంగా, నిర్దేశిత ఆరు నెలల కాలంలో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ జరగాలన్న నిబంధన, వక్ఫ్ బోర్డు దోపిడీ చేసుకోవడానికి వీలుగా యూపీఏ ప్రభుత్వం చేసిన చట్టపరమైన లొసుగులను నిలిపివేస్తుంది.

భారత దేశంలో ఆస్తుల నిర్వహణలో పారదర్శకతను పెంచి, మోసపూరిత క్లెయిములను అరికట్టడాన్ని లక్ష్యంగా పెట్టుకుని రిజిస్ట్రేషన్లపై దృష్టిపెట్టడం జరిగింది. అంతేకాదు, ఈ సవరణ సీఏజీ (కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్) నియమించిన ఆడిటర్లకు వక్ఫ్ బోర్డును జవాబుదారీ చేస్తుంది. అంటే, నిధుల నిర్వహణలో జవాబుదారీతనాన్ని పెంచడానికి, ఆస్తుల క్రమబద్ధీకరణకు వక్ఫ్‌బోర్డేతరులు ఆమోదించిన ఆడిటర్ల ద్వారా ఆడిట్ చేస్తారు.

**తాము ఉపయోగిస్తున్న దానిని వక్ఫ్‌గా ప్రకటించుకునే అవకాశం తొలగింపు**

ఈ ఉపయోగించుకోవడం అన్న నిబంధన, 'ఒక్కసారి వక్ఫ్‌ది అయితే ఎప్పుడూ వక్ఫ్‌దే' అన్న భావజాలాన్ని బలపరచింది. ఆస్తులను ఉపయోగిస్తున్నవారు దానిని వక్ఫ్‌గా పేర్కొనవచ్చని ఈ నిబంధన చెప్తుంది. ఒక్కసారి ఏదైనా ఆస్తిని వక్ఫ్‌గా ప్రకటిస్తే, దానిని తిరిగి పొందలేరని మరొక నిబంధన పేర్కొంటుంది.

అందుకే, 2024 సవరణలు 'వక్ఫ్ బై యూజ్' అన్న నిబంధనను తొలగించింది. తద్వారా, దానిని చట్టబద్ధంగా విరాళంగా ఇస్తే తప్ప అది వక్ఫ్ పరిధి

లోకి రాదని, ఆ ఆస్తిపై యజమాని హక్కులను పునరుద్ధరించింది.

**వక్ఫ్ చట్టం నిర్వహణ, పాలన**

మహిళలకు కూడా న్యాయం జరిగేలా, నూతన ప్రతిపాదన వక్ఫ్-అలాల్-ఔలాద్ ఆస్తులు మహిళలకు వారసత్వంగా వచ్చేలా నిర్ధారిస్తుంది. తద్వారా, పురుషాధిపత్య మతంలో జెండర్ సమానతను ప్రోత్సహిస్తుంది.

దీనితోపాటుగా, ముస్లిం సమాజంలో బలహీన వర్గాలకు వక్ఫ్ బోర్డులో ప్రాతినిధ్యం ఉండాలని ఈ సవరణలు సూచిస్తున్నాయి. తద్వారా, వక్ఫ్ ఆస్తుల నిర్వహణ, పాలనలో ముస్లింలలో ఓబీసీలు, ఎస్సీలు సమ్మిళితం కావడాన్ని సవరణ నిర్ధారిస్తుంది.

ఈ వినూత్న నిబంధనలు ముస్లింలలోని అగ్రకులాల చేతుల్లోంచి వక్ఫ్ బోర్డు నియంత్రణను తప్పించి, ముస్లిం సమాజంలోని అన్ని వర్గాలకూ అందులో గొంతుక ఉండేలా చూస్తాయి.

ప్రస్తుతం 1.2లక్షల కోట్ల విలువైన వక్ఫ్ ఆస్తులు సుమారు 200 వ్యక్తుల చేతుల్లో ఉన్నాయి. ఈ ఆస్తులు ఉత్పత్తి చేసే రెవిన్యూపై పన్నులు చెల్లించ నవసరం లేదు. మరి ఆ ఆదాయంపై జవాబుదారీ తనం కోసం వక్ఫ్ బోర్డులో సమాన ప్రాతినిధ్యం ఉండేలా ఈ సవరణలు ఖరారు చేస్తాయి.

**వక్ఫ్ చట్టం- వివాదాల పరిష్కారం**

ఈ నూతన సవరణల కారణంగా వక్ఫ్ ట్రిబ్యునల్ అధికారాలు నిర్వీర్యం కానున్నాయి. 2024లో చేసిన ప్రతిపాదనలలో సరైన న్యాయ పర్యవేక్షణ అంశాన్ని ప్రవేశపెట్టారు. వివాదాస్పద వ్యవహారాల్లో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, న్యాయవ్యవస్థల అభిప్రాయాలకు, నిర్ణయాలకు విలువుంటుంది. తద్వారా, వివాదాలు వేగంగా, న్యాయంగా పరిష్కారమయ్యే అవకాశాన్ని కల్పిస్తున్నారు.

ఒక్క ముక్కలో చెప్పాలంటే, *ఈ సవరణ వక్ఫ్ ట్రిబ్యూనల్‌కు గల పాక్షిక న్యాయ హోదాను నిర్వీర్యం చేస్తుంది. అంతేకాదు, వక్ఫ్ బోర్డును జాతీయ చట్టాల వ్యవస్థలో దృఢంగా ఉంచుతుంది.*




**దేశంలోని వక్ఫ్ ఆస్తుల పారదర్శక, సమ్మిళి తత్వం, సమర్థవంతమైన నిర్వహణ దిశగా వక్ఫ్ చట్టంలో ప్రతిపాదించిన ఈ సవరణలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. అటు ఇస్లామిక్ సూత్రాలు, సమకాలీన పాలన ప్రమాణాలను సమలేఖనం చేయడం ద్వారా ఈ సవరణలు వక్ఫ్ ఆస్తుల నిర్వహణ దేశం మొత్తానికీ లాభదాయకంగా ఉండేలా నిర్ధారిస్తాయి.**

కనుక, ఈ సెక్షన్‌లో సవరణలు వివాదాల్లో ముస్లిమేతరుల గొంతుకకు చోటును నిర్ధారిస్తాయి. అదనంగా, ప్రాంతీయ, జాతీయ చట్టాలకు కట్టుబడి, అందుకు అనుగుణంగా వక్ఫ్‌బోర్డులు పని చేసేలా ఖరారు చేస్తాయి.

**ఈ సవరణల వల్ల దేశానికేం లాభం?**

*పారదర్శకత, జవాబుదారీతనం:*

కేంద్రీకృత డిజిటల్ డేటా బేస్ సృష్టి, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేయడం అన్నది పారదర్శకత దిశగా ఒక పెద్ద అంగ. సమాచారం బహిరంగంగా అందుబాటులో ఉంచడం ద్వారా, దుర్వినియోగం, అనధికారిక క్లెయిములను నివారించి, ప్రజల విశ్వాసాన్ని ఈ సవరణలు పెంపొందిస్తాయి.

*జెండర్ సమానత్వం, కలుపుకుపోవడం:*

మహిళల వారసత్వ హక్కులకు హామీ ఇవ్వడం, ముస్లిం మహిళల ప్రాతినిధ్యాన్ని తప్పనిసరి చేయడం ద్వారా, ఈ సవరణ ముస్లిం మహిళా ప్రపంచాన్ని సాధికారం చేస్తుంది. ముస్లిం సమాజంలోని బలహీనవర్గాలను కలుపుకోవడం ద్వారా వక్ఫ్ బోర్డులలో మరింత సమ్మిళిత పాలనా నమూనాను ప్రోత్సహిస్తుంది.

*ప్రభుత్వ ఆస్తులకు రక్షణ:*

ప్రభుత్వ ఆస్తులపై వక్ఫ్ అనైతిక హక్కుల సమస్యలను ఈ సవరణలు నిర్ణయాత్మకంగా పరిష్కరిస్తాయి. ప్రభుత్వ ఆస్తులపై గత, ప్రస్తుత క్లెయిములన్నింటినీ నిష్ఫలం చేస్తాయి. ఈ ఆస్తులను వక్ఫ్ కబంధహస్తాల నుంచి విడిపించిన తర్వాత ఈ వనరులను సరైన రీతిలో వినియోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అదనంగా, అది చట్టపరమైన, పాలనాపరమైన ఆటంకాలను నివారిస్తుంది.

*కలెక్టర్ల పాత్ర పెంపు:*

వక్ఫ్ సర్వేయర్ల నుంచి పర్యవేక్షణ బాధ్యతను కలెక్టర్లకు బదిలీ చేయడం అన్నది నిష్పాక్షికతకు, ప్రభుత్వ జవాబుదారీ తనానికి దారితీస్తుంది. ప్రభుత్వ నియమిత అధికారులుగా కలెక్టర్లు వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో ఉన్నతస్థాయి పర్యవేక్షణను, నిజాయతీని తీసుకువస్తారు.

*న్యాయ సామర్థ్యం:*

వక్ఫ్ వివాదాల పరిష్కారానికి ఒక ప్రత్యేక న్యాయ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం వల్ల అవి న్యాయంగా, వేగంగా పరిష్కారమయ్యేందుకు తోడ్పడుతుంది. కనుక, వక్ఫ్ ఆస్తులు భారతీయ చట్టాలకు అనుగుణంగా, సరైన చట్టపరమైన పరిధితో నిర్వహించేలా సవరణలు నిర్ధారిస్తాయి.

**వక్ఫ్ నిర్వహణలో నూతన అధ్యాయం**


దేశంలోని వక్ఫ్ ఆస్తుల పారదర్శక, సమ్మిళితత్వం, సమర్థవంతమైన నిర్వహణ దిశగా వక్ఫ్ చట్టంలో ప్రతిపాదించిన ఈ సవరణలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. అటు ఇస్లామిక్ సూత్రాలు, సమకాలీన పాలన ప్రమాణాలను సమలేఖనం చేయడం ద్వారా ఈ సవరణలు వక్ఫ్ ఆస్తుల నిర్వహణ దేశం మొత్తానికీ లాభదాయకంగా ఉండేలా నిర్ధారిస్తాయి.

ప్రభుత్వ ఆస్తుల అధ్రువీకృత హక్కులను ఈ మార్పులు ధ్వంసం చేస్తాయి. ఇవి ఉమ్మాలోని మహిళలను, బలహీనవర్గాలను సాధికారం చేస్తాయి. అదనంగా, సెక్యులర్ అల్లికను ముస్లిం సమాజంలో ఈ సవరణలు నకలు చేస్తాయి.

ఈ సవరణలు వక్ఫ్‌బోర్డు అనే గుత్తాధిపత్య వ్యవస్థను ముస్లిమేతరులు ఎదుర్కొనవలసిన అవసరం లేకుండా చేస్తాయి. ఈ న్యాయమైన, సమానమైన వక్ఫ్ నిర్వహణను త్వరలోనే, ఆమోదించి అమలు చేయాలని ఆశిద్దాం.

**– డి. అరుణ**






దేశ జనాభాలో సగం మంది సగటు వయస్సు 29 ఏళ్ల లోపువారే. ఈ జనాభా సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడానికి 25 సంవత్సరాల సమయం ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద శ్రామికశక్తిని అందించే దేశంగా భారత్ అవతరించబోతుంది. ప్రతి ఏడాది 13 లక్షల మంది భారతీయ విద్యార్థులు ఉన్నత విద్య కోసం విదేశాలకు పోతున్నారు. రానున్న కాలంలో భారత్‌నే విదేశీ విద్యార్థులను ఆకర్షించేలా ఎదుగనుంది. 2047 నాటికి భారత్ విశ్వ గురువుగా మారనుంది. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారితే దేశ ప్రజల ఆదాయం 6 రెట్లు పెరిగే అవకాశం ఉంటుంది.



# 2024 యువ భారత్.. 2047 వికసిత భారత్

మూడు దశాబ్దాల పాటు భారత్ ఏటా 9 నుంచి 10 శాతం వృద్ధి సాధిస్తే.. ప్రజల ఆదాయం 12000 డాలర్లు దాటుతుంది. కొరియా, తైవాన్, చైనా కూడా ఇదే స్థాయిలో అభివృద్ధి చెందాయి. 2047 నాటికి దేశాన్ని వికసించిన భారత్‌గా (అభివృద్ధి చెందిన దేశంగా) మార్చేందుకు కృషి చేయాలని మే, 2023 నాటి నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 'విజన్-2047' భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడానికి అవసరమైన సంస్థాగత, నిర్మాణాత్మక మార్పులను సంస్కరణలను నిర్దేశిస్తుంది. స్వాతంత్ర్యం సాధించి 2047 నాటికి వందేళ్లు నిండుతుంది. ఆ నాటికి 30 ట్రిలియన్ డాలర్ల అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించేందుకు విజన్ డాక్యుమెంట్‌ను నీతి ఆయోగ్ సిద్ధం చేసింది. ఇది ఆర్థిక వృద్ధి, పర్యావరణ స్థిరత్వం, సామాజిక పురోగతి, సుపరిపాలన, మెరుగైన అభివృద్ధి వంటి కోణాలను కలిగి ఉంటుంది. ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ ప్రకారం 2047 నాటికి భారత్ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) 8 శాతం పెరగాలి. 2022లో 6.5 శాతం ఉండగా 2023లో 7.7 శాతానికి పెరిగింది.

2021 డిసెంబరులోనే వికసిత భారత్‌కు అడుగులు పడ్డాయి. రంగాల వారీగా సిద్ధం చేసే బాధ్యతలను 10 సెక్టోరల్ గ్రూప్స్ ఆఫ్ సెక్రటరీలకు అప్పగించారు. వీటిలో ప్రధానంగా పరిశ్రమ ఛాంబర్‌లు, ఎగుమతి ప్రోత్సాహక మండలి, విశ్లేషణా నిపుణులు,



పరిశోధనా సంస్థలతో పలు దఫాల్లో మేధోమథనం, సంబంధిత సంప్రదింపులు జరిగాయి. అభివృద్ధి చెందిన భారత్ 2047 కోసం 10 రంగాల దార్శనికత విభాగాలను ఏకీకృతం చేసేందుకు 2023లోనే నీతి ఆయోగ్ బాధ్యతలను చేపట్టింది.

**తలసరి ఆదాయం రూ.98 వేల లక్ష్యం..**

దేశంలో ప్రస్తుతం అనుసరిస్తున్న ఆర్థిక సూత్రాల ప్రకారం తలసరి ఆదాయం 1,036 డాలర్ల నుంచి 4,045 డాలర్ల మధ్య ఉంది. ఈ విధంగా ఉన్న దేశాన్ని దిగువ మధ్య తరగతి ఆదాయ దేశంగా పరిగణిస్తారు. 4,046 నుంచి 12,535 డాలర్ల మధ్య ఆదాయ దేశాలను ఎగువ మధ్య తరగతి ఆదాయ దేశాలు అంటారు. 12,000 డాలర్ల తలసరి ఆదాయం దాటితే అది అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంది. అమెరికా, చైనా, జపాన్, జర్మనీ తర్వాత ప్రస్తుతం ప్రపంచంలోనే 5వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా(3.75 ట్రిలియన్ డాలర్లు) భారత్ కొనసాగుతున్నది. అంటే భారత్ తలసరి ఆదాయం దాదాపు 1,183 డాలర్లని (రూ.98,373) అంచనా. 2047 నాటికి ఈ పరిమాణం 18,000 డాలర్లుగా నిర్దేశించుకున్నాం. ప్రస్తుతం 25.5 ట్రిలియన్ డాలర్లతో అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్నది. ప్రపంచం మొత్తం జీడీపీలో 25శాతం వాటాను కలిగి ఉంది. చైనా ప్రపంచ జీడీపీలో 18 ట్రిలియన్ డాలర్లతో 17.9 శాతం ఎకానమీగా రెండో స్థానంలో ఉంది. తరువాత స్థానాలలో జపాన్ 4.2 ట్రిలియన్ డాలర్లు, జర్మనీ 4 ట్రిలియన్ డాలర్లుగా ఉన్నాయి. 2022 నాటికి భారత్ ఎకానమీ బ్రిటన్, ఫ్రాన్స్‌లను అధిగమించింది. ఇదే లక్ష్యంతో సుస్థిర పాలనతో ముందుకు సాగితే 2047 నాటికి అనుకున్న ఆర్థిక లక్ష్యాన్ని చేరుకోవచ్చు. ఆర్థిక ప్రగతిని సాధిస్తే అభివృద్ధి అనేది దానంతట అదే జరిగిపోతుంది.

**బడ్జెట్‌తో పడిన అడుగులు..**

వికసిత భారత్-2047కు సాధ్యమనేది మన దేశ బడ్జెట్ 2024-25తోనే అర్థం చేసుకోవచ్చు. బడ్జెట్ అంటే అప్పులు, ఆదాయం కాకుండా రూ.48.20 లక్షల కోట్ల బడ్జెట్‌లోనూ విజన్ కనిపించింది. వికసిత భారత్ లక్ష్యాలకు అను గుణంగా బడ్జెట్ ఉంది. తొమ్మిది ప్రాధాన్యాంశాలు కనిపించాయి. ముఖ్యంగా పేదలు, రైతులు, యువత, మహిళల అభ్యున్నతి.. వికసిత భారత్ లక్ష్యాలుగా బడ్జెట్ ఉంది. ఆర్థిక వ్యవస్థలో అపార అవకాశాలను సృష్టించడానికి పెద్దపీట వేసింది. కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసుకున్న తొమ్మిది ప్రాధాన్యాంశాలు బడ్జెట్‌లో స్పష్టంగా కనిపించాయి. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, ఉద్యోగ కల్పన-నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన-ఆవిష్కరణలు, తయారీ-సేవలు, సంస్కరణలు వీటినే ప్రాధాన్యంగా తీసుకొని బడ్జెట్ రూపకల్పన జరిగింది. ఇదే కాకుండా ఇప్పటికే మనం చెప్పుకున్నట్టుగా భారత్‌ను ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపొందించడం, అభివృద్ధి దిశగా పునాది ఈ బడ్జెట్‌తో పడిందని చెప్పుకోవచ్చు. ప్రధానిగా మోదీ మూడోసారి అధికారం చేపట్టాక దేశం గర్వించేలా అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు.

**ఉపాధికి ఊతం..**

సామాజిక న్యాయాన్ని సంపూర్ణంగా సాధించా

లన్న సంకల్పంతో చేనేతకారులు, స్వయం సహాయక సంఘాలు, ఎస్సీ, ఎస్టీ మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, వీధి వ్యాపారులకు పీఎం విశ్వకర్మ, సీఎం స్వనిధి, జాతీయ జీవనోపాధి మిషన్, స్టాండప్ ఇండియాల ద్వారా మద్దతు ఇవ్వనున్నారు. మహిళలకు ఉపాధి, ప్రయోజనం కల్పించే పథకాలకు ఈ బడ్జెట్‌లో రూ.3 లక్షల కోట్లను కేటాయించారు. గిరిజనుల సామాజిక, ఆర్థిక అభ్యున్నతి కోసం ప్రధాన మంత్రి జన జాతీయ ఉన్నత గ్రామ అభియాన్‌ను సైతం త్వరలోనే ప్రారంభించనున్నారు. స్వయం ఉపాధి పథకాల ద్వారా జీవనోపాధి పొందుతున్నవారి వ్యాపార సామర్థ్యాలను పెంచేందుకు గొప్ప నిర్ణయం తీసుకున్నారు. ముద్ర రుణాల పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పెంచడంతో మధ్య స్థాయి నుంచి ఉన్నతమైన వ్యాపారాలను చేసుకునే అవకాశం ఏర్పడుతుంది.

**విద్యా ప్రమాణాల పెంపు..**
**యువతకు నైపుణ్య శిక్షణ**

దేశంలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నది. దీనిలో భాగంగానే "జాతీయ విద్యా పాలసీ (NEP)" ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. దేశంలో కాలేజీల నమోదు రేటు 27 శాతం నుంచి 60 శాతానికి పెంచే లక్ష్యంతో బడ్జెట్‌లోనూ ప్రభుత్వం భారీగా నిధులను కేటాయించింది. దీంతో కాలేజీకి వెళ్లే విద్యార్థుల సంఖ్యను 4 కోట్ల నుండి 9 కోట్లకు చేరే విధంగా చూడనున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న వెయ్యి విశ్వవిద్యాలయాలకు తోడుగా మరో వెయ్యి కొత్తగా అవసరం అవుతాయి. బడ్జెట్‌లో పేర్కొన్న విధంగా నవ ప్రాధాన్యాల్లో ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి కీలకంగా మారనున్నాయి. దేశంలో భారీగా కొత్త ఉద్యోగాల కల్పన, అందుకు వీలు



కల్పించేలా యువతకు నైపుణ్య శిక్షణ లక్ష్యంతో మోదీ సర్కార్ అడుగులు వేసిందనే చెప్పుకోవాలి.

ఇదే కాకుండా స్వయం ఉపాధిపై ఆధార పడిన వీధి వ్యాపారులకు కావాల్సిన ప్రోత్సాహాన్ని అందించనున్నారు.

పట్టణ పేదల కోసం రూ.10లక్షల కోట్లతో కోటి ఇళ్లను నిర్మించనున్నారు. మహిళా సాధికారతను ప్రోత్సహించేందుకు వీలుగా వారి పేర్లపై రిజిస్టరయ్యే ఆస్తులపై స్టాంప్ డ్యూటీని సైతం తగ్గించనున్నారు. ఇవే కాకుండా మహిళలకే ప్రత్యేకించిన నైపుణ్యాల శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నారు. ఉద్యోగాల్లో మహిళల భాగస్వామ్యం పెంచడం కోసం పరిశ్రమలు, కంపెనీల సహకారంతో వర్కింగ్ విమెన్ హాస్టళ్లు, చిన్న పిల్లల సంరక్షణను చూసుకునే క్రెచ్‌ల ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఉపాధి, ఉద్యోగ రంగాలలో మహిళల సంఖ్య ఆశించిన స్థాయిలో పెరగనుంది. అంతమంగా మహిళాసాధికారతను సాధించడం సాధ్యం అవుతుంది.

ఎంఎస్ఎంఈ పరిశ్రమలు, మధ్య తరగతి, విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి బడ్జెట్‌లో రూ.1.48 కోట్లను కేటాయించారు. ప్రధాని ప్యాకేజీలోని స్కీం-ఏలో భాగంగా తొలిసారి ఉద్యోగాల్లో చేరిని వారిని ఈపీఎఫ్ఓ ఖాతాల ఆధారంగా గుర్తించి వారికి ఒక నెల వేతనాన్ని ప్రోత్సాహకంగా అందించనున్నారు. స్కీం-బీలో ఉత్పాదక రంగంలో ఉపాధి కల్పనను ప్రోత్సాహించేందుకు ఉద్యోగికి, యజమానికి కూడా ప్రోత్సహకాలు ఇవ్వనున్నారు. ఇదే కాకుండా దేశంలోని కోటి మంది యువతకు అగ్రశ్రేణి 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ కల్పించనున్నారు. వారి ఉద్యోగ సామర్థ్యాన్ని పెంచేందుకు కొత్త పథకాన్ని కూడా ప్రవేశపెట్టనున్నారు. ఇందుకోసం ఒక్కో అభ్యర్థికి నెలకు రూ.5వేల భృతి కూడా చెల్లించనున్నారు. దేశంలో ఈ ఐదేళ్లల్లో 4.1 కోట్ల మంది యువతకు ఉపాధి, నైపుణ్యం, ఇతర అవకాశాలను కల్పించేందుకు బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లను కేటాయించారు. 100 నగరాలలో పారిశ్రామిక పార్కులను సైతం అభివృద్ధి చేయనున్నారు. దీంతో వేలాది కంపెనీలు ఏర్పాటు కానున్నాయి. వేలాది మంది యువ పారిశ్రామికవేత్తలు దేశంలో తయారు కానున్నారు.

**అన్నదాతకు కొండంత అండగా**

దేశంలో సుమారు 70 శాతం గ్రామాలలో వ్యవసాయమే జీవనాధారం. సాగు ఉత్పాదకత పెంచడమే లక్ష్యంగా బడ్జెట్‌లో వ్యవసాయం, దీని అనుబంధ రంగాలకు కేంద్ర ప్రభుత్వం రూ.1.52 లక్షల కోట్లను కేటాయించింది. రైతు సంక్షేమానికి ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తుందో దీంతో అర్థం చేసుకోవచ్చు. దేశంలోని కోటి మంది రైతులు వచ్చే రెండేళ్లల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా ప్రోత్సాహం కూడా అందించ నుంది. దేశ సమగ్రాభివృద్ధికి జాతీయ సహకార విధానాన్ని అమల్లోకి తేనుంది. గ్రామీణ ఆర్థికం, సత్వర అభివృద్ధి, ఉద్యోగావకాశాల కల్పనను వేగవంతం చేయనున్నారు. రైతుకు భూమే ఆధారం. భూమి మీద ఆధారపడి జీవించే రైతుకు భూమి హక్కులు దక్కాలి. అందుకే రాష్ట్రాల భాగస్వామ్యంతో రైతులు, వారి భూములకు మూడేళ్లలో డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. భూ సంస్కరణలలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని భూములకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య లేదా భూ ఆధార్ కేటాయించనున్నారు. ఇదే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో భూ పరిపాలన, ప్రణాళిక, నిర్వహణ, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ప్లానింగ్, ఉప చట్టాల రూపకల్పనను కూడా రాష్ట్రాలు నెరవేర్చేలా కేంద్రం చూడనుంది. గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని రకాల భూములకు యూనిక్ ల్యాండ్ పార్శిల్ ఐడెంటిఫికేషన్ నంబర్ (యూఎల్‌పీఐఎన్) లేదా భూ ఆధార్ కేటాయింపు, భూ సర్వే, పటాల డిజిటలీకరణ, ప్రస్తుత యజమానులకు అనుగుణంగా సబ్ డివిజన్ పటాల సర్వే, భూముల రిజిస్ట్రీ, దానికి రైతుల అనుసంధానం చేయనున్నారు. దీంతో సమస్యలు రహిత భూ పరిపాలన అమల్లోకి రానుంది. రైతులకు భూ తగాదాలు అనేవి భవిష్యత్తులో ఉండే అవకాశం ఉండదు.

**తిరుగులేని రక్షణ వ్యవస్థ**

చైనా కవ్వింపులు, పాక్ ముష్కరుల చొరబాట్లతో సరిహద్దుల వెంట అప్రమత్తంగా ఉండే సైన్యంతో భూతల, గగనతల రక్షణ వ్యవస్థల మరింత పటిష్టతే లక్ష్యంగా మోదీ సర్కార్ మరోమారు రక్షణ రంగానికి పెద్దపీట వేసిందని చెప్పుకోవచ్చు. 2024-25 బడ్జెటులో రక్షణ రంగానికి రూ.6,21,940 కోట్లు

కేటాయించింది. అత్యాధునిక డ్రోన్సు, యుద్ధ విమానాలు, నౌకలు, ఆయుధాలు, ఇతర సైనిక ఉపకరణాల కొనుగోలు కోసం ఏకంగా రూ. 1,72,0000 కోట్లు కేటాయింపులు జరుగగా.. ఇది తాజా కేంద్ర బడ్జెట్‌లో రక్షణ రంగ వాటా 12.9 శాతం పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈసారి రక్షణ రంగానికి కేటాయింపులు 4.79శాతం పెరిగాయి. రక్షణ రంగంలో స్వావలంబనే లక్ష్యంగా సైనిక ఉపకరణాల స్థానిక తయారీని మరింత ప్రోత్సాహించేందుకు మోదీ సర్కార్ శ్రీకారం చుట్టింది. అందుకే స్థానిక ఉపకరణాల సేకరణ కోసం రూ. 1,05,518 కోట్లను కేటాయించింది. దీంతో లక్షిత రక్షణరంగంలో ఆత్మనిర్భరత మరింతగా సాకారం కానుంది. గత బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి సరిహద్దుల వెంట రహదారుల నిర్మాణానికి కేటాయింపులు 30 శాతం పెంచారు. బీఆర్ఓకు కేటాయించిన రూ. 6500 కోట్ల నిధులతో సరిహద్దుల వెంట మౌలికవసతుల కల్పన మరింతగా పెరగ నుంది. రక్షణరంగ పరిశ్రమల్లో అంకుర సంస్థలు ప్రోత్సహించే ఉద్దేశంతో ఐడెక్స్ పథకానికి రూ. 518 కోట్లు కేటాయించారు. అంకుర సంస్థలు, సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు, ఆవిష్కర్తలు ఇచ్చే కొత్త ఐడియాలను ఆచరణ పెట్టేందుకు ఈ నిధులను వినియోగించనున్నారు. కోస్ట్‌గార్డ్ ఆర్గనైజేషన్‌కు రూ. 7,651 కోట్లు కేటాయించారు. తేజస్ వంటి తేలికపాటి యుద్ధ విమానాలను తయారు చేస్తూ నూతన విమానాల డిజైన్, రూపకల్పన, తయారీ కోసం కృషి చేసే హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌కు రూ. 1,600 కోట్లు ఇవ్వడం జరిగింది. రాష్ట్రీయ రైఫిల్స్ విభాగం కోసం రూ. 10,535 కోట్లు, ఎన్‌సీసీ కోసం రూ. 2,726 కోట్లు, త్రివిధ దళాల్లో అగ్నిపథ్ పథకం నిర్వహణ కోసం కూడా రూ. 5,980 కోట్లు కేటాయించారు.

**గ్రామాలకు అండగా.. పట్టణాలకు దండిగా..**


గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించేం దుకు కేంద్ర సర్కార్ నడుం బిగించింది. కీలకమైన కేంద్ర ప్రభుత్వ పథకాల(ఫ్లాగ్‌షిప్)కు బడ్జెట్‌లో భారీగా నిధులను కేటాయించింది. గత ఆర్థిక సంవత్సరంలో గ్రామీణాభివృద్ధికి రూ. 2.38 లక్షల కోట్లు కేటాయిం చగా, ఈ ఏడాది బడ్జెట్‌లో ఏకంగా రూ. 2.65 లక్షల కోట్లకు పెంచడం హర్షించదగిన విషయం. ఇదే కాకుండా ఉపాధి హామీకి మళ్లీ భారీగా నిధులతో పాటు గ్రామీణ రోడ్ల కోసం నాలుగో దశ, అదనంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో మరో 3 కోట్ల ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టనుంది. మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సైతం ఈ బడ్జెట్‌లో గతానికి కంటే 40శాతం అదనంగా నిధుల కేటాయించారు. గ్రామీణ ప్రాంతాలలో రోడ్ల నిర్మాణం కోసం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన–



గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించేం దుకు కేంద్ర సర్కార్ నడుం బిగించింది. కీలకమైన కేంద్ర ప్రభుత్వ పథకాల(ఫ్లాగ్‌షిప్)కు బడ్జెట్‌లో భారీగా నిధులను కేటాయించింది. గత ఆర్థిక సంవత్సరంలో గ్రామీణాభివృద్ధికి రూ.2.38 లక్షల కోట్లు కేటాయించగా, ఈ ఏడాది బడ్జెట్‌లో ఏకంగా రూ.2.65 లక్షల కోట్లకు పెంచడం హర్షించదగిన విషయం.

పీఎంజీఎస్‌వై(ఫ్లాగ్‌షిప్ స్కీమ్)కు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యం లభించింది. పీఎంజీఎస్‌వై–4లో భాగంగా 25వేల గ్రామీణ ప్రాంతాలను పక్కా రోడ్లతో అనుసంధానం చేయనున్నారు. ఇందుకు బడ్జెట్‌లో గతం కంటే అదనంగా 12 శాతం నిధులను కేటాయించారు. పీఎంఏవై కింద పేదలు, మధ్య తరగతి వర్గాలకు సొంతింటి కల నెరవేర్చేలా బడ్జెట్‌లో భారీగా నిధుల కేటాయింపు జరిగింది. ఇప్పటికే దేశ వ్యాప్తంగా 2023 మార్చి నాటికే 2.94 కోట్ల ఇళ్లను నిర్మించారు. గ్రామీణ ప్రాంతాలలో వచ్చే ఐదేళ్లల్లో ఈ పతకం కింద 2 కోట్ల ఇళ్లను నిర్మించ నున్నారు. గ్రామీణ కుటుంబాలన్నింటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు బడ్జెట్‌లో రూ. 69,927 కోట్లను కేటాయించారు. 2019–20లో జల్ జీవన్ మిషన్ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాంను అందుబాటులోకి తెచ్చారు. దేశంలో 19.26 కోట్ల గ్రామీణ కుటుంబాలకు గాను, ఇప్పటి వరకు 14.22 కోట్ల కుటుంబాలకు తాగు నీటి సదుపాయం కల్పించారు.

బడ్జెట్‌లో నిర్దేశించిన 9 ప్రాధామ్యాల్లో పట్టణాభి వృద్ధి ఒకటి. భూ సంబంధ సంస్కరణల్లో భాగంగా పట్టణ భూ రికార్డులకు జీఐఎస్ మ్యాపింగ్ విధానంలో డిజిటలైజేషన్ చేపట్టనున్నారు. దేశంలో 30 లక్షలకు పైగా జనాభా కలిగిన 14 పెద్ద నగరాలకు రవాణా ఆధారిత అభివృద్ధి ప్రణాళికను కేంద్రం ప్రకటించింది. నగరాల సృజనాత్మకతో కూడిన పునర్ అభివృద్ధి కోసం ఓ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించింది. నగరాలను అభివృద్ధి కేంద్రాలు (గ్రోత్ హబ్‌లు)గా తీర్చదిద్దేందుకు వీలుగా రాష్ట్రాలతో కలిసి కేంద్రం పని చేయనుంది. టౌన్ ప్లానింగ్ పథకాల వినియోగంతో నగర చుట్ట పక్కల ప్రాంతాల అభివృద్ధి, ఆర్థిక, రవాణా ప్రణాళిక ద్వారా దీనిని సాధించనున్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన–అర్బన్ పథకం కింద వచ్చే ఐదేళ్లల్లో కోటి మంది పట్టణ పేదలు, మధ్య తరగతి కుటుంబాలకు గృహ నిర్మాణాలను చేయించనున్నారు. ఇందుకు బడ్జెట్‌లో రూ. 2.2 లక్షల కోట్ల నిధులను కేంద్రం అందించనుంది. ఇదే కాకుండా సరసమైన రేట్లతో రుణాలను కూడా అందించేందుకు వీలుగా వడ్డీ రాయితీని కూడా ప్రతిపాదించడం జరిగింది. అదే విధంగా పట్టణ ప్రాంతాల్లోని భూముల రికార్డులన్నీ డిజిటలీకరించనున్నారు. ఇందుకు రాష్ట్రాలకు కూడా అవసరమైన తోడ్పాటును కేంద్రం అందించనుంది. స్వచ్ఛతకు కేంద్రం పెద్దపీట వేసింది. బడ్జెట్ స్వచ్ఛ భారత్ మిషన్‌కు గత ఏడాది రూ. 9,550 కోట్లు కేటాయించగా ప్రస్తుతం రూ. 12,192 కోట్లు కేటాయించింది. దేశంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో బహిరంగ మల మూత్ర విసర్జనను పూర్తిగా అరికట్టడం, ఘన, జల వ్యర్థాల నిర్వహణను కూడా తెచ్చింది. స్వచ్ఛతనే లక్ష్యంగా స్వచ్ఛభారత్ మిషన్ పని చేస్తోంది.




**డా. ఎన్. యాదగిరిరావు**

అదనపు కమిషనర్, హైదరాబాద్ మహానగర పాలక సంస్థ(జీహెచ్ఎంసీ)

**ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో భాగ్యనగర్‌లో నెక్లెస్ రోడ్డులోని జలవిహార్‌లో లోక్‌మంథన్ భాగ్యనగర్ 2024 సన్నాహక సభ ఆగస్ట్ 10న జరిగింది. ఈ కార్యక్రమానికి వక్తగా 'ఋషిపీఠం' మాసపత్రిక సంపాదకులు, సమన్వయ సరస్వతీ బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ చేసిన ప్రసంగం యథాతథంగా....**



# జానపదం...

"వందే భారత మాతరమ్.. లోకమంథన్ పేరు మనదైన ఒకానొక సంస్కృతి ప్రవాహాన్ని మధ్యప్రదేశ్‌లో ప్రారంభించి, ఇప్పుడు హైదరాబాద్ వైపు ప్రయాణించేటట్టు చేసిన శుభవేళ ఇది. మన సంస్కృతి ఫోక్ కాదు లోక్ అని ఎలాగూ నినాదం చేశారు. దాడులు చేసినటువంటి వారు క్రమంగా విభాగాలు, విభజనలు చేస్తూ వైవిధ్యాలను వైరుధ్యాలుగా చిత్రీకరించారు. దానివల్ల వచ్చిన ప్రమాదాలతో మన సంస్కృతిని మనం విస్మరిస్తున్నాం. వలసవాదులు మొదలైన వారు ఎవరైతే ఇక్కడ దాడి చేసి, విభాగాలు ఏర్పాటు చేయాలని ప్రయత్నించారో, అక్కడ సంస్కృతి పనికిరాదని, అనాగరికమైనదన్న ముద్ర వేయడమే కాకుండా, వారిని తమలోకి మార్చే ప్రయత్నం చేయడమో, లేక.. నాగరికత అని అనుకుంటున్న దానిని వారిపై రుద్దడానికో ప్రయత్నించి, ఎందర్నో నశింపజేశారు కూడా.

అలాగే అమెరికా, ఆస్ట్రేలియా వైపు దండయాత్రలకు వెళ్లినపుడు, దాడి చేసినపుడు అక్కడున్న నాగరికతలను కూడా అనాగరికమని, ఆటవికమన్న ముద్ర వేసి, క్రమంగా మిగలకుండా ధ్వంసం చేశారు. వారికి నాగరికత నేర్పుతామన్న పేరుతో కొత్త అంటురోగాలు అంటించారు. వారి వల్ల వచ్చిన అంటు రోగాల గురించి ఆలోచిస్తే.. మన దేశంలో కూడా ఇప్పుడున్న మలేరియా, కలరా లాంటివి ఈ దేశపు జబ్బులు కావు. ఇతరులు వచ్చి, మనకు అంటించిన జబ్బులు అని మనం అనుకోవాలి. వారు ఎక్కడ దండయాత్రలు వెళ్లినా, అక్కడి నాగరికతను అంగీకరించరు. దీనికి మానసిక రోగమని పేరు పెట్టాలి. అదో సిండ్రోమ్. అంటే వారు తప్ప ఇతరులు పనికిరారన్న భావంతో వారు అన్ని దేశాలకు వెళ్లి, అక్కడున్న నాగరికతలను కాలరాశారు. ఇలాగే భారత్‌లో కూడా చేయాలని ప్రయత్నాలు చేశారు. కానీ అలా చేయలేకపోయారంటే ఈ దేశంలో ఎన్నో రకాల సంస్కృతులు ఉన్నప్పటికీ అన్నింటికీ ఏకసూత్రంగా ఒక సనాతన ధర్మం ఉంది కాబట్టే వారి ఆటలు సాగలేదు. ఇప్పుడు మనం కొన్ని ఆటవికమైన, మనదైన ప్రాచీన జానపద సంస్కృతులు... అంటే ఫోక్, లోక్ అనే దానికంటే మనం జానపదం అని పేరు పెట్టుకున్నాం. ఈ సంస్కృతులు ఏవైతే ఉన్నాయో... అవి మచ్చుకైనా మిగిలి ఉన్నాయి. మిగిలిన దేశాలలో నశించిపోయాయి. అంటే వీటన్నింటికీ ఏక సూత్రం ఏమిటంటే సనాతన ధర్మం. దీనిని మనం గ్రహించాలి.

ఇక ఇప్పుడు మరో కుట్రకు తెర లేపారు. దేశంలో ఉన్న అనేక ఆటవిక, గిరిజన ఇత్యాది జాతుల వారిని మన సంస్కృతికి, ధర్మానికి వీరు వేరని చెప్పే ప్రయత్నాలు చేస్తూ.. వారిని మతం మార్చే ప్రయత్నాలు చేస్తున్నారు. వారికి నాగరికతను, వైద్యాన్ని నేర్పి, వారిని అభివృద్ధిలోకి తేవాలని అంటున్నారు. నిజానికి ఈ గిరిజనులకు ఉన్న అభివృద్ధి నాగరికులకు లేదని చెప్పడానికి నేను వెనకాడటం లేదు. లోక్ మంథన్ అన్నప్పుడు... ఈ లౌకికమైన కల్చర్ గురించి మాట్లాడేటప్పుడు కేవలం నాట్యం, సంగీతం, కళలు వీటి గురించే మాట్లాడుతున్నాం. కానీ.. ఇంకోటి కూడా భాగ్యనగర్ లోకమంథన్ తీసుకురావల్సింది. కళలు, సంస్కృతి మాత్రమే కాకుండా.. జానపద గిరిజన విద్యలు, వారి జ్ఞానాన్ని తీసుకురావాలి. అది తెలుసుకోవాలి. ఆ జ్ఞానాన్ని పరిశీలిస్తే ఆశ్చర్యపోతాం.

చికిత్స లేని అనేక భయంకర రోగాలను అడవిలో ఏ ఆకు పసరుతో, ఏ దుంపతో పోగొట్టుకోవచ్చో వారికి తెలుసు. ఇంకా అధునాతన వైద్య విజ్ఞానం కూడా అందుకోలేని శిఖరాలను అది అందుకుంది. ఆ గిరిజన ప్రాంతాల్లో చికిత్స విధానాలని మనం మోటు, నాటు చికిత్సలు అంటున్నాం. అయితే.. నాటు అన్న పదం సరిపోతుంది. అంటే దేశీయమైన అని అర్థం. అలాగే వారి భాష అనాగరికం అనుకుంటాం కానీ.. అందులో చాలా అందాలున్నాయి. వారి ఆచారాలు, వ్యవహారాలు, వివాహాలు ఉన్నాయి. వీటిని మనం గ్రహిస్తే.. శరీరాన్ని పుష్టినిచ్చి, ధాతు పుష్టినిచ్చే ఆహార నియమాలు వారి దగ్గర ఉన్నాయి. అవి అర్థం చేసుకోలేక.. అవి అనారోగ్యకరమన్న భ్రాంతిలో వాటిని తొలగించి, ఈ జబ్బులు కలిగించే రకరకాల ఆహారాలు అలవాటు చేస్తున్నారు నాగరికులు. వీరే వారికేదో నాగరికత నేర్పుతామని బయల్దేరుతున్నారు.

కానీ ఏది పుచ్చుకుంటే ఆరోగ్యంగా ఉండగలమో వారికి తెలుసు. అలాగే వారి దగ్గరున్న జ్యోతిర్విజ్ఞానం. అంతరిక్షంలో కనిపించే నక్షత్ర గమనాన్ని ఆధారం చేసుకొని జీవన విధానాన్ని ఏర్పాటు చేసుకుంటారు. కొన్ని గిరిజన జాతులైతే.. ఆకాశంలో ఫలానా చోట, ఫలానా సమయంలో నక్షత్ర గుంపు ఉంటుందని చెప్పి, రాట నాటే ముహూర్తాలు పెడతారు. పంచాంగాలు చూసి కాదు.. ఆకాశంలో ఫలానా నక్షత్రాల గుంపు ఇక్కడికి వచ్చినప్పుడు రాట నాటితే మంచిదంటారు. ఎంత గొప్పగా ముహూర్తం పనిచేస్తుందంటే... ఆ సమయంలో రాటను రాతిమీద పెట్టినా నాటుకుంటుంది. అంటే..కేవలం సంగీతం, పాటలు, నాట్యం మాత్రమే కాకుండా వైద్య జ్ఞానం, అంతరిక్ష విజ్ఞానం కూడా ఉన్నాయి. అయితే.. ఇదంతా సనాతన ధర్మానికి సంబంధించినది కాకుండా... వారంతట వారు ప్రత్యేకంగా ఉన్నారని భావించడానికి వీల్లేదు. దీని వెనుక ఓ సనాతన ధర్మసూత్రం ఉంది. అందుకే మా గురువు గారు సద్గురు శివానందమూర్తి గారు అశ్వమేధయాగం మొదలుకొని, అంకాలమ్మ జాతర వరకు భారత్ మొత్తం ఒకే సూత్రంతో ముడిపడి ఉంది అన్నారు. వారి వాఙ్మయాన్ని మనం పరిశీలించినా వైదిక మూలాలు గోచరిస్తాయి.

వేద సంస్కృతి ఈ సమాజాన్ని ఒకే భగవంతుడి స్వరూపంగా భావించింది. "నమ: పుంజిష్టేభ్యో.. నిశాదేభ్యశ్చమోనమోనమ:" అంటూ "ఉపవీతాయ కృత్సువీతాయ.." ఇలాంటి శబ్దాలతో.. ఉపవీతుడై.. అంటే యజ్ఞోపవీతం ధరించే బ్రాహ్మణుడు, వ్యాపారం చేసే వాణిజ్యవేత్త మొదలుకొని, పాలించే క్షేత్ర పాలకుడు మొదలుకొని, వేటగాడు, వ్యవసాయదారుడు, కుమ్మరి, కొమ్మరి అందరూ కలిపి ఒకే భగవత్ స్వరూపం అన్న భావన వేదాల్లోనే మనకు కనిపిస్తుంది. "నమ: కులాలేభ్య: కర్మారేభ్యశ్చవోనమ:" అంటే వివిధ జీవన విధానాలే చెప్పారు కానీ... ఒకటి ఎక్కువ, ఒకటి తక్కువ అని లేదు. అందరికీ ఒక్కో



# జ్ఞానపథం

విధానం ఇచ్చారు. అంతస్సూత్రం మాత్రం సనాతన ధర్మమే. అందుకే జానపద కళారీతులను పరిశీలిస్తే.. వారు పాడే పాట, ఆడే ఆట, పలికే మాట... అన్నిట్లోనూ సనాతన ధర్మ పరంపరే గోచరిస్తుంది.

మణిపురి నృత్యాన్ని పరిశీలిస్తే.. వీరు చేసినంతగా మిగతా వారు చేయలేరు. వారు పెద్ద పెద్ద డప్పులు తీసుకొని, ఆడుకుంటుంటే.. అన్నీ మనవే కనిపిస్తాయి. ఉపాసన పద్ధతిలో కూడా అంతే. భగవంతుడ్ని ఓ ఆటవికునిగా ఉపాసించిన సంస్కృతి మనది. ప్రారంభంలో మనం ఓ శ్లోకం చదువు కున్నాం... "విహరిత పుళిందయోషా.. గుంజా భూషా.. ఫణీంద్ర కృతవేషా" అని. ఇందులో పుళిందయోషా అంటే.. ఓ ఆటవిక స్త్రీ. ఈ రూపంలో వున్న అమ్మవారికి నమస్కారం చేస్తున్నా అని మూకకవి అంటారు. అంటే.. ఆటవికంగా కూడా అమ్మవారిని దర్శించామంటే.. తక్కువ కాదు. భగవంతునితో సమానంగానే భావించారు. అందుకే భారతీయ సంస్కృతిలో కేవలం నగరవాసులే కాకుండా అడవుల్లో సంచరించే వారు కూడా ఒక ధర్మం, ఒక పరంపర, ఒక విద్య, సంస్కృతి కలిగిన వారని దీనిని బట్టి తెలుస్తుంది. వేదికపై వున్న అందరిలోనూ భగవంతుడే కనిపించాడు.

"పరమేశ్వరుని వేషం ఎలా ఉందంటే..తలపై జాబిలి నెమ్మిపించయము.. వేదశ్వానముల్ ముందు... అమ్మలున్ ముమ్మొనరింటివద్దయు.. కరాంభోజాతయుగ్మమ్మునన్... మలరాకూతురు బోయసాని"

కొండల రాజ కూతురు పార్వతి. కొండల రాజ కూతురు శబరీ వేషం ధరించింది. దానికి తగ్గట్టు ఆది శబర వేషం పరమేశ్వరుడు ధరించాడు. దీనికి సంబంధించిన కొన్ని శ్లోకాలు, మంత్రాలున్నాయి. శైవం వైపు మాత్రమే కాదు.. వైష్ణవం వైపు కూడా. చెంచులక్ష్మి ఎక్కడి నుంచి వచ్చింది? నరసింహస్వామి వచ్చింది. చెంచతా నరహరి.. అన్న పదాలు జాన పదాల నుంచే పుట్టాయి.

అలాగే జానపదుల భాషల్లో... "వెట్టి వలపు చల్లకూ విష్ణుమూరితీ...నాను వెట్టతీర మాటాడూ విష్ణుమూరితీ...." ఈ విష్ణు మూరితీ అన్న దానిని జానపదుల నుంచి తీసుకొని, అన్నమయ్య అదే ప్రభావంతో తన సంకీర్తనల్లో చూపించారు. అలాగే "సంధ్యకాడపుట్టినట్టి ఛాయల పంట... ఎంత చందమాయెచూడరా చందమామ పంట..." ఇలా జానపదుల నుంచే తీసుకున్నాడు. వీటిలో మనకి సామాన్యుల జీవన విధానం కనిపిస్తుంది. సున్నిత సంస్కారాలు కనిపిస్తాయి. సున్నితమైన తాత్వికత, భక్తి అన్నీ కనిపిస్తాయి. ఇవేవీ వేదజనిత సనాతన ధర్మానికి విరుద్ధం కాదు. ఎందుకంటే వేద మంత్రాలు కూడా అడవిలో తపస్సులు చేసిన మహర్షులు తపో దృష్టికి గోచ రించాయి కనుక.. అరణ్యాలలో జీవించే గిరిజనులకీ, అరణ్యాలలో తపస్సులు చేసిన మహర్షులకి కనిపించే సత్యం ఒక్కటే అదే సనాతన ధర్మ సంస్కృతి. దీనిని ఆధారంగా చేసుకొనే విస్తరించాయి.

ఇక్కడ సంస్కృత భాష అయినా, జానపద భాష అయినా... భారతీయ హృదయ ఘోష ఒక్కటే. భావం ఒక్కటే. ఈ విధమైన పరిశీలన, పరిశోధన చేయ డానికి లోకమంథన్ కార్యక్రమాలు సహకరించాలి. ఇవి నగరాల్లో జరుగుతున్నప్పటికీ, మనమందరమూ కూడా గిరిజన సంస్కృతిని కాపాడి, అధ్యయనం చేయాలి. రీసెర్చ్ సెంటర్లు ఏర్పడాలి. వాటి ద్వారా ప్రకృతి విలువ తెలుసుకోవచ్చు. ప్రకృతితో కలిసి జీవించే వారు ఆటవికులు.అందుకే ప్రకృతితో కలిసి జీవించేవారి వల్లే ఔషధాలు, పరిష్కారాలు పొంద వచ్చు. అనేక జీవన విలువలతో వుంటారు. కట్టు ఉంటుంది. దాని ద్వారానే జీవిస్తారు. దానికే కట్టు బడతారు. వారికీ కుటుంబ విలువలు, సంస్కారా లున్నాయి. భారతీయ సంస్కృతి ఏమిటంటే.. మేము గొప్పవారం కనుక.. మాలాగా మారండని చెప్పదు. వారిలాగే వారిని బతక మంటోంది. అదే గొప్పదనం. అదే వైవిధ్యం. భాషలు, రాష్ట్రాలు ఎన్ని వున్నా... అందరూ "భరత వర్షే.. భరత ఖండే" అని చెప్పుకున్నాయి. ఇన్ని రాజ్యాలు కలిసి ఒకే భారతదేశం అంటున్నాం. అఖండ భారత వర్షంలో హిమాలయం మొదలుకొని, సేతువు వరకు.. అరణ్యం, నదీ తీరాల్లో జీవిస్తున్న వారు, సహజ జీవనం సాగిస్తున్న వారే శబరులు. వారే ఆటవికులు. ఆరణ్యకులు. వారి సంస్కృతిని గౌరవిం చాలి. ఇవన్నీ కలిసే ఉంటాయి. వేర్వేరుగా ఉండదు.

మనం ఆరాధించే అమ్మవారు, కృష్ణుడే వివిధ పేర్లతో అక్కడా ఉంటారు. కాట్రేడు అన్న పేరుంది, చిత్తూరు ప్రాంతంలో. కాట్రేడు జాతర అన్న దానిని ధూర్జటి అద్భుతంగా వివరిస్తాడు. అక్కడున్న ఆటవికులు పట్టుబట్టలు కట్టరు. అక్కడున్న నారవస్త్రాలే ధరిస్తారు. ఎంత సంపన్నులైనా కిరీటాలు పెట్టుకోరు. కేవలం నెమలి పింఛాలే ధరిస్తారు. డబ్బులున్నా... బంగారు కిరీటాలు పెట్టుకోరు. తమ పద్ధతే అందమయ్య అని చెప్పడం. ప్రతిదానికీ అందం ఉందని చెప్పవచ్చు. కాట్రేడు అంటాం మనం. కాటిరేవు అంటే అడవికి రాజు. కాట్రేడు అన్నది పల్లె భాష.

ఈ మధ్య హిమాచల్ ప్రదేశ్‌లో ఓ సన్యాసే చెప్పారు. మనం వేదాల్లో, పురాణాల్లో వినని దేవతలెందరో హిమాచల్‌ప్రదేశ్, హిమా లయాల్లో పూజలందుకుంటారు. అందుకే ఈ సంస్కృతి వేరు, వేద సంస్కృతి వేరు అని చెప్పారు. అదే అజ్ఞానం. వేదాల్లో, పురాణాల్లో ఎంత మంది దేవతల పేర్లు చెప్పారో ఎవరికి తెలుసు? యక్షులు, గంధర్వులు ఇలా... అన్నీ ఆటవికుల్లో కనిపిస్తాయి. వాటన్నింటినీ అధ్యయనం చేయాలి. వాటిలో వున్న గొప్పతనాన్ని తెలుసుకుంటూ ఉండాలి. అయితే వారికి మనం కొత్త నాగరికత చెప్పాల్సిన అవసరం లేదు. వారిని ఆదరిస్తే చాలు. వారిని గౌరవిస్తే చాలు.

స్వాతంత్రం సిద్ధించి 75 సంవత్సరాల తర్వాత ఈ వాసన వస్తోంది. అందుకే పద్మశ్రీ బిరుదు వచ్చినా..దాసరి కొండప్ప గారు తన వేషధారణలోనే వచ్చారు. ఏమాత్రం మార్చుకోకుండా తంబురా పట్టుకొని కూర్చున్నారు. ఆయనలో తలపాగా కట్టుకున్న శివుడు కనిపించాడు. ఇది మన జానపద సాహిత్యం. ఈ జానపదం అన్న పదాన్ని ఎప్పుడో సృష్టించుకున్నాం. భారత్‌లో ఎన్ని సంస్కృతులు, ఎన్ని భాషలున్నా... వాళ్లు ఆటవికులైనా, నాగరికులైనా.. పల్లియులైనా.. ఒకే సంస్కృతి వారసులు అని తెలుసుకొని, ఈ ధర్మంతో, ఈ సంస్కృతితో వారిని ఎవ్వరూ వేరుచేయలేరు అన్న భావన దృఢపడి, భారతీయుల ఐక్యత వర్ధిల్లాలి. కేవలం ఓట్లు దండుకోవడం కోసం కుల గణన, ప్రాంత విభాగాలు చేయడం కాదు.

ఒక్కొక్క దానిని పరిశోధించడం కోసం, దాని ప్రత్యేకతను తెలుసుకొని, భారత జాతి అంతా ఒకే జాతి అని తెలుసుకునే స్థితి వైపు వెళ్లడానికే ఈ లోకమంథన్ కార్యక్రమాలు ఉద్యమించాలని, సఫలీకృతం కావాలని కోరుకుంటూ... స్వస్తి.

– జాగృతి డెస్క్

## కథ

రెండు బిల్డింగ్స్ మధ్యన ఉన్న ఖాళీస్థలం ఇది. ముందు, వెనుక వీధులు ఉన్నాయి. ఆ వీధుల్లోని పిల్లలంతా చేరి ఆటలు ఆడుకోవడానికి అనువుగా ఉంది. కానీ, ఆదివారం సాయంకాలం అయినా కూడా ఖాళీగా కనిపిస్తోంది.

వెనుక వీధికి, స్థలానికి మధ్య ఒక గోడ ఉంది. ఆ గోడను ఆనుకొని ఒక పెద్ద వేప చెట్టు పెరిగింది. ఆ చెట్టు నీడలో, గోడ మీద హర్ష ఒక్కడే కూర్చొని ఉన్నాడు. క్రికెట్ బ్యాట్‌ని రెండు చేతులతో పట్టుకొని, స్థలం వైపే నిరాశగా చూస్తున్నాడు.

పదకొండేళ్ల హర్షకి క్రికెట్ ఆడటమంటే చాలా ఇష్టం. చిన్నప్పుడు నుండి ప్రతిరోజు సాయంకాలం తన స్నేహితులతోనో లేదా తన వీధిలోని తోటి పిల్లలతో కలిసి ఆడేవాడు. బ్యాటింగ్, బౌలింగ్ రెండు అద్భుతంగా చేస్తాడు. తన ఆట తీరు చూసి పిల్లలంతా కేరింతలు కొడుతుంటే రెట్టింపు ఉత్సాహన్ని కనబరిచేవాడు. తనతో పోటీపడలేక మిగతా పిల్లలంతా చతికిలపడేవారు. అలాంటి వాడు ఇప్పుడు దాదాపు నెల నుండి ఒక్కసారి కూడా క్రికెట్ ఆడలేదు. ఆ అవకాశం రాలేదు.

ఈ రోజైన ఆడుకోవాలని హర్ష సంతోషంగా బ్యాట్ తీసుకొని ఇంట్లో నుండి బయలుదేరాడు. ఎలాంటి షాట్లు ఆడాలి, ఎలాంటి బౌలింగ్ వెయ్యాలి అని ఆలోచిస్తూ వచ్చాడు. స్థలం దగ్గరికి రాగానే తన సంతోషం ఆవిరైంది. ఆశ కోల్పోకుండా ఎదురుచూడాలని నిశ్చయించుకున్నాడు. రెండు గంటల నుండి ఎదురుచూస్తునే ఉన్నాడు. ఒక్కరు కూడా రాలేదు. తనలో ఆశ సడలింది.

సూర్యాస్తమయ సమయం దగ్గరపడింది. అది గమనించిన హర్ష దిగులుగా తలదించి, కళ్లు మూసుకొని బాధపడుతూ ఒక్క క్షణంపాటు కూర్చున్నాడు. తర్వాత పైకి లేచి, బ్యాట్ తీసుకొని ఇంటికి బయలుదేరాడు. స్థలం మొత్తం దాటుకొని ముందు వీధి దగ్గరికి వచ్చాడు. స్నేహితులందరితో కలిసి ఆడుకొని, సంతోషంగా ఇంటికి బయలు దేరాల్సిన వాడు దిగాలుగా స్థలం దాటి వీధిలోకి అడుగుపెట్టాడు.

వీధిలో కొంచెం ముందుకు రాగానే, తనతో స్నేహితులల్లో ముగ్గురు పక్క వీధిలో ఉంటారని గుర్తొచ్చింది. వాళ్లు ఎందుకు రాలేదో తెలుసుకోవాలని అనిపించి వెంటనే వాళ్ల వైపుగా సాగాడు.

మొదటి స్నేహితుడి ఇంటికి వచ్చాడు. ఆ పిల్లవాడి ఇంట్లో లేడు. కాస్త ముందుకు రాగానే రెండో స్నేహితుడి ఇల్లు వచ్చింది. రెండో స్నేహితుడు కూడా ఇంట్లో లేడు. ఇంకాస్త ముందుకు వచ్చి, మూడో స్నేహితుడి ఇల్లు చేరాడు. మేడమీద ఉన్నాడని తెలుసుకొని పైకి వచ్చాడు.


మేడ మీదికి అడుగుపెట్టగానే ఆకాశంలో మెల్లగా కిందికి దిగుతున్న సూర్యుడ్ని చూశాడు. ఎర్రగా ఉన్న సూర్యుడు తన కళ్లకు పెద్ద బంతిలాగా కనిపించాడు.

ఎదురుగా ఉన్న గోడమీద తన స్నేహితులు అటు వైపుగా కూర్చొని ఉన్నారు. తన మూడో స్నేహితుడితో పాటు మిగతా ఇద్దరు స్నేహితులు కూడా ఉన్నారు. ముగ్గురు కలిసి తదేకంగా ఒక



# ఆటస్థలం

సి. కుమార యశస్వి





వైపే చూస్తున్నారు. హర్ష వచ్చింది కూడా గమనించుకోలేదు.

వాళ్లు ఏం చేస్తున్నరనే సందేహంతో హర్ష దగ్గరిగా నడిచాడు. రెండు అడుగులు ముందు వెయ్యగానే ముగ్గురు ఆనందంతో కేరింతలు కొట్టారు. అది చూసి వాళ్లు ఫోనులో ఆట ఆడుతున్నారని అర్థమైంది. మధ్యలో కూర్చున్న అబ్బాయి ఫోను ఆడుతుంటే పక్కనున్న ఇద్దరు ఆసక్తిగా ఆట వైపే చూస్తున్నారు. ఇంతకి ఏం ఆట ఆడుతున్నారో చూద్దామని దగ్గరికి వెళ్లి ఫోనులోకి తొంగి చూశాడు హర్ష ఆశ్చర్యపోయాడు. వాళ్లు క్రికెట్ ఆడుతున్నారు. ఆటలో ఫోర్ లేక సిక్స్ పడినప్పుడు ఆనందపడిపోయి కేరింతలు కొడుతున్నారు. హర్ష చలనం లేకుండా నిలబడిపోయాడు.

"హర్ష నువ్వెప్పుడు వచ్చావు?" అని ఒక స్నేహితుడు ఆశ్చర్యంగా అడిగాడు.

ఉలిక్కిపడి హర్ష తన స్నేహితుడి వైపు చూసాడు. మిగతా ఇద్దరు పిల్లలు కూడా హర్ష వైపు చూసి 'హాయ్' అని నిర్లిప్తంగా చెప్పి తిరిగి ఫోనులోకి మునిగిపోయారు. పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఆడగలిగిన ఆటను ఫోనులో ఆడుతుండటం చూసి హర్షకి కోపం వచ్చింది.

"ఫోనులో ఎందుకు ఆడుతున్నారు?"

"ఏంటి?" హర్ష దేని గురించి చెప్తున్నడో అర్థంకాక తన స్నేహితుడు అడిగాడు.

"క్రికెట్. నిన్న నేను స్కూల్లో చెప్పింది గుర్తులేదా?"

"ఏం చెప్పావ్?"

ఆ ప్రశ్న వినగానే హర్ష కంగుతిన్నాడు.

శుక్రవారం సాయంకాలం తన నాన్నతో కలిసి బండి మీద ఒక వీధి నుండి వెళ్తుంటే ఒక ఖాళీ స్థలాన్ని చూశాడు. ఆ స్థలాన్ని చూడగానే అక్కడ ఆడుకోవచ్చని అనే ఆలోచన వచ్చింది. తన నెల రోజు ఎదురు చూపునకు ముగింపు పడినట్టు అనిపించి సంబరపడ్డాడు.

మరుసటి రోజు, అంటే శనివారం, స్కూల్‌కి వెళ్లి ఆ స్థలం గురించి తన స్నేహితులకి చెప్పాడు. రేపు సాయంకాలం క్రికెట్ ఆడేందుకు రండి అని అందరిని పిలిచాడు. అందరు వస్తామని చెప్పారు. దాంతో కొదవలేని ఆనందాన్ని పొందాడు. అప్పటి నుండి సాయంకాలం ఇంటి నుండి బయలుదేరే వరకు 'ఎప్పుడెప్పుడు సాయంకాలం అవుతుంది. ఎప్పుడెప్పుడు ఆడుతానా' అని ఆరాటపడ్డాడు.

"ఆడుకునేందుకు రమ్మని చెప్పా కదా! అందరిని పిలిచానుగా.."

"ఓ..!" తన స్నేహితుడికి గుర్తోచింది.

"..మీరు కూడా వస్తామన్నారుగా.."

"అన్నాము కానీ...."

"...మనం క్రికెట్ ఆడక ఎన్ని రోజులైంది. మీకు ఆడాలని లేదా?"

"లేదు" అని తన స్నేహితుడు గట్టిగా చెప్పాడు. హర్ష నివ్వెరపోయాడు.

"ఆడాలనే ఆసక్తి పోయింది. నిన్న వస్తాము అని చెప్పాము కానీ ఈ రోజు రాబుద్ధి కాలేదు. పైగా మన క్లాసులో అందరం ఫోనులో పోటీ పెట్టుకున్నాం. అందుకే రాలేదు"

హర్ష ఏమి మాట్లాడకుండా నిలబడి తన స్నేహితుడి వైపే చూస్తున్నాడు. తన ఎదురుగా ఆకాశంలో సూర్యుడు పూర్తిగా అస్తమించాడు. మెల్లగా చీకటి ఆకాశం మొత్తం కమ్ముకుంటోంది.

* * *

హర్ష నిరాశగా వెనక్కి తిరిగి గబగబా అక్కడి నుండి తిరుగుముఖం పట్టాడు. తన స్నేహితుడు పిలుస్తున్నా పట్టించుకోలేదు. వీధిలో నుండి పెద్ద రోడ్డు మీదకి వచ్చాడు. రోడ్డు వాహనాలతో చాలా రద్దీగా ఉంది. హర్షకు ఆ శబ్దాలు వినపడటం లేదు. తన మనసు నిండా అనేక రకాల ఆలోచనలు నడుస్తున్నాయి. ప్రతి ఆలోచన ఇక పై తను క్రికెట్ ఆడలేడేమో అనే అనుమానాన్ని రేకెత్తిస్తున్నాయి. ఆ అనుమానం ఏదో తెలియని భయానికి దారి తీసింది.

వెంటనే తన బ్యాట్‌ని గుండెలకి గట్టిగా హత్తుకున్నాడు.

కొంతదూరం అలానే నడుచుకుంటూ వస్తుండగా హర్షకి ఒక షాపింగ్ మాల్ కనిపించింది. అది సుమారు అయిదు మేడల ఎత్తు, రెండు మేడల వెడల్పుతో ఉంది. జనాల కళ్లని తిప్పుకునేల బయట మొత్తం రంగురంగుల లైట్స్ వెలుగుతున్నాయి. జనాలు లోపలి వెళ్తున్నారు, బయటికి వస్తున్నారు. అందరి ముఖాల్లో ఆనందం ఉంది.

రెండు సంవత్సరాల క్రితం ఇదే స్థలంలో హర్ష తన మొదటి అర్ధశతకం చేసాడు. వరసగా తన టీం మొత్తం విఫలమవుతుండగా, తను మాత్రం స్థిరంగా నిలబడి గెలిపించాడు. ఆ గెలుపును తన టీం సభ్యులే కాకుండా తన స్నేహితులంతా మెచ్చుకున్నారు. ఒక రోజున ఉన్నట్టుండి స్థలం మొత్తం గుంతలు తీసిపెట్టారు. వాకబు చెయ్యగా మాల్ కడుతున్నారని తెలిసింది. చేసేది లేక నిస్సహాయులుగా వెనుదిరిగారు.

మాల్ నుండి ముందుకు నడిచాడు హర్ష. ఇంకాస్త ముందుకు వెళ్లగా ఒక అపార్ట్‌మెంట్ కనిపించింది. ఆ స్థలంలో కూడా తను ఆడిన ఆట గుర్తొచ్చింది. అక్కడ తను, తను ఇందాక మాట్లాడిన స్నేహితుడు ఇద్దరు కలిసి పోటాపోటీగా ఆడారు. హర్ష టీం ఆ ఆట గెలవకపోయినా, తన స్నేహితుడి ఆటను చూసి చాల ఆనందించాడు. అక్కడి నుండి ఇంకొంచెం ముందు వెళ్తే ఇంకోటి, ఇంకొంచెం వెళ్తే మరొకటి. అలా తన జ్ఞాపకాల గుర్తులన్ని తారసపడుతూనే ఉన్నాయి. అవన్నీ తలుచుకొని తన బాధ పెరిగింది.

నాలుగైదు సంవత్సరాల ముందు వరకు హర్ష తన ఇంటి చుట్టూ పక్కల ఉండే ఖాళీ స్థలాల్లో క్రికెట్ ఆడేవాడు. మెల్లమెల్లగా ఆ ఖాళీ స్థలాలను రియల్ ఎస్టేట్ వాళ్లు హస్తగతం చేసుకొని ప్లాట్లుగా మార్చి అమ్మడం మొదలుపెట్టారు. వాటిని జనాలు కొని అక్కడ ఇల్లో, అపార్ట్‌మెంటో కట్టడం ప్రారంభించారు. అప్పటికి హర్షకి తన స్నేహితులతో కలిసి ఆడుకోవడానికి స్థలాలకి కొదవలేదు. సంతోషంగా వెళ్లి ఇంకోచోట ఆడుకునేవాళ్లు.

మాల్ నుండి ముందుకు నడిచాడు హర్ష. ఇంకాస్త ముందుకు వెళ్లగా ఒక అపార్ట్ మెంట్ కనిపించింది. ఆ స్థలంలో కూడా తను ఆడిన ఆట గుర్తొచ్చింది. అక్కడ తను, తను ఇందాక మాట్లాడిన స్నేహితుడు ఇద్దరు కలిసి పోటా పోటీగా ఆడారు. హర్ష టీం ఆ ఆట గెలవక పోయినా, తన స్నేహితుడి ఆటను చూసి చాల ఆనందించాడు. అక్కడి నుండి ఇంకొంచెం ముందు వెళ్తే ఇంకోటి, ఇంకొంచెం వెళ్తే మరొకటి. అలా తన జ్ఞాపకాల గుర్తులన్ని తారసపడు తూనే ఉన్నాయి. అవన్నీ తలుచుకొని తన బాధ పెరిగింది.




కానీ, మూడేళ్ల నుంచి పరిస్థితి మరీ కష్టంగా మారింది. ఒక స్థలం పోయిన ఇంకో స్థలం ఉంది ఆడుకుందాం అనుకున్న నెలరోజుల లోపు ఆ స్థలంలో కూడా ఏదో ఒక్కటి కట్టడం మొదలుపెట్టేవారు. అలా హర్ష ఇంటి చుట్టూర మాత్రమే కాక ఆ ప్రాంతంలో ఉన్న స్థలాలన్నీ కట్టడాలతో నిండిపోయాయి. గత్యంతరం లేక రెండు రోజులు వీధులల్లో ఆడారు. మూడో రోజు చుట్టూ ఇళ్లలో వాళ్లు తిట్టారు. అప్పటి నుండి ఆడుకోవడానికి ఖాళీ స్థలాలను వెదకడం ప్రారంభించాడు హర్ష. అనువైన స్థలం దొరికినప్పుడు, తన స్నేహితులని పిలిచి, ఆడుకొని తృప్తి పడేవాడు. రెండు రోజులకి ఏదో ఒక సమస్య వల్ల ఆడుకోవడానికి అడ్డంకి ఏర్పడేది. ఊరికంటూ ఒక మైదానం అయితే ఉంది కానీ అది చాలా దూరంలో ఉంది. అంత దూరం ఇంట్లో వారు వద్దు అనేవారు. దాంతో ఆడుకోవడానికి చోటే లేకుండాపోయింది. ఆ కారణంగా చాలా మంది హర్ష స్నేహితులు ఆడుకోవడం మానేశారు. ప్రత్యామ్నాయంగా ఫోనులల్లో గేమ్స్ వైపు మొగ్గుచూపారు. కానీ హర్ష మాత్రం ఆ పని చెయ్యలేదు. క్రికెట్ ఆడటం ఆపేసినందుకు బాధ పడ్డాడు, ఆడే సమయం ఎప్పుడు వస్తుందా ? అని ఎదురుచుసాడు, అంతేగానీ ఫోను గురించి ఎప్పుడు ఆలోచించలేదు. తనకు అంత ఇష్టం నలుగురితో కలిసి ఆడుకోవడం అంటే.


హర్ష నడుచుకుంటూ ఒక పార్క్ దగ్గరికి చేరాడు. తన స్నేహితులల్లో చాలా మంది ఆ పార్క్ చుట్టూ పక్కల ఉంటారు. వారిలో ఎవరైనా కనిపిస్తారేమో కనీసం వాళ్లనైనా ఆడుకునేందుకు రమ్మని అడుగుతాం అనుకొని పార్క్‌లోకి అడుగుపెట్టాడు. లోపల కొందరు పిల్లల గుంపులుగా కూర్చోని ఎవరి ఫోనులల్లో వాళ్ళు లీనమైపోయి రకరకాల ఆటలు ఆడుకుంటున్నారు. ఆ గుంపులల్లో తన వయసు వారు చాలా మందే ఉన్నారు. హర్ష పార్క్ అంతా తిరిగి అందరిని గమనించాడు. ఫోనులో ఆటలు ఆడుతున్న అందరు చాలా సంతోషంగా, ఉత్సాహంగా ఉన్నారు. వాళ్ళని చూడగానే తను ఏం చేయాలో తనకు అర్థమైంది. వెంటనే పార్క్ నుండి బయటికి వచ్చాడు. ఇంటి వైపు నడిచాడు.

చివరికి హర్ష తన ఇల్లు ఉండే వీధికి చేరాడు. ఆ వీధి మొదట్లోనున్న ఒక చెత్తకుప్ప ముందు నిలబడ్డాడు. తన బ్యాట్ వైపు బాధగా చూసి దాన్ని గుండెలకి హత్తుకున్నాడు. తనకు ఏడుపు మొదలైంది. గుండెల నుండి బ్యాట్ తీయగానే తన కన్నీళ్లు బ్యాట్ మీద పడ్డాయి. వెంటనే బ్యాట్‌ని ఆ కుప్పలోకి విసిరేశాడు. అది ఎక్కడ పడిందో హర్ష కంటికి కనిపించలేదు. కన్నీళ్లు తుడుచుకొని ఇంటి వైపు వెళ్లిపోయాడు.

ఆకాశాన్ని చీకటి పూర్తిగా కమ్మేసింది. కానీ అందులో ఒక్క నక్షత్రం కూడా కనపడటం లేదు.




వచ్చేవారం కథ..
**ఆత్మశాంతి**
– గంగుల నర్సింహారెడ్డి






# క్రీడలంటే ఆటలే కాదోయ్..! కోట్లు, కీర్తిప్రతిష్టలు!

**క్రీడలు కూటికా, గుడ్డకా... ఆటలు అన్నం పెడతాయా... అనుకొనే రోజులు పోయాయి. క్రీడలే జీవితంగా, వృత్తిగా చేసుకొంటే కోట్లకు పడగలెత్తవచ్చునని, అంతులేని కీర్తి ప్రతిష్టలతో పాటు గొప్పగొప్ప ఉద్యోగాలు సంపాదించవచ్చునని నేటితరం క్రీడాకారులు చెప్పకనే చెబుతున్నారు. కాలంతో పాటే క్రీడాకారుల జీవన గమనమూ మారింది. క్రీడల్ని వృత్తిగా, శ్వాసగా మలుచుకొంటే సాధించలేనిది ఏదీ ఉండదని నేటితరం క్రీడాకారులు తమ అపూర్వ విజయాలు, రికార్డుల ద్వారా చాటి చెబుతున్నారు.**

క్రికెట్ నుంచి ఒలింపిక్స్ క్రీడల వరకూ... ఆటలు ఏవైనా అంతర్జాతీయ స్థాయికి చేరుకోగలిగితే జీవితమే మారిపోతుందనటానికి నేటితరం క్రీడాకారులే నిదర్శనం. క్రికెట్ శిఖరం సునీల్ గవాస్కర్, చదరంగ సమ్రాట్ విశ్వనాథన్ ఆనంద్, టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృత్ రాజ్, బ్యాడ్మింటన్ మేటి ప్రకాశ్ పదుకోన్, పరుగులరాణి పీటీ ఉష, బాక్సింగ్ క్వీన్ మేరీకోమ్ తరం క్రీడాకారుల నుంచి క్రికెట్ దేవుడు సచిన్ టెండుల్కర్, విరాట్ కోహ్లీ, పీవీ సింధు, లియాండర్ పేస్, నీరజ్ చోప్రా లాంటి ఆధునిక తరం క్రీడాకారుల జీవితాలను చూస్తే తరాలకు సరిపడిన సంపాదన, అంతులేని కీర్తిప్రతిష్టలు మనకు కనిపిస్తాయి.

**విజయాలు, పతకాల వెంటే నజరానాలు...**

ప్రపంచీకరణ పుణ్యమా అంటూ భారత క్రీడారంగ ముఖచిత్రమే మారిపోయింది. అత్యంత విజయవంతమైన క్రీడాకారుల స్థితిగతులు అనూహ్యంగా మారిపోయాయి. అంతర్జాతీయ క్రీడలు, ఒలింపిక్స్‌లో పతకాలు, రికార్డులు సాధించిన క్రీడాకారులను ఉన్నత ఉద్యోగాలు, కోట్ల రూపాయల కానుకలు ముంచెత్తుతుంటే.. క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నిస్, గోల్ఫ్, బాస్కెట్ బాల్, ఫుట్ బాల్ లాంటి ఆటలు క్రీడాకారుల పాలిట కల్పవృక్షంగా మారి పోయాయి. క్రికెట్‌నే నమ్ముకొని, అద ఏ ఊపిరిగా శ్రమించిన సచిన్ టెండుల్కర్, విరాట్ కోహ్లీ, మహేంద్రసింగ్ ధోనీ లాంటి ఆటగాళ్ల సంపాదన వెయ్యికోట్ల రూపాయలకు పైమాటే అంటే ఆశ్చర్యపోనక్కరలేదు.

భారత అనధికారిక క్రీడ క్రికెట్.. దేశంలోని ప్రతిభావంతులైన వందలాది మంది క్రికెటర్ల జీవితాలను రాత్రికి రాత్రే మార్చివేసింది. నిరుపేద, దిగువమధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన సచిన్, ధోనీ, విరాట్, రోహిత్, నటరాజన్, రింకూసింగ్, మహ్మద్ సిరాజ్ లాంటి క్రికెటర్లను కోటీశ్వరులుగా నిలబెట్టింది. ఇటీవలే ముగిసిన ఐసీసీ టీ-20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారతజట్టులోని 15మంది ఆటగాళ్లకు బీసీసీఐ రూ. 5 కోట్లు చొప్పున నజరానాగా అందచేసింది.

ఏటా రెండుమాసాలపాటు జరిగే ఐపీఎల్ ద్వారా రూ.2 నుంచి 15 కోట్ల వరకూ సంపాదిస్తున్న క్రికెటర్లు.. బీసీసీఐ వార్షిక కాంట్రాక్టుల ద్వారా రూ. కోటి నుంచి 7 కోట్ల వరకూ గ్యారెంటీమనీగా అందుకొంటున్నారు. అదీచాలదన్నట్లుగా... టెస్టుమ్యాచ్‌కు రూ.15 లక్షలు, వన్డేకి రూ 7 లక్షలు, టీ-20 మ్యాచ్‌కు రూ. 3 లక్షల మ్యాచ్ ఫీజుగా అందుకొంటున్నారు. చివరకు స్మృతి మంధన లాంటి మహిళా క్రికెటర్లు సైతం ఏడాదికి రూ. 5 కోట్ల వరకూ వివిధ రూపాలలో ఆర్జిస్తున్నారు. క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకొన్న ఆటగాళ్లు సైతం క్రికెట్ వ్యాఖ్యానం, అంపైరింగ్, మ్యాచ్ రిఫరీలుగా, శిక్షకులు, ప్రధాన శిక్షకులుగా రూ. కోట్లు సంపాదిస్తున్నారు.

భారత టెన్నిస్‌లో సానియా మీర్జా, బ్యాడ్మింటన్‌లో సైనా నెహ్వాల్, సింధు, బాక్సింగ్ లో మేరీకోమ్, నిఖత్ జరీన్, చదరంగంలో కోనేరు హంపి రూ. 10 కోట్ల నుంచి రూ.100 కోట్ల రూపాయల వరకూ సంపాదించినవారే. బ్యాడ్మింటన్ ద్వారా కోట్ల రూపాయలు ఆర్జించిన పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్ లాంటి క్రీడాకారులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. సబ్ కలెక్టర్ ఉద్యోగాలు ఇచ్చి ప్రోత్సహిస్తే, బాక్సర్ నిఖత్ జరీన్, క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌లకు తెలంగాణా ప్రభుత్వం డీఎస్పీ ఉద్యోగాలతో పాటు రూ.ఆరు కోట్లపైగా విలువ కలిగిన చెరో 600 గజాలు ఇళ్ల స్థలాలు ఇచ్చి గౌరవించింది.

పారిస్ వేదికగా ఇటీవలే ముగిసిన ఒలింపిక్ క్రీడల్లో భారత్ కు పతకాలు సంపాదించి పెట్టిన క్రీడాకారులను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు భారీనగదు బహుమతులు, ఉన్నత ఉద్యోగాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

పురుషుల జావలిన్ త్రోలో రజత పతకం సాధించిన నీరజ్ చోప్రా కు భారత ఒలింపిక్ సంఘం రూ.50 లక్షలు,హరియాణ ప్రభుత్వం 4.5 కోట్ల అందచేయనున్నాయి. అతను ప్రస్తుతం భారత సైనికదళంలో ఉన్నత స్థాయి ఉద్యోగి ఉన్నాడు. మహిళల షూటింగ్‌లో రెండుకాంస్య పతకాలు సాధించిన మను బాకర్ కు కేంద్ర క్రీడామంత్రిత్వశాఖ రూ. 30లక్షలు నజరానాగా అందించగా. హరియాణ ప్రభుత్వం నుంచి రూ.4 కోట్లకు పైగా నగదు బహుమతి అందుకోనుంది. కాంస్య పతక విజేత స్వప్నిల్ కుశాలేకు మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. కోటి బహుమానంతో పాటు మధ్యరైల్వేలో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా ప్రమోషన్ దక్కింది. కేంద్ర క్రీడామంత్రిత్వశాఖ నుంచి 30 లక్షల రూపాయలు సొంతం కానున్నాయి. షూటింగ్ టీమ్ విభాగంలో కాంస్య విజేత సరబ్ జోత్ సింగ్‌కు రూ. 22.50 లక్షలు సొంతమయ్యాయి.

ఒలింపిక్స్‌లో వరుసగా రెండోసారి కాంస్య పతకం సాధించిన భారతజట్టు సభ్యులకు భారత హాకీ సమాఖ్య రూ.15 లక్షల చొప్పున అందచేసింది. ఒరిస్సాకు చెందిన అమిత్ రోహిదాస్‌కు ఆ ప్రభుత్వం రూ. 4 కోట్లు కానుకగా ఇచ్చింది.

భారతజట్టులోని పంజాబ్‌కు చెందిన క్రీడాకారులకు ఆ రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి వంతున ఆ ప్రకటించింది. దీనిని బట్టి క్రీడలంటే ఆటలే కాదోయ్! కోట్లు, ఉన్నత ఉద్యోగాలు అనుకోక తప్పదు.



**కృష్ణారావు చొప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# దేశం కోసం మరణించడం కాదు ఇప్పుడు దేశం కోసం జీవించాలి

**తిరుపతి:** "వికసిత్ భారత్ రూపొందించడంలో మేధావుల పాత్ర" అనే పేరుతో ఆగస్ట్ 19న సమాలోచన తిరుపతి శాఖ ఇక్కడి సంస్కృత్ విద్యాపీఠ్‌లో సమావేశాన్ని నిర్వహించింది.

ప్రముఖ న్యూరాలజిస్ట్ డా॥ టి.ఎమ్. నగేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి ఒక్కరు మంచి ఆర్థికనిర్వహణ, ఆధ్యాత్మిక దిశను కలిగి ఉండవలసిన అవసరాన్ని చెప్పారు. తమ పిల్లలకు సరైన దిశా నిర్దేశం చేయడంలో తల్లిదండ్రులు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తారని, సమాజ అభివృద్ధికి మేధావి వర్గం ఒక చుక్కాని లాగా పని చేయాలని అన్నారు.

ముఖ్యవక్త ఆర్‌ఎస్‌ఎస్ సహ క్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్ మాట్లాడుతూ, దేశం కోసం మరణించడం కాదు, దేశం కోసం జీవించడం గొప్పవిషయం అన్నారు. భారతదేశంలో జీవించడం ఒకటే గర్వ కారణం కాదు, దేశం కోసం ఏలా జీవించాలో ఆలోచించాలి. సామాన్య పౌరుడు నేను బాగుంటే దేశం బాగుంటుందనుకుంటాడు. కానీ దేశం బాగుంటే నేను బాగుంటాను, దేశ వికాసమే నా వికాసం, దేశ అభ్యున్నతే నా అభ్యున్నతి అని ఆలోచించే మేధావి వర్గం నేటి సమాజానికి హిందూ ధర్మానికి కావాలి. భగవంతుడు నాకు ఇచ్చిన అనేక రకాల సామర్థ్యాన్ని దేశ ఉన్నతి కోసం, వికాసం కోసం ఏ విధంగా ఉపయోగించాలి నేను దేశం కోసం ఏ విధంగా జీవించాలని ఆలోచించాలి. ఈ దేశానికి, మన ధర్మానికి నష్టం కలిగించే ఏ పనిని, నాకు లాభం కలిగినప్పటికీ నేను చెయ్యను. నాకు నష్టం కలిగించినప్పటికీ మేలు చేసేటటువంటి పనులు మాత్రమే చేస్తానని అనుకోవాలి అని ఆయన పిలుపునిచ్చారు.

పంచభూతాలను ఆరాధిస్తూ కాపాడుకునే జీవన విధానాన్ని అలవర్చుకోవాలి. పంచభూతాలను నిర్వీర్యం చేసే విధానానికి స్వస్తి పలకాలి. ఆధునికీకరించడం ముఖ్యం కాని పాశ్చాత్యీకరణ కాదు అని, మతాన్ని ఆధ్యాత్మికీకరించడం, మనిషిని జాతీయం వాదం వైపు నడిపించడం తక్షణావసరమని, జాతీయ వాదమే అన్ని సమస్యల పరిష్కార మంత్రమని అన్నారు.

ఆర్థిక అభివృద్ధి, సైన్స్ అండ్ టెక్నాలజీ, సృజనాత్మకత, నూతన ఆవిష్కరణలు మొదలైన అన్ని రకాల అభివృద్ధి చెందాల్సిందే, కానీ వాటితో పాటుగా మన సంస్కృతి సంప్రదాయాలు, ధర్మం సమాజాన్ని




ప్రసంగిస్తున్నవారు భరత్‌కుమార్

ఎంత ప్రభావితం చేస్తున్నాయి, ఏ విధంగా అభివృద్ధి చెందుతున్నాయి మనం ఆలోచించాలి. గత 75 ఏళ్లుగా మన పాలకులు విదేశీ ఆలోచనలను, భావనలను ఆశ్రయించారని ఆయన వాపోయారు.

ఆధునిక విలువలు, అభ్యాసాలను ఏకీకృతం చేస్తూ భారతదేశం గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించడంలో, ప్రోత్సహించడంలో, సమాజంలోని అసమానత, పేదరికం, వివక్ష వంటి సామాజిక సమస్యలను పరిష్కరించడానికి మేధావులు ఆలోచించాలని అభిప్రాయపడ్డారు.

సమాజం కోసం, దేశం కోసం నేను ఉత్తమంగా ఏమి చేయగలను, ఏమి ఇవ్వగలను అనే ఆలోచనను మనం ముందుకు తీసుకెళ్లాలి. ఇటువంటి ఉన్నతమైన ఆలోచనతో ప్రపంచానికి విశ్వగురువుగా మన భారతదేశాన్ని తీసుకెళ్లాలి. ఆదర్శవంతంగా ఆచరణాత్మకంగా మనం ఉన్నప్పుడు మాత్రమే ప్రపంచం మనతో కలిసి నడుస్తుంది. మన సిద్ధాంతం ఎంత గొప్పదైనప్పటికీ, గొప్ప గ్రంథాలు, పుస్తకాలు ఉన్నప్పటికీ ప్రపంచం మనతో కలిసి రాదు, కానీ మనల్ని గౌరవిస్తుంది.

భారతదేశంలో గత 10 సంవత్సరాలుగా వస్తున్న మార్పుల కారణంగా మన దేశం పట్ల, హిందుత్వం పట్ల, మన జీవన విధానం పట్ల గౌరవం, విశ్వాసం ప్రపంచానికి కలిగింది. కానీ భారతదేశంతో కలిసి వస్తే మనం కూడా అభివృద్ధి చెందుతాం అని ప్రపంచ దేశాలకు నమ్మకం కుదరలేదు. ఆ విశ్వాసాన్ని కలిగించే విధంగా సమాజాన్ని తయారు చేయడం మనందరి బాధ్యత. అటువంటి నమ్మకం కలిగినప్పుడు మాత్రమే ప్రపంచ దేశాలన్నీ కూడా మనతో కలిసి వస్తాయి. భారతీయుడు భారతీయతను కలిగి ఉన్నప్పుడు మాత్రమే ప్రపంచ దేశాలు మనతో కలిసి వస్తాయి. భారతీయుడు భారతీయతను వదులుకున్నప్పుడు ప్రపంచంలో ఏ దేశం గౌరవించదని హెచ్చరించారు.

ధర్మాన్ని, సంస్కృతిని ఆచరించి, గౌరవించే సమాజం ఉన్నప్పుడు మాత్రమే ప్రపంచం మనల్ని గౌరవించి మనతో కలిసి వస్తుంది. అటువంటి సమాజాన్ని నిలబెట్టుకొని ముందుకు నడిపించాల్సిన బాధ్యత మన అందరి పైన ఉంది. ఆ విధంగా జీవిస్తారని భరత్‌కుమార్ అన్నారు.

ఈ కార్యక్రమంలో సమాలోచన రాష్ట్ర మహిళా సంయోజక్ డా॥లక్ష్మీప్రియ, జిల్లా కన్వీనర్ డా॥మార్గాన్ని సోమశేఖర, కమిటీ సభ్యులు డాక్టర్ హారుణ్, రాజశేఖర్, విశ్వనాథ్, లక్ష్మీనారాయణ, రాంబాబు, నగరంలోని ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ★



# జాగృతి ఆధ్వర్యంలో పోస్ట్‌మన్‌లకు సన్మానం

**వేములవాడ :** ఆగస్ట్ 13న వేములవాడలో జాగృతి తరపున పోస్ట్ ఆఫీస్ సిబ్బందిని సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కరినగర్ విభాగ్ వ్యవస్థ ప్రముఖ్ దావులూరి మురళీధర్, జిల్లా ప్రచారప్రముఖ్ గీకురు శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

సబ్ పోస్ట్‌మాస్టర్ రాజు మాట్లాడుతూ వృత్తిలో భాగంగా తాము సేవలందిస్తున్నామని, ఇలా తమ సేవలను గుర్తించి మమ్మల్ని, తమ సిబ్బందిని సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందని, ఇంకా ఉత్సాహంగా పని చేయడానికి ఇలాంటి ప్రోత్సాహం దోహదపడుతుందని జాగృతి ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

దావులూరి మురళీధర్ మాట్లాడుతూ జాగృతి వార పత్రిక ఇంటింటికీ చేరవేయడంలో పోస్ట్‌ఆఫీస్ సిబ్బంది పాత్ర అమూల్యమైనదని, దేశంలో జరుగుతున్న సంఘటనలు, అంతర్జాతీయ వార్తలను ముఖ్యంగా జాతీయవాద వార్తలను, విశ్లేషణలను పాఠకులకు చేరవేయడంలో జాగృతి ముందుం టుందని, అయితే పత్రికను పాఠకులకు అందించ డంలో వారధులు మాత్రం పోస్టాఫీసు సిబ్బందేనని, ఎండనక, వాననక సేవలందిస్తున్నారని అందుకే వారికి జాగృతి యాజమాన్యం తరపున కృతజ్ఞతలు తెలుపుతూ చిరుకానుకగా రేయిన్‌కోట్‌లు అందిస్తున్నా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ కార్యకర్తలు గర్శకుర్తి వెంకటేశ్వర్లు, నందిశివ, కొక్కు గోపాల్, చిలుకగట్టు సబ్ పోస్టాఫీసు వేములవాడ సిబ్బంది పాల్గొన్నారు.

* * *

**సిరిసిల్ల :** ఆగస్టు 7న జాగృతి పత్రిక ఆధ్వర్యంలో సిరిసిల్ల ప్రధాన పోస్ట్ ఆఫీస్ కార్యాలయ సిబ్బందికి సన్మానించారు. పోస్ట్‌మాస్టర్ అనిల్ మాట్లాడుతూ తమ సేవలను గుర్తించి తమకు సన్మానం చేయడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఈ పత్రికను నేను కూడా చదువుతాను. చాలా విలువైన సమాచారం ఉంటుంది. సమాజానికి 'ఈ పత్రిక చాలా అవసరమని, ఈ కార్యక్రమంతో మా బాధ్యతను ఇంకా పెంచార'ని చెపుతూ మా సిబ్బంది తప్పకుండా సమయానికి అందజేస్తారని తెలిపారు. మా సిబ్బంది తరపున జాగృతి పత్రిక వారికి ధన్యవాదాలు తెలియచేస్తున్నానని అన్నారు.

ఈ కార్యక్రమంలో విభాగ్ వ్యవస్థ ప్రముఖ్ దావులూరి మురళీధర్, జిల్లా ప్రచార ప్రముఖ్ గీకురు శ్రీనివాస్, నగర కార్యవాహ శ్రీకాంత్, నగర సంపర్క ప్రముఖ్ లక్ష్మీనారాయణ, సహ శారీరక ప్రముఖ్ వంశీకృష్ణ, వ్యవస్థా ప్రముఖ్ భాస్కర్, పోస్టల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ★








**ఆర్మూర్:** ఆగస్టు 17న రక్షాబంధన్ ఉత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రధానాచార్యులు లక్ష్మీ నరసయ్య పోస్ట్‌మెన్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నగర సంఘచాలక్ పోల్కం నారాయణ పాల్గొన్నారు.



**ఇస్సాపల్లి :** ఇందూరు జిల్లా ఆర్మూరు మండలం ఇస్సాపల్లి గ్రామంలో ఆగస్ట్ 19న జరిగిన రక్షాబంధన్ ఉత్సవంలో ఆ గ్రామ పోస్ట్‌మాన్‌కు జాగృతి తరపున సన్మానిస్తున్న ఇందూరు జిల్లా కార్యవాహ వారె దస్తగిరి, నందిపేట్ ఖండ కార్యవాహ గుజ్జేడి గణేశ్ తదితరులు.

# బాల జాగృతి

## తెలుసుకుందాం

## పోలమాంబ దేవాలయం



ఉత్తరాంధ్ర ప్రజలకు, విశాఖపట్నం చుట్టు పక్కల ఉన్న ప్రజలకు పోలమాంబ దేవత ఆరాధ్య దైవం. విశాఖలోని పెద్దవాల్తేరులో ఈ ఆలయం కొలువుదీరింది. పిలిస్తే పలికే దైవంగా, తమ ఇంటి ఇలవేల్పుగా, సముద్ర దేవతగా, సర్ప దేవతగా, సశ్య దేవతగా భక్తులు పలు రూపాలతో కొలుస్తారు. ప్రతి మంగళవారం, శుక్రవారాల్లో భక్తులు ఈ పుణ్యక్షేత్రానికి తరలివస్తారు. ప్రతి సంవత్సరం ఉగాది పర్వదినాన, శ్రావణ మాసంలో ఈ పోలమాంబ దేవతకు ప్రత్యేక పూజలు, ఉత్సవాలు నిర్వహిస్తారు.

## కథ | ఏనుగు - చీమలు



అనగనగా ఓ అడవి.. ఆ అడవిలో అనేక రకాల జంతువులు నివసిస్తూ ఉండేవి.

ఆ అడవిలో ఓ ఏనుగు కూడా నివసించేది. అయితే దానికి అహంకారం చాలా ఎక్కువ.

తన భారీ శరీరాన్ని చూసుకుని గర్వపడేది.

చిన్న జంతువులంటే ఆ ఏనుగుకు చాలా చిన్నచూపు. తన కంటే చిన్న జంతువులని ఎప్పుడూ ఇబ్బంది పెట్టాలని చూస్తూ ఉండేది.

ఒక రోజు ఆ ఏనుగు అడవి గుండా నడుచుకుంటు వెళ్తోంది.

ఆ దారిలో దానికో చీమల పుట్ట కనిపించింది. దానిని అలాగే తొక్కుకుంటూ ముందుకు వెళ్లింది.

అప్పుడు ఆ చీమలు 'అంత భారీగా ఉన్నావు కదా..! కళ్లు కనబడటం లేదా? చూసుకోకుండా మా పుట్టనంతా

## పద్యము

**పసుల వన్నె వేరు పాలెల్ల ఒక్కటి**
**పుష్పజాతి వేరు పూజ ఒకటి**
**దర్శనంబులారు దైవంబు ఒక్కటె**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**భావం :** మనుష్యులంతా ఒక్కటే. పశువులు వేరువేరు రంగులలో ఉన్నప్పటికీ అవి ఇచ్చే పాలు మాత్రం తెల్లగానే ఉంటాయి. అలాగే మనుషులు వివిధ వర్ణాల వారైనా మనసులు ఒకటిగా మసలుకోవాలంటాడు వేమన. పూవులు వేరువేరు రంగులతో ఉన్నా పూజకు వినియోగపడటంలో అవన్నీ ఒక్కటే గదా! అని అర్థం.

## శ్లోకము

**విషాదప్యమృతం గ్రాహ్యం**
**బాలాదపి సుభాషితమ్**
**అమిత్రాదపి సద్వృత్త**
**మమేధ్యాదపి కాఞ్చనమ్**

**భావం :** అమృతాన్ని విషం నుంచైనా, మంచి మాటను బాలకుని నుంచైనా, మంచి నడవడిని శత్రువుని వలనైనా స్వీకరించాలి, బంగారం అపవిత్రమైన దాని నుంచైనా గ్రహించవచ్చు.

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| పంజాబ్ | గేట్‌వే ఆఫ్ ఇండియా |
| దామోదర్ నది | ల్యాండ్ ఆఫ్ ఫైవ్ రివర్స్ |
| నీలగిరి కొండలు | సిటీ ఆఫ్ ప్యాలెసెస్ |
| కోల్‌కతా | బెంగాల్ దుఃఖదాయని |
| ముంబయి | బ్లూ మౌంటెన్స్ |

**సమాధానాలు :** పంజాబ్–ల్యాండ్ ఆఫ్ ఫైవ్ రివర్స్; దామోదర్ నది–బెంగాల్ దుఃఖదాయని; నీలగిరి కొండలు–బ్లూ మౌంటెన్స్; కోల్‌కతా–సిటీ ఆఫ్ ప్యాలెసెస్; ముంబయి–గేట్‌వే ఆఫ్ ఇండియా.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### ఓమియో కుమార్ దాస్




లోక్ నాయక్‌గా ప్రసిద్ధి చెందిన ఓమియో కుమార్ దాస్ 1895 మే 5న జన్మించారు. అస్సాంలో 1930లో జరిగిన శాసనోల్లంఘన ఉద్యమ నాయకులలో ఆయన కూడా ఒకరు. పోరాటంలో భాగంగా అనేకసార్లు జైలు శిక్ష అనుభవించారు. మహాత్మా గాంధీ ఆత్మకథ 'ది స్టోరీ ఆఫ్ మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రూత్'ను అస్సామీ భాషలోకి అనువదించారు. 1975, జనవరి 23న మరణించారు.



తొక్కేశావ్' అని అరిచాయి.

అందుకు ఏనుగు.. 'మీరంతా చిన్న ప్రాణులు. మీకెందుకు అంత కోపం.. కొంచెం తగ్గి ఉండండి. లేదంటే మిమ్మల్ని కూడా తొక్కేస్తాను' అంటూ చీమల్ని బెదిరించింది.

దాంతో తీవ్ర ఆగ్రహానికి గురైన చీమలు.. ఏనుగుకు ఎలాగైనా బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నాయి.

వెంటనే చకచకా చీమలన్నీ ఏనుగు పైకి ఎక్కాయి. కొన్ని చీమలు ఏకంగా చెవిలోకి, ముక్కులోకి దూరి మరీ కుట్టడం ప్రారంభించాయి. ఇంకొన్ని చీమలు ఏనుగు కంట్లో కూడా కుట్టాయి. దీంతో ఏనుగుకి కళ్లు కనపడక ఒక చెట్టును ఢీకొట్టి కింద పడిపోయింది.

బలం ఎక్కువగా ఉంది కదా అని పొగరుగా ప్రవర్తించకూడదని ఏనుగుకు అర్థమైంది. ★

## జనరల్ నాలెడ్జ్

1. 70వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఉత్తమ తెలుగు చిత్రంగా ఏ మూవీ నిలిచింది?
2. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి ఎవరు?
3. ల్యాండ్ ఆఫ్ థౌజండ్ ఎలిఫెంట్స్ అని ఏ దేశాన్ని పిలుస్తారు?

జవాబులు: 1. కార్తికేయ-2; 2. మమతా బెనర్జీ; 3. థాయిలాండ్.

## మెదడుకు మేత

చక్కని మానుకి చిక్కని గజ్జలు?

జవాబు : నక్షత్రాలు

## మంచిమాట

కనిపించేదాన్ని చూడటానికి కళ్లు చాలు, కనిపించనిదాన్ని చూడటానికి వివేకం కావాలి!



# వారఫలాలు

26 ఆగస్ట్ - 1 సెప్టెంబర్, 2024

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

అనుకున్న కార్యక్రమాలను కొంత నిదానిస్తాయి. ఆలోచనలు పరిపరివిధాలుగా ఉంటాయి. ఆస్తుల వివాదాలు ఇబ్బంది కలిగించవచ్చు. బంధువులు, స్నేహితులతో కొన్ని వివాదాలు. వ్యాపారులు ఆచితూచి వ్యవహరించాలి. ఉద్యోగస్తులకు ఆకస్మిక మార్పులు ఉండవచ్చు. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలకు పర్యటనలు వాయిదా. 28,29 తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. లక్ష్మీస్తుతి మంచిది.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

కార్యక్రమాలు సకాలంలో పూర్తిచేస్తారు. అదనపు ఆదాయం సంతృప్తినిస్తుంది. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు. వాహనాలు, భూములు కొంటారు. దేవాలయాలు సందర్శిస్తారు. ఆరోగ్య సమస్యలు తీరతాయి. ఉద్యోగులకు విధుల్లో ప్రతిబంధకాలు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలు, రచయితలు, క్రీడాకారులకు విదేశీయానం. 30,31 తేదీల్లో వృథా ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. బంధువులతో తగాదాలు. ఆంజనేయ దండకం పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

రాబడికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఆలోచనలు స్థిరంగా ఉండవు. బంధువులు, స్నేహితులతో అకారణంగా విభేదాలు. ఇంటి నిర్మాణాలు ముందుకు సాగవు. వ్యాపారులు పెట్టుబడుల్లో ఆచితూచి వ్యవహరిం చాలి. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలు పడవచ్చు. పరిశోధకులు, రాజకీయ వేత్తలు, కళాకారులకు అవకాశాలు నిరుత్సాహం. 31,1 తేదీల్లో శుభవర్తమానాలు. సోదరుల నుంచి పిలుపు. కనకధారాస్తోత్రం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

మొదట్లో ఇబ్బంది పడినా క్రమేపీ ఆదాయం పెరుగుతుంది. ముఖ్య కార్యక్రమాలు సజావుగా సాగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు. ఒక ఆహ్వానం ఉత్సాహాన్నిస్తుంది. స్నేహితులతో సఖ్యత. వ్యాపారులు లాభాలు అందుకుని ఊరట. ఉద్యోగ వర్గాలకు ప్రమోషన్‌లు. క్రీడాకారులు, రచయితలు, పారిశ్రామికవేత్తలకు ఆకస్మిక విదేశీ పర్యటనలు. 27,28 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. కొత్తగా అప్పులు చేస్తారు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

రావలసిన సొమ్ము సకాలంలో అందుతుంది. కుటుంబంలో శుభకార్యాలు. ఆస్తి వివాదాలు తీరతాయి. వాహన, గృహయోగాలు. సాహిత్య విషయాలపై ఆసక్తి. వ్యాపారులు పెట్టుబడులు అందుకుంటారు. ఉద్యోగులకు విధుల్లో అనుకూలత. రాజకీయవేత్తలు, క్రీడాకారులు, రచయితలకు సన్మానాలు జరిగే వీలుంది. 31,1 తేదీల్లో వివాదాలు. శారీరక రుగ్మతలు. శివపంచాక్షరి పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

కొత్త కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఆత్మీయుల ఆదరణ చూరగొంటారు. ప్రముఖులతో పరిచయాలు. చిన్ననాటి స్నేహితులతో ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారులు మరింత పుంజుకుంటారు. ఉద్యోగులకు ఊహించని హోదాలు లభిస్తాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, క్రీడాకారుల యత్నాలు సఫలమవుతాయి. 26,.27 తేదీల్లో వివాదాలు. వృథా ఖర్చులు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**


ఆకస్మిక ప్రయాణాలతో వ్యయప్రయాసలు. చేపట్టిన కార్యక్రమాలు మధ్యలోనే వాయిదా వేస్తారు. ముఖ్యనిర్ణయాలు మార్చుకుంటారు. ఆదాయం కొంత తగ్గి అప్పులు చేస్తారు. వ్యాపారులు మరింత నిదానంగా వ్యవహరించాలి. ఉద్యోగులకు ఆకస్మిక మార్పులు. 28,29 తేదీలలో శుభవార్తలు. వాహన యోగం. ఆహ్వానాలు అందుతాయి. శ్రీరామరక్షా స్తోత్రం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

కొన్ని కార్యక్రమాలను శ్రమానంతరం పూర్తి చేస్తారు. ఆస్తుల ఒప్పందాలలో ఆటంకాలు. ఆరోగ్యం పై శ్రద్ధ. ఆధ్యాత్మిక కార్యక్రమాలు. ఇంటి నిర్మాణాల్లో అవాంతరాలు. వ్యాపారులు స్వల్ప లాభాలు. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులు, పరిశోధకులకు ఒత్తిడులు తప్పవు. 30,31 తేదీలలో విందువినోదాలు. ఆకస్మిక ధనలబ్ధి. హనుమాన్ ఛాలీసా పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

కొత్త కార్యక్రమాలు ప్రారంభిస్తారు. రాబడి




సింహంభట్ల సుబ్బారావు

6300674054


మరింత పెరుగుతుంది. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. గతం గుర్తుకు తెచ్చుకుంటారు. ఉద్యోగులకు ఉన్నత హోదాలు. వ్యాపారులు భాగస్వాములతో వివాదాలు పరిష్కరించుకుంటారు. క్రీడాకారులు, కళాకారులకు అవార్డులు. 30,31 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. గణేశాష్టకం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ఆశించినంత ఆదాయం సమకూరుతుంది. రుణ బాధలు తొలగుతాయి. జీవిత భాగస్వామి సలహాలు స్వీకరిస్తారు. బంధువుల నుంచి శుభ వార్తలు అందుతాయి. వ్యాపారుల యత్నాలు సఫల మవుతాయి, లాభాలు మరింత దక్కుతాయి. ఉద్యోగు లకు విధుల్లో అనుకూల పరిస్థితులు. రాజకీయ వేత్తలు, క్రీడాకారులు, పరిశోధకులు మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతారు. 27,28 తేదీల్లో అనారోగ్యం, దూరప్రయాణాలు. ఆదిత్య హృదయం పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ఆదాయం కొంత తగ్గి నిరాశ చెందుతారు. బంధువులు, స్నేహితులతో అకారణంగా విభేదాలు నెలకొంటాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు నత్తనడకన సాగుతాయి. ఆలోచనలు స్థిరంగా ఉండవు. వ్యాపారులకు కొద్దిపాటి చికాకులు. ఉద్యోగులకు ఒడిదుడుకులు. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, పరిశోధకులకు విదేశీ పర్యటనలు. 31,1 తేదీల్లో శుభవార్తలు. రాఘవేంద్రస్వామి స్తోత్రాలు పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ముఖ్యమైన కార్యక్రమాలలో అవాంతరాలు ఎదురవుతాయి. కాంట్రాక్టులు చేజారవచ్చు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఆస్తుల వివాదాలు. ఇంటి నిర్మాణయత్నాలు ముందుకు సాగవు. స్వల్ప ఆరోగ్యసమస్యలు. వ్యాపారులకు చికాకులు. ఉద్యోగులకు మార్పులు సంభవం. రాజకీయవేత్తలు, క్రీడాకారులు, పరిశోధకులకు అంచనాలు తప్పుతాయి. 26,27తేదీల్లో ధనప్రాప్తి. విందు వినోదాలు. నృసింహస్తోత్రాలు పఠించండి.

# పదరసం-478

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | 3 | | 4 | | 5 |
| | | | | | | | 6 | | |
| | | 7 | | 8 | | | | | |
| 9 | | | | | | 10 | | 11 | |
| | | 12 | | | | | | 13 | |
| 14 | 15 | | | 16 | | | 17 | | |
| | 18 | | 19 | | | | | | 20 |
| | | | | | 21 | | | | |
| 22 | | 23 | | | | | | | |
| | | | | 24 | | | | 25 | |

## ఆధారాలు

**అడ్డం**

1) వ్యర్థమైన కోరిక
3) పండుగలలో, అక్కరలలో గుమ్మానికి కట్టేది (3)
6) ఒకచోటి నుంచి మరోచోటికి తీసుకెళ్లడం (3)
7) అపహాస్యం (4)
9) పౌరుషపు కోపం (2)
10) కూర్చునేది సరిగా లేదు (3)
12) పందికొక్కులు మొదలైనవి బయటకు రావడానికి కలుగులోకి పొగ పంపడం (3)
13) అటునించి దురాక్రమణ (2)
14) మాద్రీ తనయుని పేరులో సగం (2)
16) "వందేమాతర గీతం" రచించినది... ఛటోపాధ్యాయ (4)
18) పోలీసులు చేయు తనిఖీ (4)
21) ఇతని నూటొక్కవ తప్పుకు శ్రీకృష్ణుడు శిక్షవేశాడు (5)
22) ఇంటిల్లా ఉండే పొద సరిగా లేదు (4)
24) కను చెవుల మధ్యప్రదేశం (3)
25) మంచి (2)

**నిలువు**

1) ఎవరూ పట్టించుకోని గోడును ఇలా అంటారు (6)
2) కష్టం (3)
3) సాయం (3)
4) తలక్రిందులైన నగ (4)
5) ఆట పట్టు (3)
8) బరువు బాధ్యత (5)
10) మంచి గంధం పైకొచ్చింది (3)
11) చలవ చేయడానికి ఈ నల్లని గింజలను నీటిలో నాన్చి సేవిస్తారు (2)
15) నిరాశతో ఎంతోకాలంగా తల్లడిల్లుతూంటే ఇలా అంటారు (4)
17) పైకొచ్చిన అగస్త్య మహర్షి భార్య (4)
19) కోశాధికారి (3)
20) 2 నిలువుకు బహువచనం (4)
21) తర్ఫీదు (3)
22) స్నేహం (2)
23) ఆయాసం, సామర్థ్యం (2)

## పదరసం - 477 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| తా1 | రు | మా2 | రు | | | భా3 | | బో4 | ణీ |
| హ | | య | | తి5 | రో | గ | మ | నం | |
| తు6 | త్తి | ని | య | లు | | హా | | | మ7 |
| | | మ | | శ్వ | | రం8 | ప9 | ల | స |
| | గ10 | చ్చ | కా | య | లు | | లా | | క |
| నా11 | డి | | | ల | | | య | | |
| | యా12 | మి | నీ13 | | పి14 | ల్ల | న | గ్రో | వి |
| తీ15 | రం | | రా | | ట్ట | | మం | | |
| ప | | నం16 | జ | రో | గో | | త్రం17 | ళ | క18 |
| రం19 | పం | | నం | | డ20 | బ్బు | | | న్య |

సి ని మా



# జాతీయ సినిమా అవార్డులు మనకెందుకు రాలేదు!?

కేంద్ర సమాచార, ప్రసార శాఖ 70వ జాతీయ సినిమా అవార్డులను ఇటీవల ప్రకటించింది. నేషనల్ ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ నేతృత్వంలో ప్రముఖ దర్శకుడు, కూర్పరి రాహుల్ రావెల్ నేతృత్వంలోని జ్యూరీ సభ్యులు ఎంపిక చేసిన జాబితాను అట్టహాసంగా ప్రకటించారు. గత యేడాది ఏకంగా వివిధ కేటగిరిల్లో 11 అవార్డులను అందుకున్న తెలుగు సినిమా ఈ ఏడాది కేవలం ఒకే ఒక అవా ర్డును, అదీ ఉత్తమ ప్రాంతీయ చిత్రం కేటగిరిలో మాత్రమే అందుకోవడం అందరినీ తీవ్ర నిరాశ పరచింది.


కొన్నేళ్ళ పాటు తెలుగు సినిమా రంగానికి జాతీయ స్థాయిలో తగిన గుర్తింపు రాలేదన్నది వాస్తవం. తెలుగు వారు పాటలు, పోరాటాలు ఉండే వాణిజ్యపరమైన చిత్రాలను మాత్రమే తీస్తారు కాబట్టి అవార్డులు రాకపోవడం సహజం అనే విమర్శ తరచూ వినిపిస్తూ ఉండేదే. మనకు అవార్డులు ఎందుకు రావడం లేదనే ప్రశ్న ఉదయించినప్పుడల్లా ఎంతో మంది అదే సాకును చూపుతూ ఉంటారు. ఏడాదికి వచ్చే దాదాపు రెండు వందల చిత్రాలలో అన్నీ కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న చిత్రాలే అయితే... అవి ఆ స్థాయిలో విజయాన్ని ఎందుకు నమోదు చేసుకోవడం లేదు!? వాటిలో ఓ పదిశాతం సినిమాలైనా సమాజానికి ఉపయోగపడే సందేశాన్ని ఇచ్చేవి లేవా!? తరచి చూస్తే మనకు సమాధానం కచ్చితంగా దొరుకుతుంది. ఏ భాషలోనైనా కమర్షియల్ ఎలిమెంట్స్‌ను జత చేసే సందేశాత్మక చిత్రాలు తీస్తారు. అయితే... ఫలానా భాషలో సినిమాలు అద్భుతం అనే ఓ రకమైన భావన బలంగా ఏర్పడిన తర్వాత ఆ భాషా చిత్రాలను ఎంపిక చేసే క్రమంలో సహజంగానే న్యాయ నిర్ణేతలు తమకు తెలియకుండా వాటిపై మొగ్గు చూపించే ఆస్కారం ఉంది. అంటే ఓ రకమైన 'బజ్'ను క్రియేట్ చేసి, న్యాయ నిర్ణేతలను వారికి తెలియకుండానే ప్రభావితం చేసే పరిస్థితి ఉంటుంది. ఇదొక రకం అయితే, జ్యూరీలోని వ్యక్తులు, వారికి ఉన్న పరిచయాలు, సినిమా రంగంతో వారికి ఉండే సంబంధాలు కూడా అవార్డుల ఎంపికపై కచ్చితంగా ప్రభావితం చూపుతుంది. అందువల్లే కొన్ని భాషా చిత్రాలకు ప్రతిభతో నిమిత్తం లేకుండా అవార్డులు వచ్చే స్తుంటాయి. ఇదే తెలుగు సినిమాకు అవార్డులు రాకుండా కొన్నేళ్లపాటు పాటు చేసింది. అదే సమయంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఉండడం, ఇక్కడ దాని ప్రత్యర్థి తెలుగుదేశం పార్టీ గెలవడమూ, దాని అధినేత ఎన్టీ రామారావు సినీ రంగంలో మూల స్థంభం వంటి వ్యక్తి కావడం చేత కూడా అవార్డుల విషయంలో తెలుగు సినిమాను నిర్లక్ష్యం చేశారనే విమర్శలు వినిపిస్తుంటాయి. 'శంకరాభరణం', 'మేఘసందేశం' చిత్రాలకు నాలుగేసి కేటగిరిల్లో జాతీయ పురస్కారాలు లభించాయి. ఆ సమయంలో ఆ యా చిత్రాల దర్శక నిర్మాతలకు సన్నిహితులు కేంద్రంలోని కీలక శాఖల్లో ఉన్నారని, అలానే అవార్డుల కమిటీ సభ్యులను ప్రభావితం చేశారని కొందరు అంటారు. 'శంకరాభరణం'కు పూర్తి మెరిట్‌తో అవార్డులు వచ్చాయని, 'మేఘసందేశం'కు మేనేజ్ చేశారని అప్పట్లో విమర్శలు వచ్చాయి.

అయితే గత కొంతకాలంగా తెలుగు సినిమా తన ప్రతిభను మెరుగుపర్చుకోవడంతో ఈ భాషా చిత్రాలను నిర్లక్ష్యం చేయలేని పరిస్థితి జాతీయ అవార్డులు కమిటీలో నెలకొంది. మన దర్శక నిర్మాతలు అంతర్జాతీయ సాంకేతిక నిపుణుల సాయంతో జాతీయ స్థాయిలో సినిమాలను రూపొంది స్తున్నారు. నటీనటుల ఎవరికీ తీసిపోని నటననే ప్రదర్శిస్తుండడంతో అనివార్యంగా తెలుగు సినిమాను గుర్తిస్తూ, తగినన్ని అవార్డులు ఇస్తూ వస్తున్నారు. గత ఏడాది ఏకంగా 11 అవార్డులు రాగా, వాటిలో 'ఆర్.ఆర్.ఆర్.' చిత్రానివే ఆరు ఉన్నాయి. తెలుగు సినిమాకు ఇంత గౌరవం గతంలో ఎప్పుడూ దక్కలేదు. దాంతో ఈసారి కూడా భారీగానే అవార్డులు వస్తాయని భావించారు. మరీ ముఖ్యంగా పాన్ ఇండియా చిత్రాలు 'కార్తికేయ -2', 'మేజర్'తో పాటు విశేష ప్రేక్షకాదరణ పొందిన 'సీతారామం'కూ అవార్డులు వస్తాయని అనుకున్నారు. అలానే అవార్డులకు వెళ్లిన దేశభక్తిని ప్రేరేపించే చిత్రాలలో 'ఖుదీరాం బోస్' కమర్షియల్ అంశాలతో తెరకెక్కిన 'బింబిసార, అశోకవనంలో అర్జున కళ్యాణం' వంటి చిత్రాలు ఉన్నాయి. కానీ వీటిని అసలు పరిగణనలోకే తీసుకోకుండా ఈసారి జాతీయ అవార్డుల ప్రకటన జరిగిపోయింది. గతంలో కమిటీలోని తెలుగువారు, అవార్డులకు పోటీ పడిన మన సినిమాలలోని గొప్పతనాన్ని, అవార్డు ఇవ్వడం గల అర్హతలను విడమర్చి చెప్పేవారు. కానీ ఈసారి జ్యూరీలో తెలుగువారికి ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్లే ఇలా జరిగిందన్నది వాస్తవం. అవార్డులు అందుకున్న సినిమాలు, అందులోని నటీనటులు, సాంకేతిక నిపుణులతో పోల్చితే తెలుగు నుండి వెళ్లిన 'మేజర్, సీతారామం, ఖుదీరాం బోస్' వంటి సినిమాలు తీసేసేవి కావు. ప్రాంతీయ ఉత్తమ చిత్రాల కేటగిరిలో పోటీ పడినవాటిలో 'కార్తికేయ-2' ఉత్తమంగా కమిటీకి అనిపించింది. నిజానికి అది జాతీయ అవార్డులను సైతం గెలుచుకునే సత్తా ఉన్న సినిమా.


జ్యూరీ సభ్యుల ఎంపికలో పారదర్శకత లేకపోవడం వల్లే ఇలా అవార్డుల ఎంపికలో తెలుగు సినిమాకు అన్యాయం జరుగుతోందని ఓ ప్రముఖ దర్శకుడు అభిప్రాయపడ్డారు. వివిధ భాషా చిత్రాలకు సంబంధించి ఫిల్మ్ ఛాంబర్స్ ఉన్నాయి కాబట్టి వాటి ద్వారా సభ్యులను ఎంపిక చేసి జాతీయ సినీ అవార్డుల కమిటీకి రూపొందిస్తే.. ఆ యా భాషా చిత్రాలలోనూ గొప్పతనాన్ని వారు వివరించే ఆస్కారం ఉంటుందని ఆయన అంటున్నారు. మూడు, నాలుగు సినిమాలను నిర్మించే చిన్న చిన్న రాష్ట్రాల నుండి కూడా జ్యూరీ సభ్యులను ఎంపిక చేస్తున్నారని, అలానే కమిటీలో అత్యధిక శాతం ఉత్తరాది వారే ఉంటారని, ఇక దక్షిణాదిలోనూ కన్నడ, తమిళ, మలయాళ చిత్రసీమ నుండి ప్రాతినిధ్యం కచ్చితంగాఉంటుందని తెలిపారు. దాంతో సహజంగా సహజంగా ఆ యా భాషా చిత్రాలకే ఎక్కువ అవార్డులు వచ్చే ఆస్కారం ఉందని అన్నారు.


**అరుణ : సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్**

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹ 90/-


వెల : ₹ 390/-




వెల : ₹ 220/-




వెల : ₹ 360/-



వెల : ₹ 200/-



వెల : ₹ 360/-




వెల : ₹ 300/-




వెల : ₹ 200/-




వెల : ₹ 90/-




వెల : ₹ 100/-




వెల : ₹ 250/-




వెల : ₹ 799/-



వెల :₹ 495/-



వెల : ₹ 549/-



వెల : ₹ 399/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329, 8179163138

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ – 2, దూరవాణి : 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 76 Issue : 42

